Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 16 | సంచిక: 61 | కరీంనగర్ | శుక్రవారం 18 జులై, 2025 | పేజీలు: 12 | వెల: 2.00

## శ్రీలక్ష్మి పిటిషన్‌పై విచారణ...నేటికి వాయిదా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూలై17 : ఓబులాపురం అక్రమ మైనింగ్ కేసులో ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. సీబీఐ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపించారు. ఓంఎసీకి అక్రమంగా మైనింగ్ లీజు అప్పగించారని అన్నారు. ఓఎంసీకి లీజు కేటాయించేలా శ్రీలక్ష్మి చొరవతీసుకున్నారని కోర్టుకు వివరించారు. పలు దరఖాస్తులు వచ్చినా ఓఎంసీకి లీజు వచ్చేలా చూశారని తెలిపారు. ఆమె అక్రమాలకు పాల్పడ్డారనడానికి ఆధారాలు ఉన్నాయని, సాక్ష్యాధారాలు పరిశీలించిన తర్వాతే సీబీఐ కోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. సబిత, కృపానందం కేసును తనకు అన్వయించుకోవడం సరికాదని.. శ్రీలక్ష్మి రివిజన్ పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

## నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూలై17 : నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. సాయంత్రం ప్రాంతంలో పలుచోట్ల వర్షం పడడంతో నగర ప్రజలు ఊరట చెందారు. కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, ప్రగతి నగర్, కాప్రా, ఈసీఐఎల్, సైనిక్‌పురి, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, తిరుమలగిరి, బొల్లారం, బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి, చిలకలగూడ, బేగంపేట, అల్వాల్ ప్రాంతాల్లో వర్షం పడింది. పలుచోట్ల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ, ప్రైవేటు- కార్యాలయాల నుంచి వచ్చే ఉద్యోగులు అసౌకర్యానికి గురయ్యారు.

### హైకోర్టులో

## సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

### - గచ్చిబౌలి పిఎస్ కేసు కొట్టివేత



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూలై17 : తెలంగాణ హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి భారీ ఊరట దక్కింది. రేవంత్ రెడ్డిపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఓ కేసును హైకోర్టు కొట్టేసింది. కాగా, సొసైటి స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారని 2016లో రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు కొండల్ రెడ్డిపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్లో పెద్దిరాజు అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. పెద్దిరాజు ఫిర్యాదు మేరకు రేవంత్ రెడ్డి, కొండల్ రెడ్డిపై గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని రేవంత్ రెడ్డి 2020లో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు జూన్ 20న తీర్పు రిజర్వ్ చేసింది. తాజాగా గురువారంఈ కేసు తీర్పు వెల్లడించింది హైకోర్టు. ఫిర్యాదుదారుడు చేసిన ఆరోపణల్లో సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో రేవంత్ రెడ్డిపై గచ్చిబౌలి పీఎస్‌లో నమోదైన కేసును హైకోర్టు కొట్టేసింది.

# మీ కండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా అనుమతి

- ముచ్చెర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటు
- రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్ట్‌కు త్వరగా అనుమతులు
- కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరిన సిఎం రేవంత్





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

న్యూఢిల్లీ,జూలై17: తెలంగాణలో సెమీ కండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ఐటీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. రాష్ట్రంలో అధునాతన సౌకర్యాలు, పరిశోధన కేంద్రాలు ఉన్నందున మైక్రో ప్రాజెక్టులకు ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రులు ఉత్తమ్, శ్రీధర్ బాబులతో కలసి ఆయన కేంద్రమంత్రిని కలిసారు. రంగారెడ్డి జిల్లా ముచ్చెర్లలో హైటెక్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు. హైదరాబాద్ ఇప్పటికే పరిశోధనా సౌకర్యాలతో, సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులతో ముందంజలో ఉన్నదని సీఎం వివరించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఉద్యోగాలు, పెట్టుబడులు పెరగడంతోపాటు-, దేశీయ టెక్నాలజీ రంగానికి తెలంగాణ కీలక కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రూ.8 వేల కోట్ల

8లో

### అసత్య ఆరోపణలకు

## మూల్యం తప్పదు

- క్షమాపణలు చెప్పకుంటే కోర్టుకు లాగుతా
- సిఎం రేవంత్‌కు కెటిఆర్ ఘాటు హెచ్చరిక



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూలై17 :తనపై అసత్య ఆరోపణలు చేసిన సిఎం రేవంత్ రెడ్డిపై కేసు వేస్తానని కెటిఆర్ అన్నారు. మీడియాతో చిట్‌చాట్ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి తనపై అసత్య ఆరోపణలు చేశారని కేటీఆర్ అన్నారు. దిల్లీలో సీఎం చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు.సీఎం క్షమాపణ చెప్పకపోతే పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కేటీఆర్ హెచ్చరించారు. నాపై ఏదైనా డ్రగ్స్ కేసు నమోదైందా దానితో నాకు సంబంధమున్నట్లు- ఆధారాలున్నాయా దమ్ముంటే బయటపెట్టాలని సీఎంను సవాల్ చేస్తున్నానని అన్నారు. నేరుగా నా ముందు నిలబడే ధైర్యం లేక చిట్‌చాట్లు చేస్తున్నారు. ఇలా వ్యక్తిత్వ హననానికి పాల్పడటం సీఎంకు కొత్తకాదు. రేవంత్‌రెడ్డి.. మిమ్మల్ని కోర్టుకు లాగుతా. తప్పుడు ఆరోపణలకు మూల్యం

8లో

## ఉనికి చాటుకునేందుకు హరీష్ యత్నం

- పసలేని వాదనలతో ప్రజలను తప్పదోవ పట్టించే చర్యలు
- అసెంబ్లీలో దమ్ముంటే ప్రాజెక్టులపై చర్చకు కెసిఆర్ రావాలి
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ విమర్శ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూలై17 : హరీష్‌రావు ఆరు అడుగులు పెరిగాడే తప్ప అర అంగుళం మెదడు పెంచుకోలేదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ విమర్శించారు. హరీష్ రావు వాదనలలో పసలేదన్నారు. ఢిల్లీ మీటింగ్‌లో ఏం జరిగిందో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ చెప్పిన తర్వాత హరీష్ రావు పిచ్చి వాగుడు వాగుతూ తెలంగాణ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. సిఎంల భేటీపై హరీష్‌రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఘాటుగా స్పందించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మీటింగ్‌లో ఏయే అంశాలు మాట్లాడారో సీఎం

8లో

## ఫోన్ ట్యాపింగ్‌పై వివరాలు ఇస్తా: బండి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూలై17 : మాజీ సీఎం కేసీఆర్ చేసిన పాపాల వల్లే పోలీసుల నుంచి తనకు నోటీసులు వచ్చాయని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు రావాలని జూబ్లీహిల్స్ ఏసీపీ లేఖ రాసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో పోలీసుల నుంచి నోటీ-సులు వచ్చాయి. నాతో పాటు- నా కుటుంబం, సిబ్బంది ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. పడకగదిలో దంపతుల మాటలూ ట్యాప్ చేసి జీవితాలను నాశనం చేశారు. నాకు తెలిసిన, నా వద్ద ఉన్న సమాచారం పోలీసులకు తెలియజేస్తానని బండి సంజయ్ అన్నారు.

### బిసి ఆర్డినెన్స్‌పై

## కవిత సంచలన వ్యాఖ్యలు

- ఇది ముమ్మాటికీ ఆమోదయోగ్యమేనని ప్రకటన
- న్యాయనిపుణలుతో చర్చించే వ్యాఖ్యానిస్తున్నట్లు వెల్లడి
- బిఆర్ఎస్ వాళ్లు బిసి ఆర్డినెన్స్‌పై మొహం చాటేశారని విమర్శలు
- తీన్మార్ మల్లన్న విమర్శలను ఖండించకపోవడంపై ఆగ్రహం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూలై17: బీఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్సీ కవిత ఊహించని షాక్ ఇచ్చారు. ఇంటిపార్టీపై కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ కరెక్టే అని.. బీఆర్ఎస్ వాళ్ళు ఆర్డినెన్స్ వద్దని చెప్తున్నారు.. అది తప్పు అని కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ వాళ్ళు మెల్లగా తన దారికి రావాల్సిందే అని చెప్పారు. తాను న్యాయపరంగా అందరినీ సంప్రదించే కాంగ్రెస్ తెచ్చిన ఆర్డినెన్స్‌ను సమర్థిస్తున్నానని చెప్పుకొచ్చారు. ఇందుకోసం వారు నాలుగు రోజులు టైం తీసుకుంటారేమో అంతే అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. 2018 చట్ట సవరణ చేసి ఆర్డినెన్స్ తేవడం సబబే అని రేవంత్ సర్కార్ కు బహిరంగ మద్దతును ప్రకటించారు. న్యాయనిపుణులతో చర్చించిన తర్వాతే ఆర్డినెన్స్‌కు తాను మద్దతు ఇస్తునట్లు చెప్పారు. తనపై తీన్మార్ మల్లన్న చేసిన కామెంట్స్ కు బీఆర్ఎస్ పార్టీ రియాక్ట్ కాలేదని.. దానిని వాళ్ల విజ్ఞతకే వదిలేస్తున్నానని అన్నారు. హైదరాబాద్ లోని తన నివాసంలో మీడియా చిట్ చాట్ లో ఎమ్మెల్సీ కవిత ఈ వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే ఎమ్మెల్సీ కవిత, కేటీఆర్ మధ్య దూరం పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. అన్నాచెల్లాల మధ్య

8లో

## పునరుత్పాదక ఇంధనాలపై సహకారం

- సౌరవిద్యుత్ ఉత్పత్తి జోన్‌లను గుర్తించాలి
- ప్రాజెక్టుకలు అసవరమైన భూ సేకరణకు మద్దతు
- సిఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూలై17 : పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. తెలంగాణలోని అధిక సౌర విద్యుదుత్పత్తి సామర్థం గల జోన్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు- చేయాలన్నారు. గ్రిడ్ స్టెబిలిటీ-, ఎనర్జీ రిలయబిలిటీలను మరింత

8లో

## సచివాలయ పోచమ్మ ఆలయంలో

# ఘనంగా బోనాలు

### - ఆకట్టుకున్న ఊరేగింపు..డప్పు విన్యాసాలు





(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూలై17 : డా.బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం, నల్ల పోచమ్మ దేవస్థానం ఆలయ కమిటీ- ఆధ్వర్యంలో ఉత్సవ ఊరేగింపు, బోనాల సమర్పణ తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. సచివాలయం సమీపంలో ఉన్న నల్ల పోచమ్మ దేవాలయంలో పలువురు సచివాలయ అధికారులు, సచివాలయ సిబ్బంది పూజలు నిర్వహించారు. సచివాలయం ప్రాంగణం నార్త్ గేట్ నుండి ప్రారంభమైన ఉత్సవాల ఊరేగింపు బాహుబలి గేట్, సౌత్ గేట్ ద్వారా పోచమ్మ దేవాలయం వరకు కొనసాగింది. ఈ ఊరేగింపులో డప్పు విన్యాసాలు, పోతరాజుల ప్రదర్శనలతో పలు కళారూపాలకు చెందిన

8లో

## బిఆర్ఎస్ హయాంలో వేల ఫోన్ల ట్యాపింగ్

### - సిట్ ముందు వాంఙ్మూలం ఇచ్చిన తీన్మార్ మల్లన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూలై17 : బీఆర్ఎస్ పాలనలో వేల ఫోన్లు ట్యాప్ చేసి ప్రజాస్వామ్యాన్ని కేసీఆర్ ఖూనీ చేసిండని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న విమర్శించారు. గురువారం ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు ఆయన హాజరయ్యారు. ఈ కేసులో సాక్షిగా తీన్మార్ మల్లన్న స్టేట్‌మెంట్‌ను సిట్ అధికారులు రికార్డ్ చేశారు. విచారణ అనంతరం మల్లన్న మీడియాతో మాట్లాడుతూ.. మావోయిస్టు

8లో

## వెల్గటూర్ లో యువకుడి దారుణ హత్య

- మృతుడు కిషన్‌రావు పేట గ్రామానికి చెందిన చల్లూరి మల్లేష్‌గా గుర్తింపు
- ప్రేమ వ్యవహారమే హత్యకు కారణమా..?



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ధర్మపురి, జూల్కై 17 : విచక్షణ రహితంగా కత్తులతో పొడిచి దారుణంగా ఓ యువకుడిని హత్య చేసిన సంఘటన జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలోని వెల్గటూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. యువకుడి ప్రేమ వ్యవహారమే హత్యకు దారి తీసిందని సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారంగా వెల్గటూర్ మండలంలోని కిషన్ రావు పేట గ్రామానికి చెందిన మృతుడు చల్లూరి మల్లేష్ అదే గ్రామానికి చెందిన ఓ యువతితో గత సంవత్సరం క్రింద నుండి ప్రేమ సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయమై గ్రామంలో యువతి కుటుంబ సభ్యులు పలమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ

8లో





# మహిళల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట



## - పలు వ్యాపారుల్లో మహిళలు ఆర్థికంగా స్థిరపడాలి - మహిళల పేరు మీదే ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

## - మహిళా సంఘాలలో నూతన సభ్యులను చేర్పించాలి - రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క

## - అంబరాన్ని అంటిన ఇందిరా మహిళా శక్తి సంబరాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, జూలై 17 : రాష్ట్రంలోని మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందించి ఆర్థికంగా ఎదగడానికి కృషి చేస్తున్నదని, మహిళలు ఆర్థికంగా లబ్ధి పొందడానికి ప్రతి మహిళను సంఘాలలో సభ్యులుగా చేర్పించాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్ లో మంత్రి సీతక్క తో పాటు , భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, అదనపు సి ఈ ఓ సేర్ఫ్ పి. కాత్యాయిని దేవి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ములుగు మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్ లతో కలిసి ఇందిరా మహిళా శక్తి సంబరాలలో పాల్గొని వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ భీమా, ప్రమాద చెక్కులను పంపిణీ చేసారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఇందిరమ్మ కలలను నెరవేర్చడానికి పలు పథకాలను అమలు చేయడం జరుగుతుందని, మహిళా జీవితాల్లో వచ్చిన మార్పును గుర్తు చేసుకుంటూ సంబరాలు చేసుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళా సంఘాలకు దాదాపు 26 వేల కోట్ల రూపాయలు బ్యాంక్ లింకేజ్ రుణాలు పంపిణీ చేశామని అన్నారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలకు లక్షల కోట్లు కేటాయించడంతో పాటు వడ్డీ రుణమాఫీ చేసిన ఘనత తమ దేనని, మహిళలు అన్ని రంగాలలో రాణించడానికి పలు సంక్షేమ ఫలాలను అమలు చేయడంతో పాటు పలు రంగాలలో రాణించడానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కన్నా ప్రైవేట్ రంగంలో పలు వ్యాపారంలో మహిళలు రాణించడానికి అవకాశం ఉందని, ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ములుగు నియోజకవర్గం లో 9 మండల సమాఖ్యలు, 330 గ్రామ సమాఖ్యలు, 6 వేల 904 స్వయం సహాయక సంఘాలు, 69,736 స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొంటున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా కృషి చేయడానికి బ్యాంకు లింకేజీల ద్వారా 2024- 25 ఆర్థిక సంవత్సరంలో 249.07 కోట్ల రూపాయల రుణాలను అందించడం జరిగిందని, 2025- 26 ఆర్థిక సంవత్సరానికి గాను 618 స్వయం సహాయక సంఘాలకు 54.79 కోట్ల రుణాలను అందించడం జరిగిందని వివరించారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన 5109 స్వయం సహాయక సంఘాల లోని సభ్యులకు మహిళా 884.53 కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందించడం జరిగిందని, 5212స్వయం సహాయక సంఘాల లోని 52615 మంది సభ్యులకు 10 కోట్ల 74 లక్షల వడ్డీ లేని రుణాలను మహిళా శక్తి సంబరంలో అందించడం జరిగిందని తెలిపారు. మహిళల ఆర్థిక స్వాలంబం కోసం ఇప్పటికే ఆర్టీసీ బస్సులను అందజేయడంతో పాటు లోన్ బీమా పథకం, ప్రమాద బీమా పథకం ఏర్పాట్లు, కొత్త సంఘాల ప్రారంభం, స్త్రీ నిధి రుణాలు అందజేయడం, మైక్రో ఎంటర్ప్రైజెస్, పాడి గేదెల పెంపకం, పెరటి కోళ్ల పెంపకం, పౌల్ట్రీ మదర్ యూనిట్, సంచార చేపల విక్రయ కేంద్రం, వ్యవసాయ అనుబంధ జీవనోపాధి కల్పన కోసం, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లో ఏర్పాటు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు తదితర కార్యక్రమాలను మహిళా సంఘాల చే నిర్వహించడం జరుగుతుందని వివరించారు. గతంలో ఎన్నడు లేని విధంగా మహిళలు అన్ని రంగాలలో ఆర్థిక అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిక్షత తో ఉందని మంత్రి తెలిపారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ వంటి వివిధ వ్యాపారాలు చేయడం వల్ల నెలకు మహిళలకు అదనపు ఆదాయం లభిస్తుందని అన్నారు. ఆర్టిసి కు పెట్టిన అద్దె బస్సు ద్వారా నెలకు 75 వేల రూపాయల ఇస్తున్నామని అన్నారు. మహిళా సంఘాలకు అందించిన రుణాలు 99 శాతం తిరిగి చెల్లిస్తున్నామని అన్నారు. బ్యాంకులు నేడు మహిళా సంఘాలకు క్యూ కట్టి రుణాలు అందిస్తున్నారని మంత్రి తెలిపారు. మహిళా సంఘాల్లో ఉన్న సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే 10 లక్షల రూపాయల అందిస్తున్నామని అన్నారు. మహిళ సభ్యులు సాధారణంగా మరణిస్తే 2 లక్షల రూపాయల వరకు లోన్ బీమా అమలు అవుతుందని అన్నారు. 60 సంవత్సరాల నిండిన వారిని కూడా మహిళా సంఘాలలో చేర్చాలని, 15 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళ సంఘంలో ఉండేలా చూడాలని అన్నారు. మహిళా సంఘం సామాజిక భరోసాగా పని చేయాలని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే ఆ కుటుంబం ఎదగడానికి దోరపడుతుందని ప్రతి మహిళ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

**మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యం**

**భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు**

మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు అన్నారు. ఈ సందర్భంగా భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, గత పాలకుల హయాంలో నిర్లక్ష్యం చేసిన వడ్డీ లేని రుణాలను ప్రజా ప్రభుత్వంలో పునరుద్దరించామని అన్నారు. మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. మహిళల చేతిలో డబ్బులు ఉండాలని లక్ష్యంతో ఇందిరమ్మ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్న బియ్యం రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. ఆర్థికంగా అనేక కష్టాలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. మహిళల ఆశీర్వాదం ఉంటే ప్రభుత్వం చల్లగా ఉంటుందని అన్నారు.


**ప్రభుత్వ పథకాలతో జిల్లాలో మహిళలు అభివృద్ధి.**

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం లక్ష రూపాయల ఆర్థిక సాయం.**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**

రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్నామని, మహిళా సంఘాల్లో ఉన్న మహిళలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన మహిళలు ఆర్థికంగా పెట్టుబడి పెట్టని పరిస్థితిలో ఉన్న మహిళలకు లక్ష రూపాయల ముందస్తు రుణాలను ముందస్తు అందజేస్తున్నామని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కలెక్టరేట్, రామప్ప, ఐటీడీఏ, బోగత జలపాతం, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ముందు మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేశామని, రానున్న రోజులలో లక్నవరం, బ్లాక్ బెర్రీ పర్యటక ప్రాంతంలో ఏర్పాటు చేస్తామని అన్నారు. జిల్లాలోని మహిళా సంఘాల మహిళలకు ఇప్పటివరకు 300 కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేయగా, 10 కోట్ల రూపాయల వడ్డీ రుణాలను వారి ఖాతాలోని జమ చేయడం జరిగిందని వివరించారు. రానున్న రోజులలో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న ములుగు జిల్లాలో మహిళలు అన్ని రంగాలలో ఆర్థికంగా ఎదగడానికి వినూత్న కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. అనంతరం ఇంద్ర మహిళా శక్తి సంఘ సభ్యులకు వడ్డీ లేని రుణాల చెక్కులు, లోన్ భీమా, ప్రమాద చెక్కులను పంపిణీ చేసారు. మైనార్టీ శాఖ ఆధ్వర్యంలో 4 గురికి కుట్టు మిషన్లను మంత్రి సీతక్క అందచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, సంబంధిత అధికారులు, మండల సమాఖ్య సభ్యులు, ఏ.పి.ఎం.లు, మహిళలు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది

**- జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి**

**- ఇందిరమ్మ రాజ్యం, ప్రజా పాలనలో రాష్టం బ్రహ్మాండమైన అభివృద్ధి కొనసాగుతుంది**

**- బ్యాంకు లింకేజి 391 మహిళా సంఘాలకు 35 కోట్ల 13 లక్షల**

**- వడ్డీ లేని రుణాలు 4 కోట్ల 37 లక్షల ప్రమాద బీమా 04 మెంబర్స్ 40 లక్షలు**

**- లోన్ బీమా 24 లక్షల 60 వేలు - మెదక్ జిల్లా వ్యాప్తంగా నూతన రేషన్ కార్డులు 9,964 జారీ**

**- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజా పాలనలో - ప్రజల సమస్యల కోసం కంకణ బద్ధులై పనిచేస్తున్నా.**

**- మహిళలు ఆర్థిక స్వాలంబన సాధించాలని ఉద్దేశంతో**

**- కాంగ్రెస్ ప్రభుత్వం పావలా వడ్డీ, వడ్డీ లేని రుణాలు ఇచ్చే కార్యక్రమం చేపట్టింది**

**- మహిళా సంఘ సభ్యులకు చెక్కులు, రేషన్ కార్డ్స్ పంపిణీ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూలై 17 : బడుగు బలహీన వర్గాలకు అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది.. కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు మరియు గనులు, భూగర్భ శాస్త్ర, మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు డ్రాక్టర్ జి.వివేక్ వెంకటస్వామిపేర్కొన్నారు. మెదక్ కలెక్టరేట్ లో నిర్వహించిన ఇందిర మహిళ శక్తి సంబరాలలో మంత్రి వివేక్ వెంకటస్వామి పాటు మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొన్నారు.. ముందుగా ఇందిరా మహిళా శక్తి సంబరాలను మంత్రివర్యులు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వాలంబన కోసం ఇచ్చిన ఆరు గ్యారెంటీల కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు ఉచిత మహిళ బస్సు, గ్యాస్. సబ్సిడీ. తదితర సంక్షేమ కార్యక్రమాలు

ఉన్నాయన్నారు. మహిళలకు మహిళ క్యాంటీన్లో ఎలక్ట్రిక్ బస్సులు పెట్రోల్ పంపులు ఇస్తున్నామన్నారు. మహిళలు పట్టుదలతో పని చేస్తారు అనుకున్నది సాధిస్తారు బ్యాంకులు అందుకే ముందుకు రావడం జరిగిందని వివరించారు. వడ్డీ లేని రుణాలు మహిళలకే వెళ్లినప్పుడు కుటుంబం బాగుపడుతుంది తదనంతరం రాష్ట్రం బాగుపడుతుంది దేశం బాగుపడుతుందని చెప్పారు. 6 గ్యారంటీలు సరిగా అమలు చేస్తున్నారా లేదా అనేది రివ్యూ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు మహిళలకు మేలు చేయాలనే గరీబి హటావో స్కీం తీసుకొచ్చిందన్నారు. కేంద్రం నుంచి మాట్లాడి తెలంగాణకు నిధులు తీసుకురావాలని మెదక్ ఎంపీ ని కోరారు....మన రాష్ట్రం నుంచి టాక్స్ కేంద్రాన్ని కడుతున్నాం..ముఖ్యమంత్రి మాట ప్రకారం ఇందిర మా ఇల్లు ఇవ్వడం జరిగిందన్నారు. 10 సంవత్సరాలు గత ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ లు ఇవ్వలేదు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెదక్ జిల్లా వ్యాప్తంగా 9 వేల ఇవ్వడం జరిగింది..60 వేల కోట్ల అప్పులు ఉన్న రాష్ట్రాన్ని బి అర్ ఎస్ ప్రభుత్వం ఎనిమిది లక్షల కోట్లకు తీసుకెళ్లిందనీ ఖజానా మొత్తం ఖాళీ చేసిందని వివరించారు. కార్మిక, ఉపాధి, గనుల శాఖమంత్రి వివేక్ వెంకటస్వామి ఖజానా ఖాళీ. అయినా .కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఖజానా చూస్తే అప్పులే ఉన్నాయన్నారు..ఖజానా ఖాళీ ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇండ్లు ఎలా ఇస్తారని ప్రతిపక్షాలు ప్రశ్నించిన ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ మహిళలు కోటీశ్వరులు కావాలని బ్యాంకు లింకేజ్ కల్పించడం జరిగిందన్నారు మహిళా సంక్షేమానికి గత సంవత్సర కాలంలో .జిల్లా వ్యాప్తంగా 100 కోట్లు రుణాలు ఇవ్వడం జరిగింది. వడ్డీ లేని రుణాలు మెదక్ నియోజకవర్గంలో4కోట్లు పై బడి రిలీజ్ చేయడం జరుగుతుందని,ప్రమాద బీమా నలుగురికి ఇవ్వబోతున్నాం అని చెప్పారు. మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేయడం జరిగిందన్నారు. కొత్త రేషన్ కార్డులు 4390 మందికి ఇవ్వబోతున్నాం.. అని వివరించారు. రేషన్ కార్డు లో మార్పులు చేర్పులు చేస్తున్నాం... జిల్లా వ్యాప్తంగా 9964. మందికి కొత్త రేషన్ కార్డు ఇవ్వబోయితున్నాం.. అని అన్నారు. అలాగే రెండు లక్షల 16 వేల మంది రేషన్ బియ్యం ఇచ్చామన్నారు.

ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్ మాట్లాడుతూ మహిళా పురోభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని. బ్యాంక్ లింకేజ్ ద్వారా 35 కోట్లు మెదక్ నియోజకవర్గంలో వడ్డీ లేని రుణాలు నాలుగు కోట్ల ఇవ్వడం జరుగుతుంది అన్నారు.

మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ. సునీత విలియమ్స మల్హోతు పూర్ణను ఆదర్శంగా తీసుకోవాలని స్వయం సహాయక సంఘాల మహిళలు ఇంటికి పరిమితం కావద్దన్నారు స్వయం సంఘాల మహిళలు రాజకీయాలకు రావాలని హితవు.. పలికారుఅన్నిరంగాలలో మహిళలు మగవారికి దీటుగా ముందుకు వెళుతున్నారు...33 శాతం రిజర్వేషన్ మహిళలు ఉపయోగించుకోవాలని తెలిపారు కేంద్రము రాష్ట్రమిచ్చిన రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి..బెల్ట్ షాపు నుండి గ్రామాలను రక్షించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు ఇవ్వడం జరుగుతుంది..లబ్ధిదారులకు తగ్గట్టుగా కొత్త రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని ఎంపీ కోరారు. ః

గ్రంథాలయ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి మాట్లాడుతూ మహిళా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలు ఆర్థిక పరిపుష్టిని సాధించాలని , అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుంది అన్నారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాలు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్ ,డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, అడిషనల్ పిడి సరస్వతి,మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, మెదక్ తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, హవేలీఘన్పూర్ తాసిల్దార్ సింధూ రేణుక,స్వయం సహాయక సంఘ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడంలో నిబద్ధతతో పనిచేయాలి



## - జిల్లా ఇన్చార్జి మంత్రివివేక్ వెంకటస్వామి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూలై 17 : ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడంలో నిబద్ధతతో పనిచేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావ్,ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, గ్రంధాలయ చైర్మన్ చిలుముల సుహాసిని రెడ్డి ఇతర జిల్లా అధికారులతో కలిసి శాఖల వారీగా అభివృద్ధి సంక్షేమ పథకాలపై సమీక్షించారు. ముందుగా విద్యా వైద్యం, వ్యవసాయం, ఉద్యానవనం, సంక్షేమం,పరిశ్రమలు,వివిధ శాఖల ప్రగతి పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జి మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వైద్యానికి ప్రత్యేక ప్రాధాన్యతని ఇస్తుందన్నారు. మెదక్ జిల్లాలో జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో విద్యా, వైద్యంతో పాటు సంక్షేమం ప్రగతి పథంలో ముందుకు పోతున్నాయి అన్నారు, ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మెదక్ జిల్లా అభివృద్ధికి జిల్లా అధికారులు సమిష్టి కృషి ఎంతో దోహదపడుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు





# పారిశ్రామికవేత్తలుగా మహిళలు ఎదగాలి

### - మహిళల ఆర్థిక అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యం
### - మహిళల పేరు మీదే రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు జారీ
### - రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
### - ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో పాల్గొన్న విప్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, జూలై 16 : మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, మహిళలు ఆర్థిక అభివృద్ధి తోనే దేశ ప్రగతి సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.. గురువారం వేములవాడ పట్టణంలో డిఆర్డిఏ, షేర్ప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబరాలకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు...మహిళల సమైక్య సంఘాలకు వడ్డీ లేని రుణాలు, బ్యాంక్ లింకేజి, ఇటీవల మరణించిన మహిళా సంఘ సభ్యుల ప్రమాద బీమా చెక్కులను వారి కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు..

ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో ముందుకు పోతున్నారని తెలిపారు.. అందులో భాగంగా రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించడం జరిగిందని తద్వారా మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సంకల్పించారని అన్నారు.. అనాడు ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మేలు జరిగితే మళ్లీ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో మహిళా తల్లిలకు పేద్దపీఠ వేయడం జరుగుతుందని తెలిపారు..గతంలో వైఎస్ పావలా వడ్డీకే రుణాలు మంజూరు చేశారని, ఐకేపీ కేంద్రాలను ప్రారంభం చేసి మహిళలకు ఆర్థిక స్వావలంబన దిశగా ప్రోత్సాహం అందించాలని తెలిపారు.. ప్రజా ప్రభుత్వంలో మహిళలకు 20వేల పైచిలుక కోట్లను కేటాయించడం జరిగిందని తెలిపారు.. గత ప్రభుత్వం మహిళా సంఘంలను ఏ మాత్రం పట్టించుకోలేదని చివరికి మూడు సంవత్సరాల వడ్డీని ఎగ్గొట్టినట్లు తెలిపారు..మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు, పెట్రోల్ పంప్, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్ వంటి అనేక వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నూతనంగా అందించే రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లను కూడా మహిళల పేరు మీద మంజూరు చేస్తుందని తెలిపారు. గత పాలకుల హయాంలో నిర్లక్ష్యం చేసిన వడ్డి లేని రుణాలను ప్రజా ప్రభుత్వంలో పునరుద్దరించామని అన్నారు.. 93 లక్షల పేద కుటుంబాలకు రాష్ట్రంలో సన్న బియ్యం రేషన్ కార్డు ద్వారా సరఫరా చేస్తున్నామని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. ఆర్థికంగా అనేక కష్టాలు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్ల రూపాయల జమ చేశామని అన్నారు. రైతు భరోసా క్రింద పెట్టుబడి సహాయం ఎకరానికి 12 వేల రూపాయలకు పెంచి 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయల జమ చేశామని, రైతు బీమా కు 3 వేల కోట్ల అందించామని అన్నారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలో ఐకెపి నుండి గత సీజన్ లో 63 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 177 కోట్ల విలువగల 763877 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు కే చేయడం జరిగిందని తద్వారా జిల్లా మహిళా సమైక్య సంఘాలకు 17 లక్షల,48 గ్రామ ఐక్య సంఘాలకు 1 కోటి 55 లక్షల కమీషన్ రావడం జరిగిందని తెలిపారు.. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు వారు ఆర్థికంగా ఎదగాలని మైక్రో ఎంటర్ప్రైజేషన్, మహిళా శక్తి స్టిచ్చింగ్ సెంటర్స్, ఈవెంట్ మేనేజ్మెంట్ యూనిట్లో, సోలార్ పవర్ ప్లాంట్, డైరీ యూనిట్స్ వంటి వాటిని ఎర్పాటు చేయడం కోసం బ్యాంకు లింకేజీ వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో అయ్యప్ప, శ్రీ ఆదర్శ గ్రామ సంఘాలకు సంబంధించి నాలుగు ఎకరాల భూమిలో నాలుగు కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.. 36 లక్షలతో మహిళా సమైక్య సంఘానికి ఆర్టిసి బస్సు కొనుగోలు చేసి అందజేయడం జరిగిందని తెలిపారు. 2024 25 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకు లింకేజీ ద్వారా 20084 కోట్లు, 2025-26 సంవత్సరానికి 58 కోట్లు బ్యాంకు లింకేజీ అందజేయడం జరిగిందని తెలిపారు. 4350 సంఘాలకు 5 కోట్ల 72 లక్షల వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగిందని పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యురాళ్లకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన లోన్ బీమా, ప్రమాద బీమా స్కీం వలన ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.. ప్రమాదవశాత్తు ఎవరైనా సంఘ సభ్యులు చనిపోతే వర్ తీసుకున్న రుణం మాఫీ తో పాటు పదిలక్షల వరకు ఇన్సూరెన్స్ చెల్లించడం జరుగుతుందని తెలిపారు. లోన్ బీమా,ప్రమాద బీమా వంటి పథకాలను గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆలోచించ లేదని అన్నారు.ఇప్పటివరకు వేములవాడ నియోజకవర్గంలో 37 మందికి 40.43 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని పేర్కొన్నారు.. రానున్న రోజుల్లో ప్రభుత్వానికీ ఆశీర్వాదాలు అందజేయాలని పిలుపునిచ్చారు..

ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ శేషాద్రి, మార్కెట్ కమిటీ చైర్మన్లు రొండి రాజు, చెలకల తిరుపతి, కచకాయల ఎల్లయ్య,అన్ని మండల ఏపీఎంలు, మహిళా సమైక్య సంఘ అధ్యక్షురాలు,మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు..



# రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కలిసిన జిల్లా వ్యవసాయ అధికారి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, జులై 17 : పెద్దపెల్లి జిల్లా వ్యవసాయ అధికారిగా నూతన బాధ్యతలను చేపట్టిన బత్తిని శ్రీనివాస్ గురువారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌కు జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్ పట్టు శాలువాతో సత్కరించి పుష్పగుశ్చం అందించారు. జిల్లా వ్యవసాయ ప్రగతి నివేదికను ఈ సందర్భంగా అందించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ అంతర్గాం మండల వ్యవసాయ అధికారి కలవల సతీష్ రామగుండం వ్యవసాయ అధికారి కొప్పుల ప్రకాష్ పాల్గొన్నారు.




# సింగరేణి పీఆర్ఓకు జర్నలిజంలో డాక్టరేట్

### - రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా స్వీకరణ
### - అభినందనలు తెలిపిన సింగరేణి సీ.ఎండీ బలరామ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జులై 17 : హైదరాబాద్ సింగరేణి కార్యాలయంలో పీఆర్ఓగా పనిచేస్తున్న శ్రీరాముల శ్రీకాంత్, తాను సమర్పించిన పరిశోధన అధ్యయనానికి తెలంగాణ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ అందుకున్నారు. 'సాంఘిక, రాజకీయ ఉద్యమాల్లో సామాజిక మాధ్యమాల పాత్ర, తెలంగాణ ఉద్యమంపై కేసు స్టడీ' అనే అంశంపై తాను సమర్పించిన పరిశోధనాత్మక అధ్యయనానికి బుధవారం నిజామాబాద్ లోని తెలంగాణ యూనివర్సిటీలో జరిగిన రెండో స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ నుండి శ్రీకాంత్ డాక్టరేట్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఇప్పటి వరకు సింగరేణి ఉద్యోగుల్లో పీ. హెచ్.డీ సాధించిన వారు అతి కొద్ది మంది మాత్రమే. ఈ నేపథ్యంలో ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తిస్తూ శ్రీకాంత్ డాక్టరేట్ సాధించటంపై సింగరేణి సీ,ఎండి బలరామ్, ఈడీ(కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం సుభాని, జీఎం(మార్కెటింగ్) టి.శ్రీనివాస్, సింగరేణి భవన్ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.




# మొక్కలను పెంచడం మొక్కుబడిగా కాదు.. పండగలా చేద్దాం!

### - ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, జీఎం లలిత్ కుమార్ - ఆర్జీ-1లో ఘనంగా 'వన మహోత్సవం'

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూలై 17 : రాష్ట్ర ప్రభుత్వ వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా సింగరేణి రామగుండం -1 ఏరియా ఆధ్వర్యంలో గురువారం ఆర్జీ-1 జిడీకే ఓసిపీ-5 ఓబీ డంప్ పై 'వన మహోత్సవ' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, జియం డి.లలిత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై పర్యావరణ పతిజ్ఞ చేసి ఓబీ డంప్ పై సామూహికంగా వెయ్యి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, లలిత్ కుమార్ తో కలిసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా రామగుండం ఏరియా-1 సింగరేణి ఆధ్వర్యంలో ఈ వర్షాకాలంలోగా మొత్తం 4 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఓసి-5 ఓబీ డంప్ పై సుమారు 110 హెక్టార్లలో మొత్తం లక్షా 60వేల మొక్కలను నాటడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మొక్కలు నాటడం వలన అధిక ఉష్ణోగ్రతలు తగ్గి పర్యావరణ పరిరక్షణకు దోహద పడుతుందని తెలిపారు. రామగుండం ప్రాంతం సింగరేణి, ఎన్.టి.పి.సి, ఆర్.ఎఫ్.సి.ఎల్, సిమెంట్ కర్మాగారంలాంటి పరిశ్రమలతో కూడుకున్నదని, ఆ పరిశ్రమల నుండి వెలువడే కాలుష్యం నుండి రక్షణగా ఉండేలా ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని సూచించారు. గోదావరిఖని నగర అభివృద్ధి కోసం సింగరేణి అనుబంధంగా అనేక అభివృద్ధి పనులను చేపట్టామని, రానున్న రోజులలో గోదావరిఖని పట్టణాన్ని ఒక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు సిద్దం చేసామని, రామగుండం ప్రాంతంలో పచ్చదనం పెంపొందించి మంచి వాతావరణం ఏర్పడే విధంగా చూస్తున్నామని అన్నారు. సింగరేణి వ్యాప్తంగా ప్రతి అడుగు పచ్చదనంగా ఎక్కడా లేని విధంగా విరివిగా మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న సంస్థ సీ,ఎండి బలరాంకు అభినందనలు తెలిపారు.

బయట ప్రాంతాల కన్నా సింగరేణి ఏరియాలలో ఉష్ణోగ్రత తక్కువగా నమోదు అవుతున్నదని, అందుకు కారణం సింగరేణి ప్రాంతాలలో విరివిగా మొక్కలను నాటటమేనన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, బొంతల రాజేష్, దీటి బాలరాజు, పోలసాని శ్రీనివాస్, పెద్దెల్లి తేజస్విని, ప్రకాష్, కొలిపాక సుజాత, పాతిపెల్లి ఎల్లయ్య, యస్ఓ టు జియం ఆంజనేయ ప్రసాద్, సిఎంఒఐ ప్రతినిధి మల్లేష్, ఎఐటియుసి నాయకులు మాదన మహేష్, ప్రాజెక్ట్ అధికారి డి.రమేష్, డిజియం ఫారెస్ట్ బానోతు కర్ణ, డిజిఎం ఏరియా వర్క్ షాప్ జితేందర్ సింగ్, డిజియం సివిల్ వర ప్రసాద్, ఏరియా ఇంజనీరు పి.రమేష్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, పోనుగోటి శ్రీనివాస్, వేణు, హనుమంత రావు, శ్రావణ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# పిల్లలల్లో పోషక ఆహార లోపాన్ని నియంత్రించాలి

### - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్ టౌన్, జూలై 17 : పిల్లలలో పోషక ఆహార లోపం నిష్పత్తిని తగ్గించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, యూనిసెఫ్ ప్రతినిధులతో జిల్లాలో పోషక ఆహార లోపం కలిగిన పిల్లల నిష్పత్తిని తగ్గించడానికి తీసుకోవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పిల్లలలో పోషక ఆహార లోపం కలిగిన వారిని గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్యశాఖ, శిశు సంక్షేమ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి పోషక ఆహార లోపం గల వారిని గుర్తించాలని, వారికి సకాలంలో పోషక ఆహారం, అవసరమైన మందులు అందించి పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోషకాహార లోపం నిష్పత్తిని తగ్గించేందుకు చిన్న పిల్లలకు సరైన సమయంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. జిల్లాలో పోషకాహార సంబంధిత ప్రయత్నాలకు యూనిసెఫ్ బృందం వారి సహకారంతో క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు సేకరించాలని తెలిపారు.

# జీఎంలు ప్రజా ప్రతినిధులకు చెప్రాసులుగా మారారు

### - సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిపోయింది
### - ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తీవ్ర విమర్శ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



గోదావరిఖని టౌన్, జులై 17 : సింగరేణిలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వంలో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయిందని, ప్రజా ప్రతినిధులకు కొంతమంది జనరల్ మేనేజర్లు చెప్రాసులుగా వ్యవహరిస్తూ కార్మికుల సమస్యలను గాలికొదిలేసారని సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తీవ్రంగా విమర్శించారు. గురువారం సింగరేణి ఆర్జీ-1 ఏరియా జిడికె 2ఇంక్లైన్ లో ఏఐటియుసి ఆర్జీ-1 బ్రాంచి ఆధ్వర్యంలో జరిగిన గేట్ మీటింగ్ లో ఆయన పాల్గొని మాట్లాడుతూ సింగరేణిలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేసిన కార్మిక వర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణికి బకాయిగా ఉన్న 36 వేల కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించక పోవడంవల్ల కొత్త గనులు రావడం లేదని, సంస్థలో యంత్రాలు, పని ముట్లు పాతబడి, చెడిపోయి, కొత్తవి కొనలేని పరిస్థితి నెలకొందని ఆయన పేర్కొన్నారు. గుర్తింపు సంఘంగా ఏఐటియుసి గెలిచిన తరువాత కార్మికుల సమస్యలు, సంక్షేమంపై సి అండ్ ఎండి, డైరెక్టర్ పా స్థాయి సమావేశాల్లో అంగీకరించిన వాటిని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా మారుపేర్లు, స్వంత ఇంటి పథకం, పెర్కు పై ఆదాయపు పన్నును సింగరేణి అధికారులకు అమలు చేసినవిధంగా కార్మికులకు అమలు కోసం, డిస్మిస్ కార్మికులను తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకునేందుకు కమీటీల పేరుతో కాలయాపన చేయకుండా వెంటనే అమలుకు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సింగరేణిలో సీనియారిటీ ప్రకారం కార్మికులకు కౌన్సెలింగ్ ద్వారా క్వార్టర్స్ అలాట్ మెంట్ చేయాలని, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులకు డిప్యూటేషన్లు ఇవ్వాలని, పైరవీకారి విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు ఏఐటియుసి పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కే.స్వామి, ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, ఉపాధ్యక్షులు మాదన మహేష్, నాయకులు ఎస్.వెంకట్ రెడ్డి, మిట్ట శంకర్, సయ్యద్ సోహేల్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, పెద్దెల్లి శంకర్, భక్తి శ్రీనివాస్, ఎల్.రమేశ్, వెంకటేశ్వర్లు, ఏ.వి.ఎస్ ప్రకాష్, బుడిమె సమ్మయ్య, పడాల కనకరాజు, పర్లపెల్లి రామస్వామి, గంగారపు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



# స్వచ్ఛ సర్వేక్షణ్ లో రామగుండం

### - నగరపాలక సంస్థకు 216 ర్యాంక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), జూలై 17 : కేంద్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 ర్యాంకుల్లో రామగుండం నగరం ఉత్తమ ర్యాంక్ సాధించింది. దేశవ్యాప్తంగా 4589 పట్టణాలతో పోటీ పడి 216వ ర్యాంకు సాధించడం విశేషం. అలాగే తెలంగాణ రాష్ట్రంలోని 143 మునిసిపాలిటీలలో 28వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మల్కాపూర్ వద్ద నిర్మించిన ఎఫ్‌సిటిపి ఉపయోగంలోకి తీసుకురావడంతో రామగుండం నగరంకు ఓడిఎఫ్ ప్లస్ ప్లస్ హెూదా దక్కింది. రామగుండం నగరం మెరుగైన ర్యాంకు సాధించడానికి ఈ హెూదా తోడ్పడింది. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుదలకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కమిషనర్ (ఎఫ్ఎసి) జె. అరుణ శ్రీ తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

## హత్తుమీరుతున్న నేతల రాజకీయ భాష

రాజకీయ నాయకుల విమర్శల్లో భాష హద్దు దాటు తోంది. హుందాగా ఉండాల్సిన వారు బజారు భాష మాట్లాడు తున్నారు. విమర్శల కోసం ఏదిపడితే అది మాట్లాడుతున్నారు. ముఖ్యంగా పదేళ్లు అధికారం వెలగబెట్టిన బిఆర్ఎస్ నేతలు, ఐదేళ్లు అధికారం వెలగబెట్టిన వైకాపా నేతలు ఇష్టానుసారంగా విమర్శలు చేస్తున్నారు. పత్రికలు, ఛానళ్లు కూడా వీటిని యదాతథంగా ప్రసారం చేస్తున్నాయి. నాయకుల విమర్శలు చేసే సమయంలో మాట్లాడే భాషపై ఆంక్షలు విధించాలి. లేకుంటే రానురాను అది పరిధి దాటి పోగలదు. మంత్రులుగా చేసిన వారు, ముఖ్యమంత్రులుగా చేసిన వారు సైతం భాషను పరిధి దాటి వినియోగిస్తు న్నారు. సన్నాసి, లుచ్ఛా లఫంగా, ఏం పీకుతావ్, రఫారఫా, సిగ్గులేదు... ఇలా అనేక రకాల పదాలు వాడుతున్నారు. కావాలనే అన్ని పదాలను ఇక్కడ ప్రస్తావించడం లేదు. తెలంగాణలో దాదాపు పదేళ్లు పాలన చేసిన కెసిఆర్ తెలంగాణ ఉద్యమంలో భాషను సాధనంగా చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తరవాత మార్పు కనిపించింది. మధ్యలో కొంతకాలం మళ్లీ ఎదురుదాడి చేసే సమయంలో దుర్భాషను వాడారు. ఇప్పుడు బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, హరీష్ రావులతో పాటు ఇతర నేతలు కూడా హద్దుమీరి మాట్లాడుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే కాంగ్రెస్ నేతలే కొంత సంయమనం పాటిస్తున్నారు. ఎపిలో జనగ్ ఆయన అనుచరులు కూడా ఇలాగే తెగించారు. ఇలాంటి భాష మాట్లాడితే ప్రజలు మెచ్చి అధికారం కట్టబెడ తారని వారు భావిస్తున్నట్లుగా ఉంది. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తర్వాత కల్వకుంట్ల కుటుంబ సభ్యులంతా అధికారం అనుభవించారు. వారి చుట్టాలు, పక్కాలు, కుల మైతే చాలన్నట్లుగా పదవులను చేపట్టారు. సంతోష్‌తో పాటు సమీప బంధువులు కూడా మంత్రి పదవుల నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అనేక ఉన్నతస్థాయి నామినేటెడ్ పదవులు పొందారు. ఉద్యమం చేసి ప్రాణత్యా గాలు చేసిన 1400 మంది కుటుంబాలను, ఇతరులను ఉద్యమ నాయకు డు కెసిఆర్ గడ్డిపరకల్లా తీసి అవతల పడేశారు. ప్రొఫెసర్ కోదండరామ్ లాంటి వారిని కూడా మర్చిపోయారు. జర్నలిస్టు లను గంజిలో ఈగల్లాగా విసిరి పడేశారు. ఇప్పుడు అధికారం పోయేసరికి వారికి పిచ్చెక్కినట్లుగా ఉంది. అందుకే ఏడాది న్నరకే నిత్యం రంకెలు వేస్తున్నారు. కాంగ్రెస్ మొత్తం ఏదో తప్పిదం చేసిందన్న భావనలో ఉచ్చనీచాలు మరచి విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా కెటిఆర్ వాడుతున్న భాష జుగుప్సా కరంగా ఉంది. ప్రత్యేక తెలంగాణ ఆవిర్భవించా క అధికారం చేబూనిన కల్వకుంట్ల కుటుంబం అసలు ప్రజలను మనుషులగా చూడలేదు. తెలంగాణను తమ సొంత జాగీరు గా భావించారు. ఆడిందే ఆటగా పాలన సాగించారు. అధికా రంలో ఉండి లక్షలాది మంది ఉద్యమకారుల త్యాగాలను, ఆశయాలను తుంగలో తొక్కారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని తమ సామాజిక వర్గపు వారి సంక్షేమానికే ప్రాధాన్యం ఇచ్చారు. పోలీసులు,ఇతర అవినీతి అధికారుల అండదండలతో ప్రజా ధనాన్ని, హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న వేలాది ఎకరాల భూములను కుటుంబ సభ్యులు, సమీప బంధువులు, కుటుం బానికి వత్తాసు పలికిన నాయకులకు పంచిపెట్టడం జరిగింది. కాళేశ్వరం మొదలు అనేక విషయాల్లో జరిగిన అవినీతి చూస్తుంటే ఎంతగా తెగించారా అని అర్థం అవుతోం ది. ఎసిబి దాడులు, ఇడి విచారణలు, కొనసాగుతున్న దర్యాప్తు లతో కళ్లు చెదిరిపోతున్నాయి. వందలకోట్లు అధికారులే వెనకేసుకుంటే ఇక అసలు నాయకులు ఎంత వెనకేసుకున్నారో ఊహించుకోవచ్చు. అంతెందుకు ఫార్ములా కేసులో డబ్బులు నేరుగా దాటించిన కెటిఆర్ బరితెగించి మాట్లాడుతున్నారు. లొట్టపీసు కేసు అని అంటున్నారు. అంటే ఎంతగా డబ్బు మదం ఉంటే ఇలా మాట్లాడగలరో అర్థం చేసుకోవాలి. ఇలా లొట్టపీసు కేసు... ఏం పీక్కుంటారో పీక్కోండి అని అనడం ఎంతవరకు సబబో చెప్పాలి. ఎపిలో జగన్ కూడా ఇలాగే నా వెంట్రుక కూడా పీకలేరు అని అనడం చూశాం. ఇలా మంత్రులుగా, సిఎంగా చేసిన వ్యక్తులు మాట్లాడాల్సిన భాషేనా అని ప్రజలు నిలదీసే రోజులు తప్పకుండా వస్తాయి. రావాలి కూడా. అనేక ప్రభుత్వ శాఖలలో కుటుంబ సభ్యులు చేసిన అక్రమాలను ఒక్కొక్కటిగా వెలికితీస్తున్న అనేక దర్యాప్తుల విషయాలను సోషల్ మీడియా ప్రజలకు తెలియజేయడం తప్పు ఎలా అవుతుంది.? తాము అధికారంలో ఉన్నప్పుడు ప్రజలపై మీడియా సంస్థలపై ప్రతిపక్షాలపై నిఘా, నియం త్రణ, అణచివేత కొనసాగిన విషయం కేటీఆర్ మర్చి పోయి ఉంటాడు. అందుకే అసహనంతో విమర్శలు చేసే క్రమంలో ఉచ్చనీచాలు మరచి మాట్లాడుతున్నారు. అధికారం ఉన్నప్పుడు తెలంగాణ నీళ్లు పంపిణీ చేసి రాయలసీమను రతనాల సీమ ను చేస్తామని ప్రకటించారు. ఇప్పుడేమో సిఎం రేవంత్ రెడ్డి బాబుకు నీళ్లు దానం చేశారని విమర్శలు చేస్తున్నారు. మేడి గడ్డమీద చర్చ పెడతామంటారు. సవాళ్లు విసరుతారు. నిజా నికి ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు ఉన్నవి సవాళ్లు విసరడానికా లేక పాలన సాగించడానికా అన్నది ప్రజలు చర్చించాలి. ఆనాటి ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని కాళేశ్వరం ప్రారంభోత్స వానికి పిలవడం చూశాం. ఆయన ప్రమాణస్వీకారానికి అమ రావతి వెళ్లి సంబురాలు చేసుకోవడం చూశాం. మంత్రి రోజా ఆహ్వానాన్ని అందుకొని నగరి సందర్శించి ఆతిథ్యం పుచ్చుకోవడం కూడా చూశాం. ఇవన్నీ మరచిపోయిన కెటి ఆర్, హరీష్ రావులు ఇప్పుడు ఇష్టానుసరాంగా వ్యంగ్యాలు పలుకుతున్నారు. కేవలం ఒక కుటుంబం అధికారానికి, అక్రమాస్తుల కోసం, అహంకారానికి మాత్రమే తెలంగాణ సాధించామా అన్న బాధ కలుగుతోంది. ఇకనైనా తెలంగాణ ప్రజల భాషను, నిజాయితీ, సంస్కృతి, మంచితనం పాటిస్తే మంచిది. జగన్ కూడా తనతండ్రి వైఎస్ లాగా హుందాగా ఉ ండడం నేర్చుకోవాలి. భాషను తిట్టడానికి ఉపయోగించ రాదు. ఇరుపార్టీల నేతలు హుందాగా ప్రతిపక్ష బాధ్యతలు నెరవేర్చాలి. ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపాలి. ప్రజలకు మేలుచేసేలా చర్యలు ఉండాలి. ప్రతిపక్ష పాత్రను క్రమశిక్షణ తో,బాధ్యతగా నిర్వహించినప్పుడే ప్రజలు ఆదరిస్తారని గుర్తించి మసలుకుంటే మంచిది.

# చేపల మంత్రికి చేదు అనుభవం!





పిట్టల రవీందర్

దాదాపు తొమ్మిదిన్నర సంవత్సరాల గత ప్రభుత్వ పాలనా కాలంలో తెలంగాణలోని జలాశయాలు, చెరువు లన్నింటిలోనూ ప్రతిసంవత్సరం క్రమం తప్పకుండా అమలు జరిపిన ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించే విషయంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి సవాలుగా మారినట్లు కనిపిస్తున్నది. జూలై 10వ తేదీనాడు జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ఈ సంవత్సరం రాష్ట్రంలోని జలవనరుల్లో సుమారు 122 కోట్ల రూపాయల వ్యయం భరించి, 82కోట్ల చేపపిల్లలను ఉచితంగా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి వాటికి శ్రీహరి ముదిరాజ్ మీడియా ముఖంగా ప్రకటించారు. గత సంవత్సరం కంటితుడుపుచర్యగా అరకొరగా అమలు జరిపిన ఉచిత చేపపిల్లల పంపిణీ ఈ సారి పూర్తిస్థాయిలో కొనసాగించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్లుగా కొత్తగా మంత్రిగా బాధ్యతలు తీసుకున్న వాటికి శ్రీహరి ప్రకటన ఫలితంగా మత్స్యకారుల్లో కొత్త ఆశలు చిగురించాయి. గతంలో కంటే భిన్నమైన పద్ధతిలో ఈ సారి మొత్తం 80–110 ఎం.ఎం. (నాలుగు నుండి ఐదు అంగుళాలు) సైజు చేపపిల్లలను మాత్రమే పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తామని కూడా మత్స్యశాఖమంత్రివర్యులు ప్రకటించారు. అయితే మంత్రివర్గ సమావేశం జరిగి వారం గడిచిపోయినప్పటికీ ఈ విషయంలో ఇంతవరకూ మత్స్యశాఖకు ప్రభుత్వం నుండి అధికారికంగా ఎలాంటి సమాచారం అందకపోవడంతో ఈ సంవత్సరం ఉచిత చేపపిల్లల పంపిణీ పథకం అమలుపై రాష్ట్రంలోని మత్స్యకారుల్లో తాజాగా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే చేపల మంత్రిగా కొత్తగా పదవీబాధ్యతలు చేపట్టిన వాకిటి శ్రీహరి మాత్రం ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని అమలుపరిచేవిషయంలో అత్యంత కట్టుదిట్టమైన పకడ్బందీ ప్రణాళికతో సిద్ధపడిఉన్నట్లు కనిపిస్తున్నది.

తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ మంత్రిగా కొత్తగా పదవీబాధ్యతలను స్వీకరించిన వాకిటి శ్రీహరి మత్స్యకార కులాలకు సంబంధించిన ముదిరాజ్ సామాజికవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తుండటం, తెలంగాణ మత్స్యరంగంలో అత్యధికశాతం మత్స్యకారులు ముదిరాజ్ సామాజికవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తుండటంలాంటి నేపథ్యాల కారణంగా ఆయన తన పదవీ నిర్వహణకాలంలో రాష్ట్రమత్స్యశాఖలో సమూలమైన మార్పులను తీసుకువచ్చి, తెలంగాణ మత్స్యరంగాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలనే సంకల్పాన్ని ప్రకటించుకున్నారు. ఆశాఖకు సంబంధించిన అధికారులతో ఇప్పటికే రెండుసార్లు సమీక్షా సమావేశాలను నిర్వహించడంద్వారా శాఖకు సంబంధించిన పనితీరును అర్థం చేసుకునేందుకు ప్రయత్నించారు. అంతేకాకుండా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని స్వయంగా సందర్శించి మత్స్యరంగంపై తన అవగాహనను పెంచుకునేందుకు ప్రయత్నించారు. రాష్ట్రముఖ్యమంత్రిని, ఆర్థిక మంత్రిని ఒప్పించి ఈ సంవత్సరం ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు పరిచేందుకు అవసరమైన చర్యలపై దృష్టిని సారించి, ఇందుకు అనుగుణంగా తగిన కార్యాచరణ ప్రణాళికను సంసిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో మత్స్యశాఖ ద్వారా పంపిణీ చేసిన చిన్నసైజు (30–40 మిల్లీమీటర్లు) చేపపిల్లల పంపిణీ ఫలితంగా చేరువుల్లో చేపలు సక్రమంగా పెరగడంలేదనే ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని ఈసారి పెద్దసైజు (80–100 ఎం.ఎం.) చేపపిల్లలను మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మార్పులపై క్యాబినెట్ సమావేశంలో చర్చించి, ముఖ్యమంత్రిని ఇతర మంత్రివర్గసహచరులను ఒప్పించి ప్రభుత్వ పరంగా ఇందుకు సంబంధించిన నిర్ణయాలను తీసుకున్నారు. ఈ మేరకు ఇదే విషయాన్ని మంత్రివర్గ సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలోనూ మత్స్యాశాఖమంత్రి వాటికి శ్రీహరి స్వయంగా ప్రకటించారు. మత్స్యశాఖలో వ్యవస్థీకృతమైన అవినీతి విషయంలోనూ చేపలమంత్రి తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేస్తున్నారు.

అయితే నూతనంగా బాధ్యతలను చేపట్టిన మత్స్యశాఖ మంత్రి ప్రదర్శిస్తున్న ఉత్సాహానికి తగినట్లుగా రాష్ట్రమత్స్యశాఖలో ప్రోత్సాహకరమైన పరిస్థితులేవీ కనిపించడంలేదు. ఇందుకుతగినట్లుగా బుధవారం నాడు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు) మత్స్యశాఖకు సంబంధించిన బిల్లులచెల్లింపు అంశానికి సంబంధించిన కేసులో కోర్టుధిక్కరణకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖకు సంబంధించిన ఉన్నతాధికారులకు ఫారం–1 నోటీసులు జారీచేసింది. రాష్ట్రఆర్థికశాఖ కార్యదర్శి, పశుసంవర్ధక మరియు మత్స్యశాఖ కార్యదర్శితోపాటుగా మత్స్యశాఖ డైరెక్టర్ లాంటి ముగ్గురు ఐ.ఎ.ఎస్ ఉన్నతాధికారులు కూడా ఈ నోటీసులు అందుకున్నవారిలో ఉన్నారు. 2023–24 సంవత్సరంలో రాష్ట్రంలో పంపిణీ చేసిన ఉచిత చేపపిల్లలకు సంబంధించిన బిల్లలను సదరు పంపిణీదారులైన కాంట్రాక్టర్లకు సకాలంలో చెల్లించే విషయంలో గతంలో ఇచ్చిన ఆదేశాలను పాటించకుండా కోర్టు ధిక్కారణకు పాల్పడిన నేపథ్యంలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంకా ఇట్లాంటి 11 కేసుల్లోనూ మత్స్యశాఖ ఉన్నతాధికారులు కోర్టు ధిక్కారణకు పాల్పడిన సందర్భాలున్నట్లు తెలుస్తున్నది. 2023–24 సంవత్సరంలో చేపపిల్లలను పంపిణీ చేసిన 24మంది కాంట్రాక్టర్లు తమ బిల్లులకోసం మత్స్యశాఖ అధికారులచుట్టూ చెప్పులరిగేలా తిరిగి తిరిగి, ఎంతకూ బిల్లులు చెల్లించకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాలను సైతం ఖాతరు చేయని మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యపూరిత వైఖరి ఫలితంగా సీనియర్ ఐఏఎస్ స్థాయి అధికారులు సైతం కోర్టు ధిక్కారణ కేసులను ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఇంతజరిగినా 2023–24 సంవత్సరంలో కాంట్రాక్టర్లు పంపిణీ చేసిన చేపపిల్లలకు సంబంధించిన 92కోట్ల రూపాయలను ప్రభుత్వం ఇంతవరకూ చెల్లించేందుకు ఎలాంటి చర్యలను తీసుకోవడంలేదు. ఇప్పుడు ఈ బాధ్యత మత్స్యశాఖమంత్రి నిర్వహించక తప్పనిపరిస్థితులు నెలకొనిఉన్నాయి. ఇదిలాఉండగా, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గతసంవత్సరం పంపిణీ చేసిన చేపపిల్లలకు సంబంధించిన బిల్లులను కూడా ఇంతవరకూ చెల్లించలేదు. ఇందుకు సంబంధించిన సుమారు 29కోట్ల రూపాయలు మత్స్యశాఖ నుండి చేపపిల్లల కాంట్రాక్టర్లకు రావాల్సి ఉంది. ఈ విషయంలో కూడా విసిగిపోయిన కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయిం చేందుకు



తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ మంత్రిగా కొత్తగా పదవీబాధ్యతలను స్వీకరించిన వాకిటి శ్రీహరి మత్స్యకార కులాలకు సంబంధించిన ముదిరాజ్ సామాజికవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తుండటం, తెలంగాణ మత్స్యరంగంలో అత్యధికశాతం మత్స్యకారులు ముదిరాజ్ సామాజికవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తుండటంలాంటి నేపథ్యాల కారణంగా ఆయన తన పదవీ నిర్వహణకాలంలో రాష్ట్రమత్స్యశాఖలో సమూలమైన మార్పులను తీసుకువచ్చి, తెలంగాణ మత్స్యరంగాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలనే సంకల్పాన్ని ప్రకటించుకున్నారు. ఆశాఖకు సంబంధించిన అధికారులతో ఇప్పటికే రెండుసార్లు సమీక్షా సమావేశాలను నిర్వహించడంద్వారా శాఖకు సంబంధించిన పనితీరును అర్థం చేసుకునేందుకు ప్రయత్నించారు. అంతే కాకుండా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని స్వయంగా సందర్శించి మత్స్యరంగంపై తన అవగాహనను పెంచుకునేందుకు ప్రయత్నించారు. రాష్ట్రముఖ్యమంత్రిని, ఆర్థిక మంత్రిని ఒప్పించి ఈ సంవత్సరం ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు పరిచేందుకు అవసర మైన చర్యలపై దృష్టిని సారించి, ఇందుకు అనుగుణంగా తగిన కార్యాచరణ ప్రణాళికను సంసిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

సన్నద్ధమవుతున్నారు. మొత్తంగా తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ నుండి ఇప్పటికే పంపిణీ చేసిన చేపపిల్లలకు సంబంధించి దాదాపు 123 కోట్ల రూపాయలను పంపిణీదారు లకు చెల్లించవలసి ఉన్నది.

ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం మత్స్యశాఖ ద్వారా ఉచిత చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఈసారి పరిస్థితులు ఏ మాత్రం అనుకూలంగా కనిపించడంలేదు. 2023–24 సంవత్సరానికి సంబంధించిన బిల్లులను చెల్లిస్తేనే తాము చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో పాలుపంచుకుంటామని గత సంవత్సరం కాంట్రాక్టర్లు భీష్మించుకున్నారు. అప్పుడు కొత్తగా మత్స్యశాఖ డైరెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న ఐఏఎస్ అధికారిణి చొరవ తీసుకుని, రెండువాయిదాల తరువాత కాంట్రాక్టర్లను వ్యక్తిగతంగా ఒప్పించి చేపపిల్లల పంపిణీ కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహించారు. ఇంతవరకూ అందుకు సంబంధించిన బిల్లలు సదరు కాంట్రాక్టర్లకు చెల్లించలేదు. తిరిగి ఈసారి కూడా సదరు కాంట్రాక్టర్లు గడచిన రెండు దఫాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే తాము చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో భాగస్వాములం అవుతామని ఖరాఖండిగా తేల్చిచెప్పేందుకు కాంట్రాక్టర్లు సిద్ధపడుతున్నారు. గతంలో పంపిణీ చేసిన చేపపిల్లలకు సంబంధించిన బిల్లులను చెల్లించకుండా పెండింగ్ లో పెడుతూ మరోవైపున మళ్లీ చేపపిల్లలను పంపిణీ చేయాలని వారిని నమ్మించగలిగే పరిస్థితులు కనిపించడంలేదు.

చేపపిల్లల పంపిణీ కార్యక్రమంలో అవినీతికి ఆస్కారం కలిగించే చిన్నపిల్లల (30–40 ఎం.ఎం. సైజు) పంపిణీ పూర్తిగా రద్దుచేస్తున్నట్లు మత్స్యశాఖమంత్రి ఖరాఖండిగా ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని చెరువుల్లోనూ మధ్యరకం సైజు చేపపిల్లలు (80–100 ఎం.ఎం.) మాత్రమే సరఫరా చేస్తామని ప్రకటించారు. అయితే ఈ సైజు చేపపిల్లలు సరిపోయినంత సంఖ్యలో రాష్ట్రంలో అందుబాటులో లభించేందుకు ఏ కోశానా ఆస్కారం లేదు. అందువల్ల ఆంధ్రాప్రాంతం నుండి మాత్రమే వీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ సైజు పిల్లలకు మత్స్యశాఖ గతంలో ఒకరూపాయి అరవై ఐదు పైసలు రేటుగా నిర్ధారించింది. ఇదే సైజు పిల్లలకు ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖవారు తమ రాష్ట్రంలోని సరఫరాదారులకు 1.90 రూపాయలు చెల్లిస్తున్నారు. మరోవైపున జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ (ఎన్.ఎఫ్.డి.బి) మరియు 'సిఫా'లాంటి సంస్థలు ఒక చేపపిల్లకు దాదాపు మూడురూపాయల ధరను చెల్లిస్తున్నారు. ఈ లెక్కన కేంద్రసంస్థలు చెల్లిస్తున్న రేటు చొప్పున ఇక్కడ చెల్లించాలంటే కనీసం 246కోట్ల రూపాయలు, పక్కనున్న ఆంధ్రపదేశ్ లో చెల్లిస్తున్న రేటుకు చెల్లించాలనుకుంటే 155కోట్ల 80లక్షలు సమకూర్చుకోవాల్సి ఉంటుంది. గతంలోలాగా తెలంగాణ మత్స్యశాఖ నిర్ణయించిన 1.65 రూపాయల రేటు ప్రకారం చెల్లించాలనుకున్నప్పటికీ 82కోట్ల చేపపిల్లల పంపిణీకి కనీసం 135కోట్ల 30లక్షల రూపాయల నిధులు అవసరం అవుతాయి. కానీ రాష్ట్ర కేబినెట్ లో ఆమోదించిన ప్రకారం 120కోట్ల రూపాయలు ప్రభుత్వం నిర్ణయించిన పద్ధతిలో ఈసారి చెపపిల్లలను పంపిణీ చేయడానికి ఏ కోశానా సరిపోయే పరిస్థితులు కనిపించడంలేదు. ఈ పరిస్థితుల నేపథ్యంలో చేపపిల్లల పంపిణీ కాంట్రాక్టర్లు ఈసారి తెలంగాణ మత్స్యశాఖ నిర్వహించే టెండర్ ప్రక్రియలో పాలుపంచుకునేందుకు సంసిద్ధంగా కనిపించడంలేదు. గతంలోలాగానే ఈ సారికూడా తమకు రావాల్సిన పాత బకాయలు చెల్లిస్తేనే టెండరు ప్రక్రియలో పాల్గొంటామని భీష్మించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. పెద్దసైజు చేపపిల్లలకు సంబంధించిన రేటు విషయంలోనూ కాంట్రాక్టర్లు ఈసారి మత్స్యశాఖను మరింతగా డిమాండు చేసేందుకు అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇదిలాఉండగా, మత్స్యశాఖమంత్రి ఆశిస్తున్న రీతిలో పెద్దసైజు చేపపిల్లలను పంపిణీ చేయడానికి అనువుగా ఆసైజు చేపపిల్లలు ఏకకాలంలో 82కోట్ల మేరకు లభ్యమయ్యే అవకాశాలు కనిపించడంలేదు. ఇతర ప్రాంతాలనుండి తెలంగాణ రాష్ట్రంలోని చెరువులు, రిజర్వాయర్లు లాంటి జలవనరుల దగ్గరకు వాటిని రవాణా చేయడం కూడా ఒక సమస్యగానే పరిణమించనున్నది. రాష్ట్రమత్స్యశాఖ యుద్ధప్రాతిపదికన వెంటనే చేపపిల్లల పంపిణీకి సంబంధించిన టెండర్ల ప్రక్రియలను పూర్తిచేసుకుని, సరఫరాదారులకు వెంటనే సరఫరాకు సంబంధించిన ఉత్తర్వులను విడుదల చేసినప్పటికీ ఈ తతంగం పూర్తికావడానికి కనీసం మరో మూడు మాసాల సమయం అవసరం పడుతుంది. అయితే మత్స్యశాఖ నుండి ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు గత మే మాసంలోనే ప్రభుత్వానికి చేరినప్పటికీ, ఉచిత చేపపిల్లల పంపిణీ విషయంలో ప్రభుత్వం ఉదాసీన వైఖరితో ఉండటంవల్ల ఈసారి ఈ పథకం అమలు ప్రక్రియను అటకెక్కిస్తారని మత్స్యశాఖ అధికారులు సైతం అనుమానాలను వ్యక్తం చేసారు. కానీ కొత్తగా మత్స్యశాఖ మంత్రిగా బాధ్యతలను చేపట్టిన వాకిటి శ్రీహరి ఈ అంశాన్ని ఒక సవాలుగా స్వీకరించి, ముఖ్యమంత్రి మరియు ఆర్థిక శాఖామంత్రిని స్వయంగా ఒప్పించి ఎట్టి పరిస్థితుల్లోనూ చేపపిల్లల పంపిణీ పథకాన్ని నిర్వహించాలనే పట్టుదలతో వ్యవహరించడంతోనే తాజాగా రాష్ట్రప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకున్నదని ప్రభుత్వంలో ఉన్నతవర్గాలు చెబుతున్నాయి. అయితే మత్స్యశాఖలో నెలకొనిఉన్న ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయాన్ని అమలులోకి తీసుకురావడంలో చేపలమంత్రికి విషమపరీక్షగా నిలుస్తుంద నడంలో సందేహం లేదు!

**వ్యాసకర్త 'తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్' మాజీ చైర్మన్, 'తెలంగాణ ఫిషరీస్ సొసైటీ' వ్యవస్థాపక అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు.**




## టాస్క్ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, జూలై 17 : టాస్క్ ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ ప్రాధాన్యత రంగాలలో నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని టాస్క్ కేంద్రాన్ని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ, టాస్క్ రీజనల్ సెంటర్ మేనేజర్ జి సాయికుమార్ లతో కలిసి ప్రపంచ యూత్ స్కిల్ డే పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, టాస్క్ కేంద్రం ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఉచితంగా అందించి వివిధ ఉపాధి, ఉద్యోగాలలో రాణించేలా ప్రోత్సహిం చడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 15వ తేదీన ప్రపంచ యూత్ స్కిల్ డే సందర్భంగా చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన మేఘన– చిత్రలేఖనం, అంజలియాదవ్–వ్యాసరచన లకు బహు మతులు అందించడం జరిగిందని తెలిపారు. టాస్క్ ద్వారా అందిస్తున్న ఉచిత నైపుణ్య శిక్షణను నిరుద్యోగ యువత సద్వి నియోగం చేసుకొని ఉపాధి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నల్లబాలుకు అన్ని విధాలుగా మద్దతు ఇస్తాం

**- ఈ కేసులను లీగల్‌గా ఎదుర్కొంటాం**

**- రామగుండం సైబర్ క్రైమ్ స్టేషన్‌లో నల్లబాలును పరామర్శించిన వ్యాల హరీష్ రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్‌సిటీ (గోదావరిఖని), జూలై 17 : నల్లబాలుకు అన్ని విధాలుగా మద్దతు ఇస్తామని, ఈ కేసులను లీగల్‌గా ఎదుర్కొంటామని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు,వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాల హరీష్ రెడ్డి అన్నారు. రామగుండం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న నల్లబాలును ఆయన గురువారం పరామర్శించి, కేసుకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో వ్యాల హరీష్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపులో భాగంగా అక్రమ కేసులు నమోదు చేయడం సరైంది కాదని విమర్శించారు. రాజకీయ కక్షపూరిత కారణాలతో పెట్టిన ఈ కేసులు కోర్టులో నిలబడవని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు గైడ్ లైన్స్ ప్రకారం ఇలాంటి కేసులు నమోదు చేయకూడదని, ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులను ఉపయోగిస్తోందని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక ప్రజల దృష్టిని మళ్లించేందుకు అక్రమంగా కేసులు పెడుతోందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ ఇప్పటికే ఏర్పాటు చేయబడిందని, రానున్న రోజుల్లో పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలు, నాయకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను మర్చిపోయి, రాజకీయ కక్షతో కేసులు పెడుతూ వేధింపులకు పాల్పడుతోందని వ్యాఖ్యానించారు.

# అభివృద్ధి చేయడమే నా లక్ష్యం

**- ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), జూలై 17 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ 48 లక్షల రూపాయల వ్యయంతో 26 మీటర్ల బ్రిడ్జి ని ఏర్పాటు చేస్తున్నాం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ అన్నారు.తెలంగాణ రాష్ట్రంలోనే రామగుండం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందు స్థానంలో నిలుపుతానని ఆయన అన్నారు.గోదావరిఖని 39 డివిజన్ శివాజీ నగర్ వెజిటేబుల్ మార్కెట్ దగ్గర నూతన బ్రిడ్జి పనులను గురువారం కొబ్బరికాయ కొట్టి ఎమ్మెల్యే ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుండి జరగని అభివృద్ధిని కేవలం ఒకసంవత్సర కాలములో చేసి చూపిస్తున్నామని అన్నారు.సి.ఎం.రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి, బట్టి విక్రమార్క, ఐటి శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో అభివృద్ధిజరుగుతుందన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు నిరుపేద కుటుంబాలకు బడుగు బలహీన వర్గాలకు అందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలు కూడాసహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

# గూడు లేక తల్లడిల్లుతున్న 200 కొంగలు

**- 75 సంవత్సరాల క్రితం చింత చెట్టు నేలమట్టం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్‌సిటీ (గోదావరిఖని), జూలై 17 : సుబ్బి పెళ్లి వెంకి చావుకు వచ్చింది అన్న చందంగా రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా చింత చెట్టు కూల్చివేయగా, కింద పడి చనిపోయిన దాదాపు 30 కొంగలను రెండు సంచుల్లో నింపుకు పోయిన కొంగ మాంసం ప్రియులు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల ఆధ్వర్యంలో, రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా బుధవారం, గోదావరిఖని పట్టణంలోని అడ్డగుంటపల్లి త్రివేణి కాంప్లెక్స్ ముందు గల 75 సంవత్సరాల నాటి చింతచెట్టు కూల్చివేయడం జరిగింది. 75 సంవత్సరాల నాటి ఈ చింతచెట్టు కూల్చివేయడంతో దిక్కులేని పరిస్థితిలో విరిగిపోయి కింద పడ్డ చెట్టు కొమ్మలపై బిక్కుబిక్కుమంటు సేద తీరుతున్న కొంగల పరిస్థితి చూపరులకు ఆవేదన మిగులుస్తోంది. బుధవారం అర్ధరాత్రి 9 గంటలకు కూల్చి వేసిన చెట్టుపై బిక్కుబిక్కుమంటూ కూర్చున్న కొంగలు దర్శనమిచ్చాయి.

# రామగుండం ఎంఈఓగా జింక మల్లేశం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, జూలై 17 : రామగుండం మండల విద్యాధికారిగా జింక మల్లేశం నియామకమయ్యారు. గోదావరిఖని పట్టణం అశోక్ నగర్ లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో మల్లేశం ప్రధానోపాధ్యాయులుగా కొనసాగుతున్నారు. ఈ మేరకు పెద్దపల్లి డిఈవో డి. మాదవి ఎం ఈ ఓ గా నియమిస్తున్నట్లు నియామక పత్రాలను గురువారం మల్లేశం కు అందజేశారు. రామగుండం మండలం విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న గడ్డం చంద్రయ్య స్థానంలో జింక మల్లేశం ను నియమించారు. కాగా మండల విద్యాధికారిగా జింక మల్లేశం బాధ్యతలు తీసుకున్నారు.

# నూతన అధ్యక్షున్ని సన్మానించిన రెవిన్యూ ఉద్యోగులు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూలై 17 : తెలంగాణ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయు) జగిత్యాల జిల్లా అధ్యక్షులుగా రెండవసారి ఎన్నికైన చీటి శ్రీనివాసరావును టి రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలో శ్రీనివాసరావును ఆహ్వానించిన ఆ శాఖ రాష్ట్ర కమిటీ బాద్యులు గంద్ర రాజేందర్ రావు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రాజేంద్ర ప్రసాద్, అధ్యక్షులు గాలిపెల్లి ఆనంద్ కుమార్, ప్రధాన కార్యదర్శి చిట్యాల భూమయ్య, ఉపాధ్యక్షురాలు అర్చన కుమారి, అసోసియేట్-1 అధ్యక్షులు కట్ట విష్ణు, అసోసియేట్ -2 అధ్యక్షులు ధూస రాజశేఖర్, అరనైజింగ్ కార్యదర్శి రాజేందరావు, క్యాషియర్ నరేందర్, ప్రచార కార్యదర్శి పంగ రాజేశం, నాయబ్ తహసీల్దార్, తిరుపతి నాయక్, గిర్దవార్ వినయ్ సీనియర్ సహాయకులు భాస్కర్ లు శాలువా కప్పి తమ శాఖ డైరీని అందించి సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మీడియా జర్నలిస్టులు ఉద్యోగుల సమన్వయము ప్రజలకు ఎంతో ప్రయోజనం అన్నారు. రెవిన్యూ శాఖ కొత్త కొత్త నిర్ణయాలను, ప్రయోజనాలను మీడియా ద్వారా ప్రజలకు చేరవేసి వాటి ఫలితాలను పొందేలా జర్నలిస్ట్ లు, రెవిన్యూ ఉద్యోగుల సేవలు ప్రజలకు అవసరమన్నారు.

# విద్యా భారతి పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ

**- పోతరాజుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్ జులై 17 : కుబీర్ మండలంలోని పల్సి గ్రామంలోని విద్యా భారతి పాఠశాలలో గురువారం ఆషాఢమాసం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు,విద్యార్థినిలు బోనాలను ఎత్తుకొని అమ్మావారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు,ఆనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు,పోతారాజుల ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి,ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ పురం శెట్టి లింగయ్య మాట్లాడుతూ..తెలంగాణ అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది బోనాల పండుగ అని,ఈ పండుగకు చాలా ప్రాముఖ్యత ఉన్నదని పేర్కొన్నారు,బోనాల ఉత్సవాలు పల్లెల్లోనే కాకుండా,విదేశాల్లో సైతం వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు,ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పోతన్న, కరస్పాండెంట్ గంగా సింగ్, ఉపాధ్యాయులు సాయినాథ్ , భోజన్న, ప్రవీణ్, రాజు, దేవకి, కవిత , రాణి, శ్రీవిద్య, నందిని, పద్మ, సరోజన, గంగామణి, సరస్వతి, అస్మిత, నేహా, శృతిక,విద్యార్థిని,విద్యార్థులు,పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




నిర్మల్, జూలై 17 : జిల్లాలో ఆయిల్ ఫామ్ పంటల విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఆయిల్ పామ్ పంటల సాగుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ పథకం లో భాగంగా జిల్లాకి 4500 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకి నీటి వసతి ఉన్న రైతులను గుర్తించి, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించాలన్నారు. చిన్న, సన్నకారు రైతులను ఉపాధిహామిలో అర్హులైన రైతులను గుర్తించి పామ్ ఆయిల్ పంటపై అవగాహనా కల్పించాలని సూచించారు. భారతదేశ వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని, తదనుగుణంగా రైతులు అధునాతన పంటలను సాగు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయిల్ పామ్ పంటల సాగు రైతులకు ఎంతో లాభసాటిగా ఉంటుందన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం ఆర్థిక ప్రోత్సాహకం తో పాటు అవసరమైన సాంకేతిక సహకారాన్ని కూడా అందిస్తుంది అన్నారు. ఆయిల్ పామ్ పంటకు అనుబంధంగా ఇతర పంటలను కూడా పండించవచ్చునని అన్నారు. ఇతర పంటలతో పోల్చితే ఆయిల్ పామ్ సాగు తక్కువ పెట్టుబడి, తక్కువ ఎరువులు, తక్కువ కూలీలు అవసరమవ్వడమే కాకుండా, చీడపీడల ముప్పు కూడా తక్కువగా ఉండి, లాభాలు కూడా అధికంగానే ఉంటాయన్నారు. పంట ప్రారంభం నుంచి మూడు సంవత్సరాల పంట నిర్వహణకు అవసరమయ్యే అన్ని అంశాలలో ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. అధికారులంతా మండలాల వారీగా రైతు వేదికలలో రైతు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ఆయిల్ పామ్ పంటల సాగు వల్ల కలిగే లాభాలను వివరించాలని ఆదేశించారు. రైతులకు ఆయిల్ పామ్ పంటల సాగు పై ఎటువంటి అనుమానాలు ఉన్న నివృత్తి చేయాలని చెప్పారు. ఉపాధి హామీ పనుల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటేందుకు గుంతలను తవ్వించే కార్యక్రమం చేపట్టాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఆయిల్ పామ్ పంటల విస్తీర్ణం పెంచేందుకు సహకారం అందివ్వాలని తెలిపారు. అనంతరం అధికారులతో కలిసి కలెక్టర్ ఉద్యాన దర్శిని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి రమణ, జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఇన్ చార్జి డిఆర్డివో శ్రీనివాస్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, ప్రియునిక్ కంపెనీ డీజీఎం, క్షేత్రస్థాయి ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.




# సమన్వయంతో సమస్యల పరిష్కారమే లక్ష్యం

**- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూలై 17 : జిల్లా అభివృద్ధిలో కీలక అంశాలపై శాఖల మధ్య సమన్వయం అవసరమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాదకద్రవ్యాల నిర్మూలన, బాల్యవివాహాల నివారణ, నకిలీ విత్తనాల అమ్మకాలు, స్కానింగ్ కేంద్రాల తనిఖీలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, విత్తన దుకాణాల్లో నిరంతరం తనిఖీలు జరపాలని, రైతులకు నష్టంజరగకుండా తక్షణ స్పందనతో వ్యవహరించాలని సూచించారు. ఆపరేషన్ ముస్కాన్ లో భాగంగా ఇప్పటివరకు 32 బాల కార్మికులు గుర్తించగా, 19 కేసులు నమోదయ్యాయని చెప్పారు. చిన్నారులను ప్రభుత్వవసతిగృహాల్లో చేర్చాలని, యజమానులపై కేసులు నమోదు చేసి వ్యాపార లైసెన్సులు రద్దు చేయాలన్నారు. బాల్యవివాహాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ ఏడాది 12 బాల్యవివాహాలు అడ్డుకున్నామని తెలిపారు. పాఠశాలల్లోని 72,876 విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్యవివాహాలపై అవగాహన కల్పించామని చెప్పారు. పీసీ-పీఎన్‌డీటీ చట్టం ప్రకారం లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే కేంద్రాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఎంపీల చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని నిబంధనలకు విరుద్ధంగా చికిత్సలు చేసేవారిపై కేసులు నమోదు చేయాలనీ ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ చట్టం అమలులో ఇప్పటివరకు 51 కేసులు నమోదవగా, 39 కేసులకు పరిహారం చెల్లించామని, 12 కేసులు వివిధ దశల్లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. మాదకద్రవ్యాల రహిత నిర్మల్ జిల్లా లక్ష్యంగా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు 73 కేసులు నమోదు కాగా, 145 మంది అరెస్టయ్యారని, 525 కేజీల 305 గ్రాముల గంజా సీజ్ చేశామని వెల్లడించారు. స్కూల్, కాలేజీల సమీపంలోని 400 మీటర్ల పరిధిలో గుట్కా, సిగరెట్లు విక్రయించడాన్ని నిషేధించనున్నట్లు తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని, రోడ్ సేఫ్టీ నిబంధనలను కచ్చితంగాఅమలు చేయాలని సంబంధిత శాఖలను కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదాలు జరగకుండా నిరోధించేందుకు ఎన్ ఎచ్ ఏ ఐ, ఆర్ అండ్ బి శాఖల ద్వారా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా కడ్తాల్, సోన్ గ్రామస్తులు, ఇతర గ్రామాల పరిధిలోని నేషనల్ హైవే రూట్లపై ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే వేగ నియంత్రణ సూచికలు, హెచ్చరిక బోర్డులు, స్లో డౌన్ జోన్‌లను ఏర్పాటు చేయాలని, ప్రమాదకర ప్రాంతాలలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు కూడా రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ కోరారు. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో బిక్షాటన నిర్మూలన, ట్రాఫిక్ సమస్యలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, బాల్యవివాహాల నియంత్రణలో సంక్షేమ, పోలీసు శాఖల మధ్య సమన్వయం కొనసాగుతుందన్నారు. చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.మాదకద్రవ్యాల నియంత్రణకు తనిఖీలను తీవ్రతరం చేశామని, ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాధిక, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, అడిషనల్ ఎస్పీ ఉపేంద్ర రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పలు దొంగతనాలు చేసిన దొంగల ముఠా అరెస్ట్

**- నగలు, నగదు స్వాధీనం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూలై 17 : ఈ నెల 12న దొంగతనానికి పాల్పడిన ముగ్గురు దొంగలను నిర్మల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ నేపథంలో జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వివరాలు ఇలా ఉన్నాయి . మహారాష్ట్రలోని ఉమ్రికి చెందిన ముగ్గురు బంధువులు.. రాజు సింగ్ మోహన్ సింగ్ భవారి, సేవక్ సింగ్ రఘుబీర్ సింగ్,సుర్దీప్ సింగ్ జూని అను ముగ్గురు నిందితులు మద్యానికి, జల్సాలకు బానిసలుగా మారి, కూలీగా పనిచేస్తూ వచ్చిన డబ్బులు సరిపోక సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాలు చేయడానికి నిర్ణయించుకున్నారు. ఈ ముగ్గురు కలిసి రూపొందించిన పథకం ప్రకారం, ఈ నెల 12న రాత్రి 9 గంటల సమయంలో, ఎం.హెచ్ 26 బి.ఆర్ 9554 నంబరు గల మోటార్ సైకిల్ పై ఉమ్రి నుండి భైంసా మీదుగా నిర్మల్ వస్తూ, కొండాపూర్ బ్రిడ్జి నుంచి కనకాపూర్ గ్రామానికి చేరుకున్నారు. అక్కడ పెట్రోల్ బంక్ సమీపంలోని ఇంటి ముందు నిలుపుదల చేయబడిన టీఎస్-18-7614 నంబరు గల బైక్‌ను దొంగిలించి, అదే గ్రామంలో ఉన్న బస్టాండ్ ఏరియాలోని ఓ గోల్డ్ షాప్ కు వెళ్లి, తాళాన్ని ఇనుప రాడ్‌తో పగులగొట్టి, షట్టర్‌ను పైకి లేపి షాప్‌లో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు దొంగతనం చేశారు. అదే రాత్రి ఉమ్రికి తిరిగి వెళ్తున్న సమయంలో, మార్గమధ్యలో కుంటాల మండలం, కల్లూరు గ్రామం బస్టాండ్ సమీపంలో బైక్‌ను ఆపి, అక్కడి రెండు షాపుల తాళాలను ఇనుప రాడ్‌తో పగులగొట్టి, ఒక్క షాప్‌లో రూ.1,000, మరొక షాప్‌లో రూ.1,500 నగదును దొంగతనం చేశారు. అనంతరం ఉమ్రికి తిరిగి వెళ్లిపోయారు.ఈ వరుస దొంగతనాల నేపథ్యంలో, నిందితులను త్వరగా పట్టుకోవాలనే లక్ష్యంతో నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు, సోన్ సీఐ బి. గోవర్ధన్ రెడ్డి నేతృత్వంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో నేడు (గురువారం) నిందితులు నిర్మల్ గాంధీ చౌక్ వద్ద దొంగతనమైన ఆభరణాలను విక్రయించడానికి వచ్చిన సమాచారంతో అప్రమత్తమైన




ప్రత్యేక బృందం వారిని అదుపులోకి తీసుకుంది. పారిపోవడానికి ప్రయత్నించినప్పటికీ, పోలీసులు చాలా చాకచక్యంగా,రాజు సింగ్, సేవక్ సింగ్, సుర్దీప్ సింగ్ లను అరెస్ట్ చేశారు. నిందితుల నుండి 2.7 కిలోలు వెండి, 17 గ్రాముల బంగారం, 2500 నగదు, మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు దొంగతనానికి ఉపయోగించిన మరో మోటార్ సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. అలాగే వారు షట్టర్ లిఫ్ట్ చేయడానికి వాడిన రాడ్డును గుర్తుతెలియని ప్రదేశంలో పడవేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ దొంగతనం జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసును కేవలం మూడు రోజుల్లో ఛేదించి నిందితులను పట్టుకోవటం జరిగింది. జిల్లా పోలీసులు ప్రజల రక్షణ కోసం కట్టుబడి ఉన్నారు. ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలుంటే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు న్యాయం చేస్తూ, నేరాలపై కఠినంగా వ్యవహరిస్తుంది. ప్రజల సహకారం ఎంతో అవసరం. ఏవైనా అనుమానాస్పద చట్టవిరుద్ధ కార్యకలాపాలుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ గారు విజ్ఞప్తి చేశారు. ఈ కేసు ఛేదనలో సిసి కామెరాలు ముఖ్య పాత్రను పోషించాయి కనుక అంధరు కూడా సిసి కామెరాలను అమార్చుకోవాలని జిల్లా ఎస్పి సూచించారు. ఈ కేసు చేదనలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నూటికి నూరు శాతం రికవరీ చేసిన అధికారులైన సిఐ బి.గోవర్ధన్ రెడ్డి,లక్ష్మణ్ చందా ఎస్ఐ సి.శ్రీనివాస్, పిసిఆర్ ఎస్ఐ ప్రదీప్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.





# గ్రామాల అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలి : జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, జులై 17 : జిల్లాలోని గ్రామపంచాయతీల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి లతో కలిసి జిల్లా అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఆపరేటర్లతో గ్రామాల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలోని గ్రామపంచాయతీలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల భవనాలలో నెలకొన్న మరమ్మత్తుల వివరాలతో నివేదిక రూపొందించాలని, విద్యార్థులకు అందించే త్రాగునీరు, మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, సంక్షేమ వసతి గృహాలను సందర్శించి, ఒక రోజు అక్కడ నిద్రించాలని, మండల ప్రత్యేక అధికారులు పాఠశాలలను సందర్శించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కిశోర బాలికలకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వర్షాకాలం అయినందున గ్రామాలలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. జిల్లాలో పంట సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ప్రభుత్వంచే గుర్తించబడిన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉంచాలని, రైతులకు అవసరమైన పంట సాగు మెళకువలను అందించాలని తెలిపారు. నివాస స్థలం కలిగి ఉండి ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద ఆర్థిక సహాయం పొందుతున్న లబ్దిదారులు నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు చేపట్టడంతో పాటు నిబంధనలకు అనుగుణంగా నిర్మించిన బేస్మెంట్, లెంటల్, స్లాబ్ స్థాయిలకు అనుగుణంగా బిల్లులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో అంతర్గత రహదారుల నిర్మాణాలు, మరమ్మత్తులు త్వరగా పూర్తి చేసేలా పనులను పర్యవేక్షించాలి న్నారు. రేషన్ కార్డుల కొరకు అందిన దరఖాస్తులను త్వరగా పరిశీలించి, నిబంధనల ప్రకారం మంజూరు చేసే విధంగా ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకంలో నల్లా కనెక్షన్ తో ప్రతి ఇంటికి శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, ఈ క్రమంలో నీటి ట్యాంక్ మోటార్లు, పైప్లైన్ల లీకేజీ మరమ్మత్తులను తక్షణమే చేపట్టిన నీటి సరఫరాను పునఃరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొందేలా సాంకేతిక పరిజ్ఞానంపై ఉచిత శిక్షణ అందించాలని, అర్హులైన అభ్యర్థులకు ప్రభుత్వ పథకాలను అమలు చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేలా ప్రోత్సహించాలని తెలిపారు. నర్సరీలలో మొక్కల పెంపకం నిర్వహణ పకడ్బంధీగా చేపట్టాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం క్రింద చేపట్టిన పనులను వేగవంతం చేయాలని, అర్హులైన జాబ్ కార్డులు కలిగిన ఉపాధి కూలీలకు 100 రోజుల పని కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# కోరుట్లను చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దుదాం

## – మున్సిపల్ మేనేజర్ చిట్యాల శ్రీనివాస్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)


జగిత్యాల, జూలై 17 : కోరుట్లను చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దుదామని మున్సిపల్ మేనేజర్ చిట్యాల శ్రీనివాస్ అన్నారు. ఇందుకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. గురువారం కోరుట్ల పట్టణంలోని 16,వార్డులో మున్సిపల్ కమిషనర్ రవీందర్ ఆదేశాల మేరకు స్థానిక తాజా మాజీ కౌన్సిలర్ బలిజ పద్మ రాజారెడ్డి ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ తడి, పొడి చెత్తను వేరుచేసి వార్డులోకి వచ్చే చెత్త బండికి ఇవ్వాలని కోరారు. చెత్తను రోడ్లపై మురికి కాల్వలలో వేయకూడదని అన్నారు. ప్రతి ఒక్కరు తప్పకుండా తడి, పొడి చెత్తను వేరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు ఆఫీసర్ జగదీశ్వర్, ఆర్పి పావని, బలిజ శివప్రసాద్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతర పోరాటం !

## – రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫైసల్ – ఇంటి స్థలాల కోసం త్వరలో ఉద్యమం !

## – జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




సంగారెడ్డి, జూలై 17 : జర్నలిస్టుల హక్కులను సాధించేందుకు నిరంతరం పోరాడే సంఘం టియుడబ్ల్యూజే (ఐజేయు) మాత్రమే నని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎకే ఫైసల్ అన్నారు. గురువారం సంగారెడ్డిలోని టీఎన్జీవో భవన్లో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఫైసల్ మాట్లాడుతూ దశాబ్దాలుగా జర్నలిస్టుల కోసం తమ సంఘం పోరాడుతుందని చెప్పారు. మండల స్థాయి జర్నలిస్టులకు ఇంటి స్థలాలను సాధించడంలోనూ, హెల్త్ కార్డులు మంజూరు చేయడంలోనూ తమ సంఘం ఎంతో కృషి చేసిందని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో హెల్త్ కార్డుల గురించి అనేకసార్లు విన్నవించామని, ఫలితం లేకపోయిందని చెప్పారు ఈ ప్రభుత్వ హయాంలో కూడా అదే నిర్లక్ష్యం కనబడుతోందని అన్నారు. త్వరలో దీనిపైన ఉద్యమ కార్యాచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులందరిని కలిసి తొలుతగా విన్నవిస్తామని అన్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే అవసరమైతే మహాధర్నా చేపడతామని తెలిపారు. వచ్చే ఆగస్టు నెల రెండో తేదీ వరకు జిల్లాలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా యూనియన్ అధ్యక్షుడు బండారు యాదగిరి మాట్లాడుతూ జిల్లాలోని అనేకమంది అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు రాలేదని చెప్పారు జిల్లా కేంద్రంలో సంగారెడ్డి తో పాటు అనేక చోట్ల జర్నలిస్టులు విన్నవిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని పేర్కొన్నారు అందుకని త్వరలో దీనిపైన పెద్ద ఎత్తున ఉద్యమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. అంతేకాకుండా ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డును అందించేందుకు తమ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు అయినప్పటికీ ఆలస్యం జరుగుతున్నందున జర్నలిస్టు కుటుంబాలు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. పేద మధ్యతరగతి జర్నలిస్టులకు వైద్యం భారంగా మారిందని తెలిపారు ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే హెల్త్ కార్డుల పాలసీని ప్రకటించాలని కోరారు. జర్నలిస్టుల గ్రూప్ ఇన్సూరెన్స్ పై కూడా జిల్లా స్థాయిలో ఒక నిర్ణయం తీసుకుంటామని అన్నారు. యూనియన్ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరు చురుకుగా పాల్గొనాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు అనేక కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు అనిల్ ,ప్రధాన కార్యదర్శి ఆసిఫ్, ఉపాధ్యక్షుడు సిద్ధిక్, హౌసింగ్ కమిటీ సభ్యుడు అన్వర్, సీనియర్ నాయకులు పానుగంటి కృష్ణ, అజిత్, సిద్దన్న పాటిల్, విల్సన్, మసూద్ ఖాన్, మథిన్, మల్లేశం బాసిత్, ఫోటోగ్రాఫర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిఫ్, సత్యనారాయణ, వెంకటేష్ యాదగిరి, హాజీ, నరేష్, మినాజ్, ఆంజనేయులు సంతోష్, హరి, కృష్ణతదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా సమావేశానికి హాజరైన ఎంఏకే ఫైసల్కు యూనియన్ సభ్యులు ఘనంగా శాలువాతో సన్మానించారు.

# నేడు ఏడుపాయలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

## బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు వడ్ల సంతోష్ చారి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, జూలై 17 : నేడు ప్రసిద్ధ పుణ్యక్షేత్ర మైన శ్రీఏడుపాయల వనదుర్గా మాతను భారతీయ జనతా పార్టీ (బీజేపీ) రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్ర రావు ఉదయం 11.00 గంటలకు దర్శించుకోనున్నట్లు బీజేపీ పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షులు వడ్ల సంతోష్ చారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను జిల్లా పార్టీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని పేర్కొన్నారు. ఏడుపాయల దర్శనం అనంతరం మెదక్ సాయి బాలాజీ గార్డెన్లో కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పాపన్నపేట మండల బిజెపి కార్యకర్త బంధువులు బిజెపి అభిమానులు హాజరై మొట్టమొదటిసారి రాష్ట్ర అధ్యక్షుని హోదాలో ఏడుపాయలను సందర్శించనున్న రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావుకు ఘన స్వాగతం పలకాలని తెలిపారు. కాగా ఆయనతో పాటు మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, ముల్క కొమురయ్య, తదితరులు హాజరవుతున్నట్లు ఆయన చెప్పారు.





# అంబేద్కర్ విగ్రహాలపై దాడి చేస్తే ఉరుకోము

## – అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు...

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షేటిపేట, జులై 17 : అంబేద్కర్ విగ్రహాలపై దాడిచేస్తే ఊరుకునేది లేదని, రాజ్యాంగ రచయితను అవమానించడం సిగ్గుచేటని, సబ్బండ వర్గాలకు సమాన హక్కులు ప్రసాదించిన ప్రదాత బాబా సాహెబ్ అంబేద్కర్ అని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని అ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం అయన మాట్లాడుతు నాగర్ కర్నూల్ జిల్లాలో అంబేద్కర్ విగ్రహంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కొంతమంది అంబేద్కర్ ను అర్థం చేసుకోకుండా, అంబేద్కర్ ను చదవకుండా, వ్యతిరేకత పెంచుకోవడం సరికాదన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నర్సయ్య, మండల ఉపాధ్యక్షులు భైరం లింగన్న,మాజీ మండల ప్రధాన కార్యదర్శి ఆకెనపల్లి శిల్పతి,పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, లింగంపల్లి సుధాకర్, పెండెం రాజశేఖర్, అలుగునూరి నరేష్, దుంపల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.






# ప్రతి ఒక్క మహిళ ఆర్థిక అభివృద్ధి సాధించాలి

## - సంఘంలోని తోటి మహిళలకు చేయూత అందించాలి - వ్యాపార రంగాలలో మహిళలదే పై చేయి కావాలి - ఆర్థిక రంగాన్ని శాసించే స్థాయికి మహిళలు ఎదగాలి - జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జనగామ, జూలై 17 : ప్రతి ఒక్క మహిళ ఆర్థిక అభివృద్ధి సాధించాలని, సంఘంలోని తోటి మహిళలకు చేయూత అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పేర్కొన్నారు. గురువారం జనగామ పట్టణంలోని ఓం సాయి గార్డెన్స్ లో ఇందిర మహిళ శక్తి సంఘాల సంబరాలు వేడుకల కార్యక్రమం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిణి ఆధ్వర్యంలో నిర్వహించగా ఆర్.టి.ఐ. సభ్యులు అభి గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పాల్గొని కేక్ ను కట్ చేసి మహిళలకు స్ఫూర్తి ఇచ్చారు. ఈ సందర్భంగా మహిళ సంఘాలు పలు వ్యాపార రంగాలలో ప్రావీణ్యత సాధిస్తూ అభివృద్ధి పథంలో సాధికారత దిశగా దూసుకుపోతున్న నేపద్యాలను సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...రానున్న రోజుల్లో వ్యాపార రంగాలలో మరింత ప్రావీణ్యత పొంది అభివృద్ధిపై పట్టు సాధిస్తూ...ఆర్థిక రంగాన్ని శాసించే స్థాయికి ఎదగాలన్నారు. మహిళలందరు కోటీశ్వరులు కావాలన్నారు. మహిళలకు ఇందిర మహిళ క్యాంటీన్ లు కలక్టరేట్ లో, జనగామ మున్సిపాలిటీ లో, పాలకుర్తిలో, బచ్చన్నపేట లో ఏర్పాటు చేయగా విజయవంతం గా నిర్వహించడం తో అభినందించారు. ప్రభుత్వం తోడ్పాటు అందిస్తున్నందిన పరిశ్రమలపై దృష్టి పెట్టాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు, ధాన్యం కొనుగోళ్లతో ఇప్పటికే అభివృద్ధి పథంలో రాణిస్తున్నారని, ఇదే స్ఫూర్తితో బస్ల కొనుగోలు చేపట్టారని, సోలార్ యూనిట్ల స్థాపన, పెట్రోల్ బంక్ ల ఏర్పాటు తో కోటీశ్వరులు కావాలన్నదే ప్రభుత్వ ఆశయం అన్నారు. ప్రతి సెంటర్ లో ఆగస్టు 15వ తేదీ లోపు 50 వనిత టీ స్టాల్ లను చేపట్టాలన్నారు. పిల్లలను చదివించాలని, ఆడపిల్లలను తప్పక చదివించాలని, విద్యతో రాణిస్తే భవిష్యత్పై నమ్మకం ఏర్పడుతుందన్నారు. స్కూల్ యూనిఫామ్ లను పాఠశాలలు ప్రారంభంలోనే మొదటి జత అందించి సత్తా చాటారన్నారు. సఖి సెంటర్ ను మహిళలు ఉపయోగించు కోవాలన్నారు. మన ఊరు... మన నీరు కార్యక్రమంలో తక్కువ ఖర్చుతో సోక్ పిట్ ల నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, ప్రతి ఒక్కరూ ఉద్యమంలా చేపట్టి విస్తృత పరచాలన్నారు.



# ఇందిరమ్మ ఇండ్లు త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

## – గ్రామాల్లో నిత్యం పారిశుధ్య పనులు నిర్వహించాలి

## – కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

## – సనుగుల, రామారావుపల్లెలో ఆకస్మిక తనిఖీ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, జూలై 17 : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకొని.. ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు. చందుర్తి మండలంలోని రామారావు పల్లె గ్రామపంచాయతీ కార్యాలయం ఎదురుగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను కలెక్టర్ గురువారం పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని సూచించారు. గ్రామంలో వీధి కుక్కలు ఎక్కువగా తిరగడం గమనించిన కలెక్టర్.. వాటిని నియంత్రిం చాలని పంచాయతీ సెక్రెటరీ , అధికారులకు ఆదేశించారు.గ్రామాల్లో నిత్యం పారిశుధ్య పనులు నిర్వహించాలీసనుగుల గ్రామపంచాయతీ పరిధిలో రహదారుల వెంట ఇరువైపులా గడ్డి, నిరుపయోగ మొక్కలు పెరగడం, రహదారి వెంబడి వర్షపు నీరు ఉండడాన్ని కలెక్టర్ పరిశీలించారు. రోడ్ల వెంట గడ్డి, ఇతర మొక్కలు వెంటనే తొలగించాలని, నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో అవసరమైన చోట్ల సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో నిత్యం పారిశుధ్య పనులు చేయించాలని, నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# నంగి దేవేందర్ రెడ్డిపై దాడిని ఖండించిన జువ్వాడి కృష్ణారావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, జూలై 17 : గల్ఫ్ ఎన్ఆర్ఐ అడ్వైజరీ బోర్డు సభ్యుడు నంగి దేవేందర్ రెడ్డిపై బిఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అనుచరులు గురువారం దాడి చేసి కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ గల్ఫ్ దేశాల్లో మృతి చెందిన వారి కుటుంబీకులకు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 05 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా చెల్లిస్తున్న విషయం తెలిసిందేనన్నారు. ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తన నియోజకవర్గంలో ఏ ఒక్కరికి కూడా గల్ఫ్ ఎన్నారై పాలసీ కింద డబ్బులు ఇవ్వలేదని అసత్య ఆరోపణలు చేయగా, ఎన్నారై పాలసీ కమిటీ సభ్యుడు నంగి దేవేందర్ రెడ్డి నియోజకవర్గంలో 18 మందికి ఈ పాలసీ కింద సహాయం పొందిన వారి కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత్ రెడ్డి స్వగ్రామమైన వేల్పూర్ లోని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఇంటికి బహిరంగ చర్చకోసం వెళ్లగా, స్థానిక ఎమ్మెల్యే అనుచరులు టిఆర్ఎస్ గుండాలు ఆయనపై దాడి చేసి గాయపరిచారని తెలిపారు. దేవేందర్ రెడ్డిపై దాడి 15 లక్షల గల్ఫ్ కుటుంబాలపై దాడి అని కృష్ణరావు అన్నారు. అధికారం కోల్పోవడంతో టిఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేసి లబ్ధి పొందాలని దురుద్దేశంతో గోబెల్స్ ప్రచారం చేస్తున్నాడని, ఈ అబద్ధపు ప్రచారాన్ని దేవేందర్ రెడ్డి తిప్పి కొట్టడంతో సైకోగా మారి దాడులకు పాల్పడుతున్నాడని అన్నారు. ప్రభుత్వం ఈ దాడి పట్ల కఠినంగా వ్యవహరించి నిందితులను కఠినంగా శిక్షించాలని జువ్వడి కృష్ణారావు కోరారు.

# అంగన్వాడీ సెంటర్ల ఆకస్మిక తనిఖీ



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూలై 17 : పాపన్నపేట మండల పరిధిలోని నాగసానిపల్లి అంగన్వాడి సెంటర్‌లను గురువారం సూపర్వైజర్ శ్రీదేవి ఆకస్మితనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా పిల్లల తల్లిదండ్రులు అంగన్వాడి టీచర్ తలారి యాదమ్మపై పలు ఆరోపణలు చేశారు. సమయానికి గుడ్లు ఇవ్వకపోవడం, పిల్లలకు చదువు చెప్పకపోవడం ఆమె ఇష్టానుసారంగా ప్రవర్తించడం నేనే సీనియర్ టీచర్‌ని నాకు ఎవరు చెప్పరు అని ఇష్టానుసారంగా తల్లిదండ్రులను బెదిరించడం చేస్తుందని తల్లిదండ్రులు సూపర్వైజర్‌కు వివరించారు. తన సొంత ఇంటిలోనే అంగన్వాడి సెంటర్‌ను నడిపిస్తూ నా ఇష్టానుసారంగా నడవాలని ఆమెకి ఇష్టం వచ్చిన పనులు చేసుకుంటూ ఎవరైనా ఆమెను అడిగితే మీరేమీ చేయలేరని అంటుందని వివరించారు. టీచర్ యాదమ్మను వెంటనే విధుల నుండి తొలగించాలని ఈ టీచర్ మాకు వద్దని తల్లిదండ్రులు సూపర్వైజర్ తమ గోడును వివరించారు. ఈమెపై తక్షణమే చర్య తీసుకోవాలని తల్లిదండ్రులు వినతిపత్రాన్ని అందజేశారు. పిల్లలను నాలుగు గంటలకు పంపాల్సి ఉండగా, మధ్యాహ్నమే ఇంటికి పంపిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో కోతుల బెడద ఉన్నందున పిల్లలకి ఏం జరుగుతుందోనని తమ సమస్యలను విన్నవించారు. అంగన్ వాడిలో పూర్తిగా ఉడకని గుడ్లను తినిపించడం మూలంగా పిల్లలకు వాంతులు, విరేచనాలు అవుతున్నట్లు తెలిపారు. అంగన్వాడీ టీచర్ యాదమ్మపై తగు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో పాటు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు దండోల్ల సామెల్ మాదిగ, మాదిగ పేరెంట్స్ చెలిమిటి రమేష్, సుల్తాన్, మల్లేశం, బీరప్ప, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# మీడియాపై దాడి చేస్తే ఊరుకునేది లేదు

## - మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మెదక్, జూలై 17 : మీడియాపై దాడి చేస్తే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ నేత మైనం పల్లి హన్మంత రావు అన్నారు. గురువారం రోజు మెదక్ లో చందన బ్రదర్స్ 8వ బ్రాంచ్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. మెదక్ మంచి ప్రాంతం మా కొడుకుకు రాజకీయ బిక్ష పెట్టిందన్నారు.మెదక్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ దుకాణం బంద్ అయిందని బావ,బావమరిది యూట్యూబ్ ఛానెల్ లకు డబ్బులు ఇచ్చి కాంగ్రెస్ పార్టీని బద్నాం చేస్తున్నారని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన వారు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, ఇక నాతో పెట్టుకుంటే బావకు బామ్మర్దికి చుక్కలు చూపిస్తానని దుయ్యబట్టారు. మేము గ్రౌండ్‌లో ఉంటామని, మమ్మల్ని ఎదుర్కోవాలంటే ఫీల్డ్‌లోకి రావాలని సవాల్ విసిరారు. మీడియాలపై దాడి చేస్తున్న కెసిఆర్ ఫ్యామిలీకి రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదన్నారు. బిఆర్ఎస్ నాయకులు మళ్ళీ తెలంగాణ, ఆంధ్ర ఫీలింగ్ తెస్తున్నారన్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో సినీ నటి వైష్ణవి చైతన్య, జబర్ దస్త్ టీమ్ నటులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల పండుగ

## - ఎన్టీపీసీలో పోచమ్మ బోనాల వేడుకలు- ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి (గోదావరిఖని), జూలై 17 : తెలంగాణ సంస్కృతి సంప్రదాయలకు బోనాల పండగ ప్రతీక గా నిలుస్తుందని ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్ అన్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఎన్టీపీసీ టౌన్ షిప్‌లో 24వ డివిజన్‌లో నిర్వహించిన ఆషాఢమాస పోచమ్మ బోనాల ఉత్సవాల్లో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ సతీమణి మనాలి ఠాకూర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం 24వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కవిత వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా మనాలి ఠాకూర్ బోనాలు సమర్పించి పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజల ఆరోగ్య సౌఖ్యాలు, శాంతి, సమృద్ధి కలగాలని తల్లిని ప్రార్థించారు. అనంతరం అక్కడ ఉన్న స్థానిక మహిళలు, యూత్, ప్రజానాయకులతో ముచ్చటిస్తూ, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అమ్మవారి కి మొక్కులు చెల్లించినట్లయితే భక్తుల కోరికలు నెరవేరుతాయన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంప్రదాయ కార్యక్రమాలను ప్రభుత్వ సహకారంతో ఇంకా ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు తగినామద్దతు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు తదితరులు హాజరయ్యారు.

# న్యాయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడం లక్ష్యం

## - జూనియర్ సివిల్ జడ్జి, జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నారం అరుణ్ కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




జగిత్యాల, జూలై 17 : న్యాయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంపొందించడం లక్ష్యం అని జూనియర్ సివిల్ జడ్జి, జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నారం అరుణ్ కుమార్ అన్నారు. గురువారం అంతర్జాతీయ న్యాయ దినోత్సవం పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కోరుట్ల కోర్ట్ హాల్ లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. కోర్టు హాల్ లో జూనియర్ సివిల్ జడ్జి, జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నారం అరుణ్ కుమార్ తో కేక్ కట్ చేయించి, న్యాయ రంగంలోని వారి సేవలను గుర్తిస్తూ గౌరవ న్యాయమూర్తిని, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీపీ ప్రణయ్‌ను ఘనంగా సన్మానించారు. న్యాయ వ్యవస్థ సమాజానికి అండగా నిలుస్తున్న నేపథ్యంలో న్యాయమూర్తులు, న్యాయవాదుల సేవలు మననం చేసుకుంటూ న్యాయ దినోత్సవాన్ని నిర్వహించడం ప్రాముఖ్యతగల విషయం అని నిర్వాహకులు పేర్కొన్నారు. అంతర్జాతీయంగా న్యాయ పరిరక్షణకు దోహదపడే వ్యక్తులను గౌరవించడం, న్యాయ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడం లక్ష్యంగా అంకితభావంతో పని చేయడం అభినందనీయం అని లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొమ్ముల జీవన్ రెడ్డి అన్నారు. లయన్స్ సభ్యులు కోరుట్ల కోర్టు సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొమ్ముల జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏలేటి లక్ష్మారెడ్డి, కోశాధికారి నల్ల గంగాధర్, గుంటుక సురేష్ బాబు, పోతని ప్రవీణ్, మంచాల జగన్, గుంటుక మహేష్, కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బైరి విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కొంపెల్లి సురేష్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం ఎరువులు,విత్తనాలు విక్రయించాలి


## - పీఏసీఎస్‌లు ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రాజన్న సిరిసిల్ల, జూలై 17 : నిబంధనల ప్రకారం ఎరువులు, విత్తనాలు విక్రయించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. చందుర్తి మండలంలోని మరిగడ్డ శ్రీ పవన కుమార ఫెర్టిలైజర్ దుకాణం, చందుర్తి మండల కేంద్రం, సనుగుల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాలు దుకాణాల్లోనిలువలు పరిశీలించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రంలోని సేల్స్, స్టాక్ రిజిస్టర్ పరిశీలించి గోదాం ను తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.. నాణ్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు అందజేయాలని సూచించారు. కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు ఉంటాయని యజమానులను కలెక్టర్ హెచ్చరించారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెటిపేట, జులై 17 : లక్షెటిపేట మండల కేంద్రంలోని దొడెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 1985-86 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 40 ఏండ్ల తరువాత మళ్ళీ అదే పాఠశాలలో ఒకరినొకరు కలుసుకుని ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను గుర్తించుకుని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆహ్వానించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదిగినప్పుడే తల్లిదండ్రులతో పాటు విద్య నేర్పిన గురువులకు గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాండు రంగారావు, సూర్యకుమారి, లచ్చన్న, లక్ష్మీరాజం, గురువయ్య, రాజలింగం, సత్తయ్య,పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# అవార్డ్ గ్రహీతను సన్మానించిన సిఐటియు నాయకులు




## - మహానంది పురస్కారం అభినందనీయం

## - ఎస్సిఈయు రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, జూలై 17 : అంతర్జాతీయ సేవా సంస్థ తెలుగు సంస్కృతి సాహితి సేవా ట్రస్ట్, తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల జాతీయస్థాయిలో మహానంది అవార్డు అందుకున్న జర్నలిస్టు జాడ క్రాంతి కుమార్ (టైమ్స్ ఆఫ్ వార్త, జిల్లా ప్రతినిధి) ను సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు ఘనంగా సన్మానించారు. జిల్లాలోని మందమర్రి పట్టణంలోని ఆయన నివాసంలో కలిసి, జాతీయ స్థాయిలో అవార్డు పొందడం అభినందనీయమని, శుభాకాంక్షలు తెలిపి, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ అనేక వార్త సమాచారాన్ని చేరవేస్తూ, తనకంటూ పేరు ప్రఖ్యాతలు సంపాదించుకొని, ఈ అర్హత కలగజేసినందుకు ఆ సంస్థకు అభినందనలు తెలుపుతూ, చాలా సంతోషకరంగా ఉందన్నారు. ఈ గౌరవం తనకు మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. ప్రజలకు వాస్తవ పరిస్థితులు అవగతం అయ్యేలా, నిజాలను వెలికి తీసేందుకు, న్యాయంగా సమాచారం ప్రజలకు, అదేవిధంగా ప్రభుత్వానికి అందించేందుకు మరింత కృషి చేయాలని సూచించారు. అవార్డుతో జిల్లా జర్నలిస్టులకు దేశ వ్యాప్తంగా మంచి గుర్తింపు లభించినట్లు సిఐటియు నాయకులు వ్యాఖ్యానించారు. పత్రికా రంగంలో నిబద్ధతతో పని చేస్తూ ప్రజా, కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పాలకుల దృష్టికి తీసుకు రావడంలో ముందుంటారన్నారు. ఒత్తిడి ఎదుర్కొన్నప్పటికీ కార్మిక వర్గం, ప్రజా సమస్యల పరిష్కారాలు ఏనాడు అధైర్యపడకుండా వార్త కథనాలు అందిస్తూ, పాలకులకు చలనం కలిగించాడన్నారు. రానున్న రోజుల్లో తన కళానికి మరింత పదును పెట్టి, ప్రజలు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి వారి సమస్యల పరిష్కారానికి పాలకులకు దృష్టికి తీసుకువచ్చేలా సమగ్రమైన వార్త కథనాలు అందించాలని, విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తూ, మరిన్ని అవార్డులు రివార్డులు సాధించాలని ఆకాంక్షించారు.





# పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలి

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

## - అంతర్గాం మండలంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, జూలై 17: పాఠశాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అంతర్గాం మండలంలో విస్తృతంగా పర్యటించారు. అంతర్గాం మండలం మద్దిరాల గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు, అంగన్వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, పోట్యాల గ్రామంలోని ఎంపిపిఎస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బ్రాహ్మణపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, గోలివాడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత కల్పించాలని, ఎక్కడా గడ్డి, పిచ్చి మొక్కలు పెరగకుండా జాగ్రత్త వహించాలని, పాఠశాలల్లోని పిల్లలకు విష జ్వరాలు రాకుండా చూసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలకు ఎటువంటి సమస్యలు వచ్చిన వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని, రాబోయే 5 సంవత్సరాల పాటు ఎటువంటి అవసరాలు లేకుండా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతిపాదనలు అందించాలని, వాటిని వెను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మద్దిరాల గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోను రాణించాలి

## - జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జయశంకర్ భూపాలపల్లి, జూలై 17: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోను రాణించి నెంబర్ వన్ స్థాయికి చేరాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం చిట్యాల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని (కేజీబీవీ) జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. 10వ తరగతి గదిని పరిశీలించి విద్యార్థులతో హిందీ పాఠం చదివించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో బాగా రాణించాలంటే ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించాలని ప్రిన్సిపల్ కు సూచించారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండాలని, తల్లిదండ్రులు నుండి దూరం వచ్చి చదువుకుంటున్నారని, విద్యార్థులను మన పిల్లలుగా భావించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ, విద్యా ప్రగతికి బాటలు వేయాలని స్పష్టం చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. స్టోర్ రూము, వంటగదిని పరిశీలించి వంట గది నిర్వహణను స్వయంగా ఫోటో తీసుకున్నారు. పాఠశాల నిర్వహణను పరిశీలించిన కలెక్టర్ భోజనం నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ భోజనం బావుంది... స్టోర్ రూమ్ నిర్వహణ బావుంది.. ఇలానే మంచిగా నిర్వహించండని సిబ్బందిని అభినందించారు. విద్యార్థులకు వసతి, భోజనంతో విద్యాభ్యాసానికి మంచి వాతావరణం కల్పించడంలో ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు. భోజన సమయంలో విద్యార్థులతో రాహుల్ శర్మ స్నేహపూర్వకంగా మాట్లాడి, వారి అభిప్రాయాలను సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో మురుగునీరు వెళ్లేందుకు అవుట్ లెట్, కాంపౌండ్ వాల్, సోలార్ విద్యుత్తు సౌకర్యం కల్పించాలని ప్రిన్సిపాల్ కోరగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, ఎంపీడీవో జయశ్రీ, ప్రిన్సిపల్ సుమలత తదితర అధికారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు - పోలీసుల ప్రత్యేక చర్య




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూలై 17 : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణనే లక్ష్యంగా ఎస్పి అశోక్ కుమార్ ఐపిఎస్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "సురక్షిత ప్రయాణం" అనే కార్యక్రమంలో బాగంగా గురువారం జగిత్యాల పట్టణంలోని నటరాజ్ థియేటర్ రోడ్డు నుండి వాహనాలు వచ్చి నేషనల్ హైవేను కలిసే వద్ద తరచుగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నందున టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్.ఐ మల్లేష్ ఆధ్వర్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ఈ చర్య వల్ల అధిక వేగంతో వస్తున్న వాహనాలు నియంత్రణలోకి వచ్చి ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని అన్నారు. రోడ్డు ప్రమాదల నివారణలో ప్రజలు కూడా భాగస్వాములై ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదలను నివారిచడంలో కృషి చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి పోలీసులు తీసుకున్న చొరవను స్థానిక ప్రజలు అభినందించారు.

# జూలై 21లోపు నైపుణ్య శిక్షణ కోసం ఎంబీసి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి

## - జిల్లా బీసి అభివృద్ధి అధికారి జె.రంగారెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, జూలై 17 : జూలై 21 లోపు నైపుణ్య శిక్షణ కోసం ఆసక్తి , అర్హత గల ఎంబీసి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసి అభివృద్ధి అధికారి జె.రంగారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంబీసీ నిరుద్యోగ యువతీ యువకుల కు వివిధ నైపుణ్య శిక్షణ కార్యక్రమం 4 రోజుల పాటు హైదరాబాద్ లో అందించడం జరుగుతుందని అన్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు భోజన సదుపాయం, టిఏ, వసతి కల్పించడం జరుగుతుందని అన్నారు. అభ్యర్థులకు 21 నుంచి 30 సంవత్సరాల వయసు లోపు ఉండాలని , ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత సాధించాలని , ఎంబిసి 36 కులాల వారికి మాత్రమే ఈ శిక్షణ కార్యక్రమం అందుతుందని, వీరి వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో 1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో 2 లక్షలు ఉండాలని అన్నారు. ఆసక్తి అర్హత కల అభ్యర్థులు తమ దరఖాస్తులను జూలై 21 లోపు tgobmms.cgg.gov.in వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకొని, ఆధార్ కార్డు కుల ధ్రువీకరణ పత్రం ఆదాయ ధ్రువీకరణ పత్రం విద్యార్హత సర్టిఫికెట్లతో దరఖాస్తు జత చేసి పెద్దపల్లి కలెక్టరేట్ లో ఉన్న బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో జూలై 22 లోపు సమర్పించాలని , నిరుద్యోగ ఎంబీసీ యువతీ యువకులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసి అభివృద్ధి అధికారి జె.రంగారెడ్డి ఆ ప్రకటనలో పేర్కొన్నారు

## హెచ్‌సిఎం అక్రమాల వెనక కెటిఆర్, కవిత

- తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆరోపణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జులై17: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ హెచ్‌సీఏలో అక్రమాల వెనుక మాజీ మంత్రి కేటీఆర్ , ఎమ్మెల్సీ కవిత హస్తముందని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) ఆరోపించింది. ఈ మేరకు సీఐడీ డీజీ చారుసిన్హాకు టీసీఏ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి గురువారెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో మరికొందరు అక్రమార్కులు కూడా ఉన్నారని.. వారిపైనా విచారణ జరిపించాలని కోరారు.

## బిఆర్ఎస్ హయాంలో వేల ఫోన్ల ట్యాపింగ్

మొదటిపేజీ తరువాయి

సానుభూతిపరులనే ఆరోపణలతో మా ఫోన్లు ట్యాపింగ్ చేశారన్నారు. బీఆర్ఎస్ హయాంలో తన రెండు ఫోన్లు ట్యాపింగ్ అయ్యాయని తెలిపారు. అప్పటి ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా, ప్రజల అభిప్రాయానికి మద్దతుగా పోరాడుతున్నాననే నా ఫోన్ ట్యాప్ చేశారన్నారు. నాతో పాటు నా అనుచరుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని.. మా కదలికలు తెలుసుకోవడానికి ట్యాపింగ్‌కు పాల్పడ్డారని పేర్కొన్నారు. ప్రజల ఫోన్లు ట్యాప్ చేయాల్సిన అవసరం అప్పటి ప్రభుత్వానికి ఏమి వచ్చిందని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ తీవ్రమైన నేరమని.. ట్యాపింగ్‌కి పాల్పడిన వారందరినీ కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ట్యాపింగ్ విషయంలో నా అభిప్రాయాన్ని సిట్ అధికారులకు చెప్పానని.. అవసరమైతే మళ్లీ పిలుస్తామని అధికారులు చెప్పారని తెలిపారు.

## సచివాలయ పోచమ్మ ఆలయంలో ఘనంగా బోనాలు

మొదటిపేజీ తరువాయి

కళాకారులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాలలో తెలంగాణ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు గిరి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, లావణ్య లత, జనరల్ సెక్రటరీ ప్రేమ్, అదనపు కార్యదర్శి రాము భూక్య, ఆలయ కమిటీ- అధ్యక్షులు శ్రీనివాస రావు తదితరులు హాజరయ్యారు.

## పునరుత్పాదక ఇంధనాలపై సహకారం

మొదటిపేజీ తరువాయి

పెంచేలా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయాలని చెప్పారు. పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలు అధ్యయనం చేయాలని తెలిపారు. ప్రాజెక్టులకు భూసేకరణ, భూకేటాయింపు కోసం ప్రభుత్వ మద్దతు అవసరమని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రతిపాదించిన పునరుత్పాదక ఇంధన కార్యక్రమాలపై తెలంగాణ ప్రభుత్వ సహకారం కోరుతూ లేఖ రాశారు. బొగ్గు మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు, ముఖ్యంగా కోల్ ఇండియా లిమిటెడ్, నేవేలీ లిగ్నయిట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో భాగస్వామ్యం కుదుర్చుకుని, సౌర, పవన విద్యుత్ ఎ÷-లాంట్లు-, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులు , బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ వంటి కీలకమైన పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులు వచ్చే మూడేళ్లలో దాదాపు రూ.10 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించనున్నాయన్నారు. తెలంగాణలోని అధిక సౌరవిద్యుదుత్పత్తి సామర్థ్యం గల జోన్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను అభివృద్ధి చేయడం గురించి ప్రస్తావించారు. గ్రిడ్ స్టెబిలిటీ-, ఎనర్జీ రిలయబిలిటీలను మరింత పెంచేలా అత్యాధునిక బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ను అభివృద్ధి చేయడం ముఖ్యమని అన్నారు. ఈ ప్రతిపాదనలు, ప్రాజెక్టులకు భూసేకరణ, భూకేటాయింపు కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మద్దతు అవసరమని కేంద్రమంత్రి లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు విజయవంతంగా అమలుకావడానికి రాష్ట్ర ప్రభుత్వం, సీపీఎస్‌యూల మధ్య నిర్మాణాత్మక భాగస్వామ్యం, సరైన సమన్వయం అత్యంత అవసరమని వెల్లడించారు. ఇందుకోసం ముఖ్యమంత్రి ప్రత్యేకమైన చొరవతీసుకోవాలని కోరుతున్నామన్నారు. పునరుత్పాదక విద్యుదుత్పత్తిలో తెలంగాణ సామర్థ్యాన్ని గుర్తిస్తూ రాష్ట్రంలో హరితాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణమైన చిత్తశుద్ధితో సహకారం అందిస్తోందని చెప్పారు. ఇది రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. భారతదేశ సుస్థిర విద్యుత్ వ్యవస్థలో తెలంగాణ పాత్ర కీలకం కానున్న సందర్భంలో ఈ ప్రాజెక్టుల ప్రాధాన్యత మరింత పెరగనుందన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు-గా ఆత్మనిర్భరతతో కూడిన భవిష్యత్‌ను ఏర్పర్చుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నిర్మాణాత్మక సహకారం అవసరమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

## అసత్య ఆరోపణలకు మూల్యం తప్పదు

మొదటిపేజీ తరువాయి

చెల్లించుకోక తప్పదు. కేటీ-ఆర్‌పై సీఎం చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి హరీశ్‌రావు ఖండించారు. బనకచర్లపై సీఎం అడ్డంగా దొరికారని.. చిట్‌చాట్ పేరుతో తప్పును కప్పిపుచ్చు కునేందుకు యత్నించారని ఆరోపించారు. బనకచర్లపై తాను చేసిన సవాల్‌ను సీఎం రేవంత్ స్వీకరించలేదన్నారు. ఈ అంశంలో ఏపీకి వత్తాసు పలకడాన్ని తప్పుపడుతున్నట్లు- హరీశ్ చెప్పారు.

## వెల్గటూర్ లో యువకుడి దారుణ హత్య

మొదటిపేజీ తరువాయి

పెట్టారు, స్థానిక వెల్గటూర్ పోలీస్ స్టేషన్ లో కేసులు కూడా నమోదయ్యాయి. అయినా మల్లేష్ వ్యవహారంలో ఎలాంటి మార్పు రాకపోవడంతో, పలుమార్లు యువతి కుటుంబ సభ్యులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మల్లేష్ ప్రేమించిన యువతి కుటుంబ బంధువులు గురువారం వెల్గటూర్ పెద్దవాగు బ్రిడ్జి పై మల్లేష్ ను అడ్డగించి తీవ్రంగా కొట్టి, కోటిలింగాల రోడ్ లోని పాత వైన్స్ వెనుక ప్రాంతానికి తీసుకెళ్లి కత్తులతో విచక్షణ రహితంగా పొడిచి హతమార్చి, మృతదేహాన్ని అక్కడే వదిలి పరారైనట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సమాచారం అందుకున్న వెల్గటూర్ పోలీస్ లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించినట్లు సమాచారం..? హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది..

# ప్రజల ప్రాణాలతో కల్తీకల్లు చెలగాటం

- కూకట్‌పల్లి ఘటనతో ప్రభుత్వం కళ్లు తెరవాలి - కల్లు డిపోలకు లైసెన్సులు రద్దు చేయాలి

- దుకాణాలు మూసేయాలని ప్రజల డిమాండ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జులై17 : బిఆర్ఎస్ పాలకులు ముఖ్యంగా కెసిఆర్ పుణ్యమా అని హైదరాబాద్‌లో కల్లు దుకాణాలు తెరుచుకున్నాయి. ఎక్కడా కల్లు లేకున్నా హైదరాబాద్‌లో కల్తీకల్లు వ్యాపారం సాగుతోంది. దీనికి కెసిఆర్, బిఆర్ఎస్ పాలకులు బాధ్యులు. గ్రామాల్లో తాగడానికి కల్లు లేకున్నా హైదరాబాద్‌లో కల్తీకల్లు తాగి ఇటీవల పలువురు మృత్యువాత పడ్డారు. కూకట్‌పల్లి ఘటనతో కల్లు ఉత్పత్తిపై అనుమానాలు బలపడ్డాయి. గ్రామాల్లో సరిగా ఉత్పత్తి లేకున్నా హైదరాబాద్‌లో భారీగా కల్లు ఉన్నట్లు డిపోలు నడుపుతున్నారు. తాటి, ఈత చెట్ల నుంచి సీజన్ వారీగా మాత్రమే కల్లు వస్తుంది. ఒక్కో చెట్టు నుంచి గరిష్ఠంగా 12 లీటర్ల కల్లు తయారవుతుంది. వాస్తవానికి డిసెంబరు నుంచి కల్లు తీయడం మొదలు పెడతారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో కల్లు ఉత్పత్తి బాగా ఉంటుంది. మే, జూన్ నెలల్లో కల్లు ఉత్పత్తి తగ్గుతుంది. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు నెలల్లో కల్లు ఉత్పత్తి ఉండదు. ఆ నాలుగు నెలల్లో గీత కార్మికులు తాటి, ఈత చెట్లను ఎక్కరు. కానీ.. నగరంలోని కల్లు డిపోల్లో మాత్రం అన్ని సీజన్‌లలోనూ నిరంతరాయంగా కల్లు అమ్మకాలు జరుగుతున్నాయి. సీజన్ లేనప్పుడు.. కల్లు ఉత్పత్తి కాకున్నా.. విక్రయాలు ఎలా సాధ్యమనేది ఎక్సైజ్ అధికారులకు తెలిసినా చెప్పడం లేదు. ఇటీవల కూకట్‌పల్లి ఘటనతో కల్లు దుకాణాలపై మళ్లీ ప్రజల్లో ఆందోళన వస్తోంది. వీటిని ఎత్తేయాలని కోరుకుంటున్నారు. ప్రజల ప్రాణాలు తీస్తున్న కల్లు దుకాణాలను నగరాల నుంచి ఎత్తేయాలని అంటున్నారు. రాష్ట్రంలో 77.78 లక్షల ఈత, తాటి చెట్లు- ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. అత్యధిక చెట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లా రెండో స్థానంలో ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధికంగా ఈత చెట్లు-న్నాయి. ఇక్కడ తాటిచెట్ల సంఖ్య తక్కువే. రాష్ట్రంలో 4,064 తాడి సహకార సంఘాలు ఉన్నాయి. వాటి పరిధిలో 4,697 కల్లు తయారీ కేంద్రాలున్నాయి. వీటిలో 1,95,391 మంది సభ్యులున్నారు. తాటిచెట్టు ఎక్కి కల్లు తీసి.. ఆ చెట్టుకిందనే విక్రయించుకోవడానికి ప్రభుత్వం ట్రీ ఫర్ ట్రేడ్‌లైసెన్సులు ఇస్తుంది. ఇలాంటి లైసెన్సులు పొందిన వాళ్లు రాష్ట్రంలో 29,272 మంది ఉండగా.. వాళ్లు 3,541 దుకాణాలను నడుపుతున్నారు. అధికారికంగా ఎక్సైజ్‌శాఖ ఈ లెక్కలు చెబుతున్నా.. అనుమతుల్లేని కల్లు దుకాణాలు అంతకు రెండింతలు ఉంటాయని అంచనా. రెండ్రోజులుగా జరుగుతున్న దాడుల్లోనూ హైదరాబాద్‌లో అనుమతి లేని కల్లు దుకాణాలు వెలుగులోకి వస్తున్నాయి. కల్తీకల్లు తయారీదారులు ఎక్సైజ్ సిబ్బందిని మామూళ్ల మత్తులో దింపుతున్నారు. దీంతో క్లోరల్ హైడ్రేట్ మత్తులో కల్తీకల్లును తయారు చేసి ప్రజలను ముంచేస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతంతో పోలిస్తే.. రాష్ట్ర వ్యాప్తంగా తాటి చెట్టు ఎక్కి.. కల్లు గీసే గీత కార్మికులు తగ్గిపోతున్నారు. 2023-24లో గీత కార్మికులకు 53 లక్షల తాటి, ఈత చెట్లు కేటాయించగా.. 2024-25లో కేటాయింపుల సంఖ్య 50 లక్షలకు పడిపోయింది. అంటే.. నిజాయితీగా కల్లు విక్రయించే వాళ్లకు పెద్దగా లాభాలు లేకపోవడంతో గీతకార్మికులు ప్రత్యామ్నాయాల వైపు దృష్టిసారిస్తున్నారు. కానీ, చెట్లే లేని చోట విచ్చలవిడిగా కల్లు కాంపౌండ్లు కొనసాగుతూ.. రూ.కోట్లలో వ్యాపారం సాగుతుండడాన్ని బట్టి.. కల్తీకల్లు ఏ స్థాయిలో విజృంభిస్తోందో అర్థం చేసుకోవచ్చు. అందుకు హైదరాబాద్ కల్లు దుకాణాలే నిదర్శనం. వీటిని ఎత్తేస్తే తప్ప ప్రజల ప్రాణాలకు భరోసా లేదు.

## బిసి ఆర్డినెన్స్‌పై కవిత సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

గ్యాప్ రావడానికి కారణాలు ఏంటి అనేది ఇప్పటికి ఇంకా తెలియరాలేదు. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న కేటీఆర్.. కవితకు షాక్ ఇచ్చారు. తెలంగాణ బొగ్గగని కార్మిక సంఘం ఇంఛార్జ్‌గా ఉన్న కవిత స్థానంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నియమించారు. కేటీఆర్ తీసుకున్న ఈ నిర్ణయం గులాబీ పార్టీలో, రాజకీయవర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కవితకు పార్టీలో, అనుబంధ సంఘాల్లోనూ ప్రాధాన్యం తగ్గుతోందంటూ సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. తాజాగా ఎమ్మెల్సీ కవిత.. బీఆర్ఎస్ పార్టీపై చేసిన ఆరోపణలతో ఆ పార్టీకి, ఆమెకు దూరం పెరిగినట్లు కనిపిస్తోంది. అన్నపై ఉన్న కోపంతో కవిత ఈ వ్యాఖ్యలు చేశారనే చర్చ రాష్ట్ర రాజకీయాల్లో జోరందుకుంది. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలపై బిఆర్ఎస్ నేతలు స్పందించకపోవడమనేది దారుణమని ఎంఎల్‌సి కవిత మండిపడ్డారు. ఈ విషయం బిఆర్ఎస్ నేతల విజ్ఞతకే వదిలివేస్తున్నానని, తన దారికి భారత రాష్ట్ర సమితి నేతలు రావాల్సిందేనని స్పష్టం చేశారు. న్యాయ నిపుణులతో చర్చించిన తరువాతనే బిసి రిజర్వేషన్ ఆర్డినెన్స్ ఒక నిర్ణయానికి వచ్చామన్నారు. రెండు బిల్లులు పెట్టాలని తొలుత డిమాండ్ చేసింది కూడా తానేనని తెలియజేశారు. బనకచర్లపై చర్చకు వెళ్లనని సిఎం రేవంత్ రెడ్డి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారని, బుధవారం ఢిల్లీ సమావేశంలో ఎజెండాలో మొదటి అంశమే బనకచర్ల అని పేర్కొన్నారు. బనకచర్లపై చర్చే జరగలేదని రేవంత్ రెడ్డి బుకాయించడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. ఎపి, తెలంగాణ ముఖ్యమంత్రుల మధ్య బనకచర్ల ప్రాజెక్టుపై చర్చలు జరిపారని తెలియజేశారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే గోదావరి జలాలు హక్కులు తెలంగాణ రాష్ట్రం కోల్పోతుంద న్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు గోదావరి జలాలను ఎపి సిఎం చంద్రబాబు నాయుడు చేతిలో పెట్టారని దుయ్యబట్టారు. బనకచర్లతో తెలంగాణకు జరుగుతున్న నష్టం గురించి చెప్పడం లేదని కవిత చురకలంటించారు. బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తే తెలంగాణ ఎడారిగా మారే అవకాశం ఉందన్నారు. తెలంగాణ హక్కులను చంద్రబాబు నాయుడు కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని, దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పరిపాలించే హక్కులేదని, తక్షణమే రాజీనామా చేయాలని కవిత డిమాండ్ చేశారు. గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు హైదరాబాద్‌లో ఉంటే కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ విజయవాడలో ఉంటుందని విభజన చట్టంలో ఉందని చెప్పారు. రెండు నదులకు సంబంధించిన బోర్డు విషయంలో రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని చురకలంటించారు. మన భూభాగంలో ఉన్న నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ రిపేర్లు తెలంగాణ ప్రభుత్వం చేయాలని, ఎపి భూభాగంలో ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ రిపేర్లు చంద్రబాబు ప్రభుత్వం చేయాలని విభజన చట్టంలో ఉందన్నారు. నదులు అనుసంధానం విషయంలో కమిటీలు ఉన్నాయని, ఇప్పుడు కొత్తగా తీసుకొచ్చింది ఏమీ లేదని కవిత మండిపడ్డారు.

## ఉనికి చాటుకునేందుకు హరీష్ యత్నం

మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి చెప్పినా కూడా హరీష్ రావు మెదడుకు ఎక్కనట్టు ఉంది అంటూ సెటైర్ విసిరారు. హరీష్ అడ్డగోలు వాదనతో, అర్థం లేని తర్కంతో పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. సీఎం మాట్లాడగానే ఏదో ఒకటి మాట్లాడి తన ఉనికిని చాటు కోవాలన్న తపన తప్ప హరీష్ రావుకు రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం కాదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో మాజీ సీఎం, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కేసీఆర్‌కు సవాల్ విసిరారన్నారు. అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొనండి లేదా తామే ఫామ్ హౌస్‌కు వచ్చి అక్కడ మాక్ అసెంబ్లీ పెడుతామని పాల్గొనండి అని సవాల్ చేస్తే అక్కడ నుంచి నోరు లేవలేదన్నారు. మళ్లీ సిగ్గు లేకుండా సవాళ్ల గురించి మాట్లాడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్ర ప్రాజెక్టులు కట్టుకున్నా సమస్య లేదు. రాయలసీమను రతనాల సీమ చేస్తాను. బేసిన్లు లేవు, భేషజాలు లేవు అని కేసీఆర్ అంటేనే కదా ఈరోజు వాళ్ళు బనకచర్ల, రాయలసీమ ఎత్తిపోతల పథకాలు కడుతున్నది. తెలంగాణకు ద్రోహం చేసి మళ్లీ మీరే సిగ్గులేకుండా కాంగ్రెస్ మీద, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారు. మీకు దమ్ముంటే అసెంబ్లీలో పెట్టే చర్చలకు నువ్వు, మీ మామ కేసీఆర్ వచ్చి మీ వాదన చెప్పండని సవాల్ చేశారు. అప్పుడు ఎవరు ఏంటో తెలుస్తుందని అన్నారు. ప్రెస్‌మీట్లు పెట్టి కోడిగుడ్డు మీద ఈకలు పీకుదామని చూస్తే జనం నమ్మరంటూ పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వాదనలు కట్టిపెట్టాలని అన్నారు. బిఆర్ఎస్ నేతలు తమ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి పసలేని వాదనలు చేస్తున్నారని మహేశ్ కుమార్ అన్నారు.

## మీ కండక్టర్ ప్రాజెక్టులకు త్వరగా అనుమతి

మొదటిపేజీ తరువాయి

విలువైన రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. రీజినల్ రింగ్ రైలుతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరగడంతో పాటు- హైదరాబాద్ నగరంలోని ప్రధాన స్టేషన్లలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని కేంద్ర మంత్రికి వివరించారు. రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టుతో గ్రామీణ పేదరికం తగ్గడంతో పాటు- పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. దీంతోపాటు- కాజీపేటలో రైల్వే డివిజన్ ఏర్పాటు- చేసి, ప్రయాణికులకు వేగవంతమైన సేవలు అందించాలన్నారు. రీజినల్ రింగ్ రైలు ప్రాజెక్టు గ్రామీణ, పట్టణ ప్రాంతాల అనుసంధానాన్ని పెంచి, హైదరాబాద్‌లో రద్దీ తగ్గిస్తుందని సీఎం తెలిపారు. హైదరాబాద్ డ్రైపోర్టు నుంచి బందరు ఓడరేవుకు రైలు మార్గం మంజూరు చేయాలని కోరారు. ఈ మార్గం ఔషధాలు, ఎలక్ట్రానిక్స్, ఆహార ఉత్పత్తుల ఎగుమతులకు ఉపయోగపడుతుందని వివరించారు. ఇందులో భాగంగా వికారాబాద్ - కృష్ణా (122 కి.మీ. అంచనా వ్యయం రూ.2,677 కోట్లు-), కల్వకుర్తి - మాచర్ల (100 కి.మీ. అంచనా వ్యయం రూ.2 వేల కోట్లు-), డోర్నకల్ - గద్వాల (296 కి.మీ. అంచనా వ్యయం రూ.6,512 కోట్లు-), డోర్నకల్ - మిర్యాలగూడ (97 కి.మీ. అంచనా వ్యయం రూ.2,184 కోట్లు-) మార్గాలను వంద శాతం రైల్వే శాఖ వ్యయంతో మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఈ మార్గాలు రాష్ట్రంలో అనుసంధానత, పారిశ్రామిక, వ్యవసాయ ఎగుమతులకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు- ఐటీ- మంత్రి శ్రీధర్ బాబు, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఎంపీలు పోరిక బలరాం నాయక్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, రామ సహాయం రఘురామరెడ్డి, సురేశ్ షెట్కార్ కూడా హాజరయ్యారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి సంజయ్ కుమార్, ఆర్ అండ్ బీ కార్యదర్శి వికాస్ రాజ్, డాక్టర్ గౌరవ్ ఉప్పల్ కూడా ఈ భేటీలో ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణలో సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ పార్క్, రైల్వే ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చే విషయంలో సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు దోహదపడతాయని సీఎం అభిప్రాయపడ్డారు.

# వన మహోత్సవం లక్ష్యాలను పూర్తిగా సాధించాలి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, జూలై 17 : భావి తరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం-2025 కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను పూర్తిగా సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంతో పాటు అర్కెపెల్లి గ్రామంలోని మండల పరిషత్ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్ లతో కలిసి 2వేల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించడం బాధ్యతగా తీసుకోవాలని, జిల్లాకు కేటాయించిన వన మహోత్సవ లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల ఆవరణలలో, ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటాలన్నారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటశాల, పరిసరాలను పరిశీలించి, విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నాణ్యమైన విద్యాబోధన అందించాలని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలో నిర్మితమవుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి, త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, మూత్రశాలల నిర్మాణ పనులను పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, భోజనం నాణ్యతను పరిశీలించారు.



విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం మెనూ, విద్యాబోధన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల, వసతిగృహాలను సందర్శించి భోజనశాల, 8వ తరగతి గదులను సందర్శించి, మరమ్మత్తులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యను పెంపొందించాలని, బడి బయట ఉన్న పిల్లలు, మధ్యలో బడి మానివేసిన పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతను వివరించి పిల్లలు తిరిగి పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, ఆహారం తయారీ సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలని, వంట చేసే వారు శుభ్రత నిబంధనలు పాటించాలని, విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సౌకర్యాలను కల్పించడం జరిగిందని తెలిపారు. వర్షాకాలం కావడంతో పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఒప్పంద పద్ధతిన పోస్టుల భర్తీకి చర్యలు

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మంచిర్యాల, జూలై 17 : తెలంగాణ వైద్య విధాన పరిషత్ - జిల్లా ఆసుపత్రుల ప్రధాన కార్యాలయం పరిధిలోని ఆసుపత్రులలో ఒప్పంద సేవల పద్ధతిలో పోస్టులు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం ప్రకటనలో తెలిపారు. 9 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు (జనరల్ మెడిసిన్-2, గైనకాలజిస్ట్-2, అనస్తీషియాలజీ-2, జనరల్ సర్జరీ-1, పిడియాట్రిక్స్-2) పోస్టులు భర్తీ చేయడం జరుగుతుందని, ఎంబిబిఎస్ తో పాటు సంబంధిత స్పెషాలిటీలో డిగ్రీ / డిప్లొమా కలిగి ఉండి, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో నమోదు కాబడి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు జూలై 19న జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్-24లో గల జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకులు, ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్న వాక్-ఇన్-ఇంటర్వ్యూకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, నకలు ప్రతులతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు www.mancherial.telangana.gov.in వెబ్సైట్లో సంప్రదించాలని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



# తపాలా'లో నూతన సాంకేతికత

## - 22వ తేదీ నుంచి ఐటీ 2.0 అమలు

## - 19, 21వ తేదీల్లో సేవలకు అంతరాయం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జులై 17 : తపాలా శాఖ నిర్వహణలో మార్పులు తీసుకొస్తున్నారు. సురక్షితమైన సేవల కోసం అధునాతన సాంకేతిక విధానం అమలుకు రంగం సిద్ధం చేశారు. తపాలా శాఖ కార్యాలయాల ద్వారా సేవలన్నింటినీ ఒకే ఫ్లాట్ ఫామ్ తో అమలుకు నిర్ణయించిన నేపథ్యాన ఐటీ-2.0 పేరుతో నూతన సాఫ్ట్వేర్ రూపొందించారు. ఈ సాఫ్ట్వేర్ కార్యక లాపాల డేటా భద్రతను పెంచుతుందని చెబుతున్నారు. అలాగే, ఉద్యోగుల పని సామర్థ్యం పెరగడమే కాక సేవలు మెరుగవుతాయని భావిస్తున్నారు.

**తెలంగాణ సర్కిల్ అంతటా...**

ఐటీ-2.0ను ఈనెల 22వ తేదీ నుంచి తపాలా శాఖ తెలంగాణ సర్కిల్ వ్యాప్తంగా అమలు చేయనుంది. ఇప్పటికే కర్ణాటక రాష్ట్రంతో పాటు మన రాష్ట్రంలోని హైద రాబాద్, నల్లగొండ తపాలా డివిజన్లలో అమలు చేస్తున్నారు. ఈనెల 22 నుంచి తెలంగాణ సర్కిల్ అంతటా అమలుకు నిర్ణయించారు. సిర్పూర్ కాగజ్ నగర్ సబ్ డివిజన్ లో 09 సబ్ పోస్టాఫీసులు, 100 బ్రాంచ్ పోస్టాఫీసుల్లో ఐటీ-2.0 సేవలు అందుబాటులోకి రానుండగా, ఇప్పటికే ఉద్యోగులు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు.

**రెండు రోజులు సేవలకు బ్రేక్**

కొత్త సాంకేతిక విధానాన్ని ప్రవేశపెడుతున్న క్రమంలో ఈనెల 19, 21 తేదీల్లో తపాలా సేవలు నిలిపివేస్తున్నట్లు సిర్పూర్ కాగజ్నగర్ సబ్ డివిజనల్ తపాలా అధికారి సిరికొండ సతీష్ తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు, ఖాతాదారులు గమనించాలని కోరారు. ఆపై 22వ తేదీ నుంచి నూతన సాంకేతికత అమల్లోకి వస్తుందని తెలిపారు.

# రెండు పడక గదుల ఇండ్లలో పూర్తి స్థాయి వసతులు కల్పించాలి

## - జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూలై 17 : నిరుపేదల కొరకు ప్రభుత్వం చేపట్టిన రెండు పడక గదుల ఇండ్లలో పూర్తి స్థాయి వసతులు కల్పించి లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని కాగజ్ నగర్ పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా తో కలిసి విద్యుత్, రోడ్లు భవనాలు, హౌసింగ్, మిషన్ భగీరథ శాఖల అధికారులు, తహసిల్దార్ లతో కలిసి బోరి గాం శివారులో నిర్మించిన రెండు పడక గదుల ఇండ్లలో పూర్తి స్థాయిలో వసతులు కల్పించి మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధం చేసే అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెండు పడక గదుల ఇండ్లలో లబ్ధిదారులకు అవసరమైన వసతులను పూర్తి స్థాయిలో కల్పించాలని తెలిపారు. మొత్తం 12 బ్లాక్ లలో 228 రెండు పడక గదుల ఇండ్లను నిర్మించడం జరిగిందని, ఇంకా మిగిలిపోయిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సౌకర్యం, మిషన్ భగీరథ త్రాగునీరు, పెయింటింగ్, కిటికీలు, తలుపులు, అంతర్గత రహదారుల నిర్మాణాలు ఇతర అన్ని పనుల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. త్వరలో మంత్రుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించేందుకు ఇండ్లను సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్. ఈ. శేషరావు, హౌసింగ్ పి. డి. వేణుగోపాల్, మండల తహసిల్దార్ మధుకర్, రోడ్లు భవనాల శాఖ అధికారులు, గుత్తేదారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వసతులు, ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి

## - అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



నిర్మల్, జూలై 17 : అంగన్వాడీ కేంద్రాల్లో మెరుగైన వసతులు, ప్రాథమిక సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి అంగన్వాడీ కేంద్రం చిన్నారులకు అనుకూలమైన, శుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పూర్వ ప్రాథమిక విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని, పిల్లలు ఆనందంగా ఉండేలా కేంద్రాల్లో ఆకర్షణీయమైన పెయింటింగ్స్, ఆట బొమ్మలు ఉండేలా చూడాలని సూచించారు. సరైన లైటింగ్, నాణ్యమైన, రుచికరమైన ఆహారం, శుభ్రత, పచ్చదనం వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకోవాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని పిల్లలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీడీపీఓలు నాగమణి, నాగలక్ష్మి, సరిత, అంగన్వాడీల పర్యవేక్షకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు



# మురుగు నీటి కాలువలో చెత్త వేయద్దు

## - నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటీ (గోదావరిఖని) జూలై 17 : మురుగు నీటి కాలువల్లో చెత్త పడ వేయవద్దని రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకటస్వామి సూచించారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గురువారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గానగర్‌లో మురుగునీటి కాలువకు జాలీ ఏర్పాటు చేస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలే చెత్తను బయట రోడ్లు, కాలువలలో వేయకుండా స్వచ్ఛందంగా మునిసిపల్ వాహనాలకు అందించి సహకరిం చాలని కోరారు. అంతకుముందు ఫైవ్ ఇంక్‌లైన్, విఠల్‌నగర్, పరశురాం నగర్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వీర్లపల్లి, లక్ష్మీ పురం ప్రాంతాల్లో పిచ్చి చెట్లు, పొదలు తొలగించారు. సానిటరీ ఇన్స్‌పెక్టర్లు నాగభూషణం, కిరణ్, కుమారస్వామి, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్, ఎంఐఎస్ ఆపరేటర్ శ్రీకాంత్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



# ఆరోగ్యశ్రీ పథకంతో అనాథ పిల్లలకు రక్షణ

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, జూలై 17 : అనాథ పిల్లల రక్షణ, ఆరోగ్య సంరక్షణ కొరకు ఆరోగ్య పథకం వర్తింపజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం లోని కలెక్టర్ చాంబర్ జిల్లా మహిళ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సంక్షేమశాఖ అధికారి రౌఫ్ ఖాన్, బాలల సంరక్షణ సమితి అధికారి ఆనంద్ లతో కలిసి అనాథ పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలోని బాలల పరిరక్షణ సమితి పరిధిలోని బాలల సంరక్షణ కేంద్రాలలో ఆశ్రయం పొందుతూ సంరక్షణ, రక్షణ అవసరం ఉన్న అనాథ పిల్లలందరికీ ఆరోగ్య సేవలు ఉచితంగా అందాలనే ఉద్దేశ్యంతో ఆరోగ్యశ్రీ కార్డులు అందించడం జరిగిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సిఈఓ, వైద్యశాఖ సహకారంతో జిల్లా బాలల పరిరక్షణ విభాగం, జిల్లా సంక్షేమశాఖ సమన్వయంతో జిల్లాలోని 6 సంరక్షణ కేంద్రాలలో ఆశ్రయం పొందుతున్న 85 మంది అనాథ పిల్లలకు ఆరోగ్యశ్రీ కార్డులను అందించామన్నారు. ఈ కార్డుతో బాలలు రాష్ట్రంలో ఎక్కడైనా 10 లక్షల రూపాయల వరకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.





# జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పి చంద్రయ్య బాధ్యతల స్వీకరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మంచిర్యాల, జూలై 17 : జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా పి చంద్రయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. పి చంద్రయ్య గతంలో వికారాబాద్ జిల్లా రెవెన్యూ అధికారిగా పని చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ను జిల్లా పౌరసంబంధాల అధికారి యం కృష్ణమూర్తి మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.



# సింగరేణి పాఠశాల విద్యార్థులకు అధునాతన సౌకర్యాలు కల్పిస్తున్నాం

## - సెక్టార్-2 సింగరేణి పాఠశాలలో అదనపు గదుల ప్రారంభం - అర్జీ వన్ జి. ఎం. డి. లలిత్ కుమార్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్‌సిటి ( గోదావరిఖని), జూలై 17 : విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి సింగరేణి పాఠశాలలో అధునాతన సౌకర్యాలు కల్పించడానికి సింగరేణి సంస్థ కృషి చేస్తూ ఉందని అర్జీ వన్ జీఎం. డి. లలిత్ కుమార్ అన్నారు.సింగరేణి ఉన్నత పాఠశాల సెక్టార్-2 విద్యార్థులకు సింగరేణి స్కూల్ పక్కన ఉన్నటు వంటి సేవా భవన్ ను ఆధునికరించి హౌఅదనపు తరగతి గదులను నిర్మించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా హాజరైన ఆర్జీవన్ జిఎం డి.లలిత్ కుమార్ సేవా అధ్యక్షురాలు డి.అనిత లలిత్ కుమార్‌లు గురువారం రిబ్బన్ కత్తిరించి అదనపు తరగతి గదులను ప్రారంభించారు.ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ యన్. బలరామ్ సింగరేణి ప్రాంతాల్లో లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో మెరుగైన విద్య విధానాన్ని అందించుట కోసం పాఠశాలలను ఆధునికరించి అన్ని రకాల హంగులు, వసతులు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారని తెలిపారు.ఈ విధంగా ఆధునికరించి సేవా భవన్ బిల్డింగ్ లో గతంలో ప్రతి తరగతులలో ఎక్కువగా ఉన్న విద్యార్థులను సెక్షన్ లుగా విభజించడం హర్షించదగ్గ విషయం అని తెలిపారు. దీని ద్వారా పాఠశాలలో విద్యార్థులు మెరుగైన విద్య అందించుటకు ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. పాఠశాలకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా జి.ఎం. ప్రతి తరగతి గదిని పరిశీలించడం జరిగినది తరగతి గదులలో ఉన్న విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న విద్య గురించి తెలుసుకోవడం జరిగింది.



# ఘనంగా పోచమ్మ తల్లి బోనాలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెట్టిపేట, జూలై17 : లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని 11వ వార్డు గోదావరి రోడ్డు కాలనీ వాసులు గురువారం పోచమ్మ తల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకొని డప్పు చప్పుళ్లతో, డీజే పాటలతో ర్యాలీగా అమ్మవారి ఆలయానికి బయలుదేరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పాడిపంటలు బాగా పండాలని, ప్రజలంతా సుఖసంతో షాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూరం చెంద్రమౌళి,ముత్తే తిరుపతి, పోతరాజుల శ్రీనివాస్, గొల్లన నరేష్, కొట్టె సతీష్, దుమ్మని వంశీ,అగ్గు మల్లేష్,బైరి చంటి, మహిళలు, పాల్గొన్నారు.



# జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థినులను పరామర్శించిన కలెక్టర్ సత్యప్రసాద్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూలై 17 : జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఐదుగురు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారన్న విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించి పిల్లల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల ఆరోగ్యంపై డాక్టర్లతో మాట్లాడిన అనంతరం, చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ వారికి ఎలాంటి అపాయం లేదని, ఆరోగ్యంగా ఉన్నారని కలెక్టర్ తెలిపారు. పిల్లలు పూర్తిగా కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రమోద్ కుమార్, సూపరిండెంట్ డాక్టర్ కృష్ణమూర్తి, ఆర్ఎంఓ డాక్టర్ సుమన్ రావు తదితరులు ఉన్నారు

# విద్యార్థుల మొట్ట మొదటి ఆస్తి సైకిల్

- ప్రజాసంగ్రామ యాత్రలో పేదల కన్నీళ్లను చూసిన
- సైకిల్ పంపిణీ ఆలోచనకు కారణమిదే....
- తొలి ఆస్తిని నేను మీకు అందజేస్తున్నా
- సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోండి
- అంబేద్కర్, మోదీ స్ఫూర్తిగా రాణించండి
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- టెన్త్ విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేసిన కేంద్ర మంత్రి
- సైకిళ్లు అందుకున్న విద్యార్థుల్లో అవధుల్లేని ఆనందం








(ప్రజాలక్ష్యం బ్యూరో)

కరీంనగర్, జూలై 12 : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేయాలనే ఆలోచనకు కారణం ప్రజా సంగ్రామ యాత్రేనని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ప్రజా సంగ్రామ యాత్రలో కాళ్లకు చెప్పులు కూడా లేకుండా ఎంతో మంది పిల్లలు ఎండలో నడుస్తూ ప్రభుత్వ పాఠశాలలకు వెళుతున్న బాధాకరమైన దృశ్యాలను కళ్లారా చూశానని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకునే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుకునే విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గురువారం హుజూరాబాద్ ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే టెన్త్ విద్యార్థినీ, విద్యార్థులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ తన చేతుల మీదుగా సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి నిర్వహించిన సైకిల్ ర్యాలీలో బండి సంజయ్ పాల్గొని కాసేపు సైకిల్ తొక్కారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి బండి సంజయ్ తోపాటు జిల్లా అదనపు కలెక్టర్ తోపాటు విద్యాశాఖ అధికారులు, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతున్నంతసేపు సైకిళ్లు అందుకున్న బాలబాలికల ఆనందానికి అవధుల్లేవు. చప్పట్లు కొడుతూ నినాదాలు చేస్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... విద్యార్థుల మొట్ట మొదటి ఇష్టమై ఆస్తి సైకిల్. ఆ ఆస్తిని నేను మీకు అందజేస్తున్నా. ఇది ప్రియతమ ప్రధాని నరేంద్రమోదీ ఇస్తున్న గిఫ్ట్. సక్రమంగా వినియోగించుకోండి. ఓట్లేసి గెలిపించిన ప్రజల కోసం గొప్ప కార్యాన్ని చేయాలని ప్రధాని మోదీ పదేపదే స్ఫూర్తిదాయకమైన సందేశం ఇస్తుంటారు. అందులో భాగంగానే 'మోదీ గిఫ్ట్' పేరుతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ చదివే విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నానన్నారు. ఇప్పటికే కరీంనగర్, సిరిసిల్లలో సైకిళ్లను పంపిణీ చేశాం. ఈరోజు హుజూరాబాద్ లో పంపిణీ చేస్తున్నం. ఈ మూడు ప్రాంతాల్లో ప్రతి ఒక్క విద్యార్థికి సైకిల్ అందిన తరువాతే ఇతర నియోజకవర్గాల్లో పంపిణీ చేస్తాం. దాదాదాపు 20 వేలకుపైగా సైకిళ్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఇది నా సొంత ఆస్తి కాదు. ప్రభుత్వ నిధులు కాదు. కొన్ని సంస్థలు, దయార్థ్ర హృదయులు ఇచ్చిన సీఎస్సార్ ఫండ్ తో ఈ సైకిళ్లను కొనుగోలు చేసి పేద విద్యార్థులకు పంపిణీ చేస్తున్నానని చెప్పారు. నేను పేదరికం నుండి వచ్చిన. నాకు చిన్నప్పుడు సైకిల్ తొక్కాలనే కోరిక ఉండేది కాదు. కొనే స్థోమత లేకుండే. మా నాన్న పదేపదే అడిగితే 15 పైసలు ఇచ్చేవారు. ఆ పైసలతో గంట సేపు కిరాయికి సైకిల్ తీసుకుని తొక్కేవాడిని. నేను ప్రజా సంగ్రామ యాత్ర చేస్తున్న సమయంలో 1650 కి.మీల దూరం పాదయాత్ర చేసిన. పాలమూరులో యాత్ర చేస్తున్న సమయంలో ఓ ఊరికి వెళ్లి కూలీలను కలిసిన. ఆ పక్కనే ఉన్న గుడిసెను చూపి అది కూలిపోయే గుడిసె. ఆ ఇంట్లో ముసలమ్మ, ఓ మానసిక వికలాంగుడైన బాలుడు ఉన్నాడు. స్కూల్ కు వెళ్లడం లేదని అతనిని పిచ్చోడిగా ముద్ర వేశారు. కానీ ఆ బాబును చూస్తే చాలా యాక్టివ్ గా కన్పించిండు. అతనిని పిలిచి నువ్వు స్కూల్ కు పోవాలంటే ఏం చేయాలి? నీ ఫ్రెండ్స్ ఎవరు? అని అడిగిన. అప్పుడు సార్... నా ఫ్రెండ్స్ అందరి దగ్గర సైకిళ్లున్నాయి. నేను సైకిల్ తొక్కాలని వెళితే దగ్గరకు రానీయడం లేదు. అందుకే నాకు స్కూల్ కు వెళ్లాలన్పించడం లేదని చెప్పాడు. అంటే సైకిల్ ఇప్పిస్తే స్కూల్ కు వెళతావా? అని అడిగితే ఎగిరి గంతేసి వెళతానని చెప్పాడు. నేను వెంటనే సైకిల్ షాపుకు తీసుకుని సైకిల్ ఇప్పించా. అప్పటి నుండి ఆ అబ్బాయి రెగ్యులర్ గా స్కూల్ కు వెళుతున్నాడు. నా పాదయాత్రలో వేలాది మంది పిల్లలకు చెప్పులు కూడా లేకుండా ఎండలో తిరిగిన ద్రుశ్యాలు కన్పించినయ్. కొన్ని వేల మందికి చెప్పులు కొనిచ్చిన. ఇయాళ నేను ఎంపీగా గెలిచానంటే 50 శాతం పిల్లలే కారణం. వాళ్లే నాకు ఓట్లేయించి గెలిపించారని బండి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు స్కూల్ కు వెళ్లాలంటే ఇంటి నుండి చాలా దూరం నడిచి వెళ్తున్నారు. ఆటోలు, బస్సుల్లో వెళదామంటే పైసలుండవు. సొంతంగా బండి కొనే స్థోమత ఉండదు. ముఖ్యంగా టెన్త్ క్లాస్ పిల్లలకు స్పెషల్ క్లాస్ లు ఉంటాయి. దీంతో చాలా ఇబ్బంది పడుతున్న విషయాన్ని ద్రుష్టిలో ఉంచుకుని ఈ సైకిళ్ల పంపిణీని చేపట్టినం. ఈ సైకిళ్ల పంపిణీ సక్సెస్ ఫుల్ గా జరుగుతోంది. దేశవ్యాప్తంగా సానుకూల చర్చ జరుగుతోంది. విద్యపట్ల మోదీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్దిని వివరించాలి. యూపీఏ హయాంలో (2014 15 బడ్జెట్‌లో) విద్యా రంగానికి కేంద్రం 68 వేల 728కోట్లు మాత్రమే కేటాయిస్తే... ఈ ఒక్క ఏడాదే(2025 26) 1 లక్షా 28 వేల 650కోట్ల రూపాయలు కేటాయించింది. మోదీ 11 ఏళ్ల పాలనలో ఒక్క విద్యా రంగానికే దాదాపు 8లక్షల కోట్ల రూపాయలకుపైగా ఖర్చు చేశారు. మోదీ ప్రభుత్వం వచ్చాక విద్యా రంగంలో వచ్చిన మార్పులను ఒక్కసారి గమనించండి. భేటీ బచావో భేటీ పడావో, సమగ్ర శిక్షా అభియాన్ సహా కేంద్రం విద్య కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలను, నవోదయ, ఏకలవ్య, సైనిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నారు. మీరంతా కష్టపడి తలదించుకుని చదవండి. తల ఎత్తుకునేలా ఉన్నత స్థానానికి చేరుకోండి. పట్టుదల, క్రమశిక్షణ, లక్ష్యం ఉంటేనే సక్సెస్ అవుతారనే విషయాన్ని గుర్తుంచుకోండి. దీనికి బాబాసాహెబ్ అంబేద్కరే పెద్ద ఉదాహరణ. తినడానికి తిండిలేక పేదరికంలో ఉంటూ అంటరానివాడి అని హేళన చేసినా పట్టించుకోలే. అన్నీ దిగమింగుకుంటూ ఉన్నత చదువులు చదివి గొప్ప రాజ్యాంగాన్ని అందించి ఈ దేశ తలరాతనే మార్చేశారు. నరేంద్రమోదీ కూడా అంతే. పేదరికం నుండి వచ్చి చాయ్ అమ్ముకుంటూ ఎదిగిన నాయకుడు. ఈరోజు ప్రధాని అయ్యాక భారత్ ను ప్రపంచంలోనే నెంబర్ వన్ గా తీర్చిదిద్దేందుకు క్రుషి చేస్తున్నారు. త్వరలోనే ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్ కేజీ నుండి 6వ తరగతి వరకు 'మోదీ కిట్స్' ను పంపిణీ చేస్తాం. ఒక స్కూల్ బ్యాగ్ తోపాటు వాటర్ బాటిల్, పెన్ను, పెన్సిళ్లు, నోట్ పుస్తకాలు, రబ్బర్ ను 'మోదీ కిట్స్' పేరుతో అందిస్తా. తప్పనిసరిగా వినియోగించుకుని బాగా చదువుకుని రాణించాలని విద్యార్థులను కోరుతున్నానన్నారు.

## నేషనల్ జియోస్పేషియల్ ప్రాక్టీషనర్ అవార్డు, 'ఓపెన్ సోర్స్ జిఐఎస్ కోహార్ట్ అవార్డు'

## రెండు అవార్డులు అందుకున్న భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 17: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యంత్రాంగానికి ప్రతినిధిగా, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ గురువారం ఐఐటీ బాంబేలో నిర్వహించిన 'ఓపెన్ సోర్స్ జిఐఎస్ డే'లో 'నేషనల్ జియోస్పేషియల్ ప్రాక్టీషనర్ అవార్డు', ఓపెన్ సోర్స్ జిఐఎస్ కోహార్ట్ అవార్డు' లను అందుకున్నారు. ఈ అవార్డులను ఇస్రో మాజీ చైర్మన్ ఏ.ఎస్. కిరణ్ కుమార్ ప్రదానం చేశారు. భద్రాద్రి–కొత్తగూడెం జిల్లాలో గ్రామీణ సమస్యల పరిష్కారం కోసం చొరవ తీసుకుని, జియోస్పేషియల్ టెక్నాలజీ నిపుణులతో కలిసి భారతదేశంలో నిర్వహించిన మొట్టమొదటి 'ఓపెన్ సోర్స్ జిఐఎస్ సదస్సు' నిర్వహణకు గాను, అలాగే జిల్లాలోని వివిధ సమస్యలకు సంబంధించి ఓపెన్ సోర్స్ జియోస్పేషియల్ టెక్నాలజీ ద్వారా జిల్లా విద్యార్థులు, అధికారులు భాగస్వాములుగా పాల్గొని, జిల్లా సమస్యలను లోకల్ స్థాయిలో పరిష్కరించే విధంగా కృషి చేసినందుకు ఈ రెండు అవార్డులు లభించాయి. జిల్లా స్థాయిలో జిఐఎస్ ఆధారిత వ్యవస్థలను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి, గ్రామీణ సమస్యల పరిష్కారంలో జియోస్పేషియల్ టెక్నాలజీ వినియోగంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పినందుకు ఈ గుర్తింపు లభించింది. గోదావరి వరదల సమయంలో ఫ్లడ్ ప్రిడిక్షన్, గ్రామీణ స్థాయిలో జీ ఐ ఎస్ స్కిల్లింగ్, విభిన్న శాఖల డేటాను భౌగోళిక సమాచారంతో అనుసంధానం చేసి నిర్ణయాలు తీసుకునే విధానాలను జిల్లా యంత్రాంగం ముందుండి అమలు చేసింది. భారతదేశంలో మొట్టమొదటి "ఓపెన్ సోర్స్ జిఐఎస్ కోహార్ట్" ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేసి, ఐఐటీ ముంబయి ఫాసీ జిఐఎస్ సహకారంతో క్యూ జిఐఎస్ వినియోగాన్ని గ్రామీణ సమస్యల పరిష్కారానికి ప్రాక్టికల్‌గా నేర్పడంలో జిల్లా నేతృత్వం వహించింది. గోదావరి వరదల ముందు ముంపు గ్రామాల గుర్తింపు, పి.హెచ్.సి. పరిధిలో విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణ, పత్తి రైతులను మునగ సాగు వైపు మారుస్తూ రైతులను స్వయం సమృద్ధి వైపు నడిపించే ప్రయత్నాలు జిల్లాలో కొనసాగుతున్నాయి. అవార్డు అందుకున్న సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భౌగోళికంగా తెలంగాణ లో అతిపెద్ద జిల్లా అని, 37 శాతం గిరిజన జనాభాతో విస్తరించిన జిల్లా. గిరిజనుల విలువైన సంస్కృతి కలిసికట్టుగా అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లే మార్గాన్ని చూపిస్తోంద న్నారు. జిఐఎస్ సాయంతో పత్తి, మొక్కజొన్న పొలాలను మ్యాప్ చేసి, రైతులను మునగ సాగు వైపు మళ్లించే ప్రయత్నం మొదలుపెట్టామన్నారు. ఇది రైతులను ఆర్థికంగా స్వయం సమృద్ధిగా మార్చడానికి దోహదపడుతోంది. అలాగే, మేకల పెంపకం, మేకపాల ఉత్పత్తి పెంపుదలపై జిఐఎస్ ఆధారంగా పరిశీలనలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ వేదిక ద్వారా ఐఐటీ ముంబయి సాంకేతిక పరిజ్ఞానాన్ని జిల్లాకు తీసుకువచ్చి, రైతులు, విద్యార్థులు, అధికారులు అందరికీ ఉపయోగపడేలా చేస్తున్నామని, విద్యార్థులు ఐఐటీ ముంబయి సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం, పట్టణాభివృద్ధి, కమ్యూనికేషన్ విస్తరణలో దృష్టి పెట్టి ఉత్పాదకతను పెంచి జిల్లాకు ఆర్థిక వృద్ధిని తీసుకురాగలరని నమ్మకం ఉందిన్నారు. ఈ సందర్భంలో ఐఐటీ ముంబయి నిపుణులు, శాస్త్రవేత్తలు, వివిధ సంస్థలను భద్రాద్రి–కొత్తగూడెం జిల్లాకు ఆహ్వానిస్తున్నా నన్నారు. అన్ని విభాగాలను అనుసంధానించి అభివృద్ధి దిశగా కలిసి పనిచేయాలని కోరుకుంటున్నానన్నారు. ఈ రెండు అవార్డులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులందరికీ గర్వకారణమని, జిఐఎస్ ఆధారిత కార్యక్రమంలో కృషి చేసిన హెచ్పీహెచ్‌ఎఫ్ బృందానికి, అస్పిరేసనల్ బ్లాక్ ఫెలో నవనీతకు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అభినందనలు తెలిపారు. జిల్లా అభివృద్ధి దిశగా జిఐఏస్ ఆధారిత వ్యవస్థలను మరింత సమర్థవంతంగా విస్తరించేందుకు, ప్రజల అవసరాలకు అనుగుణంగా వాటిని అందుబాటులోకి తీసుకురావడానికి జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఫాసీ (జీఐస్), ఐఐటీ ముంబయి విద్యాశాఖ, భారత ప్రభుత్వం (ఎన్‌ఎంఈఐసీటీ ) ఆధ్వర్యంలో నిర్వహించిన 'నేషనల్ జియోస్పేషియల్ అవార్డ్స 2025 (ఎడిషన్ 02)' లో ఈ రెండు అవార్డులు లభించాయన్నారు. ఇవి 'నేషనల్ జియోస్పేషియల్ పాలసీ 2022', 'ఇండియన్ స్పేస్ పాలసీ 2023' కు అనుగుణంగా జియోస్పేషియల్ వినియోగాన్ని ప్రోత్సహించడానికి గుర్తింపుగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.

### సింగరేణిలో ఎన్నికల హామీలను గాలికొదిలేసిన

# గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు

### కార్మికుల హక్కులకంటే ఆర్థిక ప్రయోజనాలకే ప్రాముఖ్యత
### నాయకులను గనులపై నిలదీయాలని కామెర గట్టయ్య పిలుపు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

శ్రీరాంపూర్, జూలై 17:సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులను గనులపై నిలదీయాలని సింగరేణి కార్మికులకు తెలంగాణ సింగరేణి ఉద్యోగుల (టీ.ఎస్.యు.ఎస్) సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య పిలుపు ఇచ్చారు. గురువారం శ్రీరాంపూర్ నస్పూర్ కాలనీలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం బెల్లంపల్లి రీజినల్ సెక్రెటరి సమ్ము రాజయ్య ఆధ్వర్యంలో టీ.ఎస్.యు.ఎస్. కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు కామెర గట్టయ్య మాట్లాడుతూ సింగరేణిలో ఎన్నికలు జరిగి 18 నెలల కాలం గడుస్తున్నప్పటికీ ఎన్నికలలో గుర్తింపు పొందిన ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘమైన ఐఎన్టీయూసీ కార్మిక సంఘాలు ఎన్నికలలో పెద్ద పెద్ద మేనిఫెస్టోలలో కార్మిక సమస్యలు చేర్చి తమ సంఘాలకు ఓట్లు వేసి గెలిపించండి, మీకు ఇస్తున్న హామీలు తూ.చ. తప్పకుండా కంపెనీతో కొట్లాడి పోరాడి సమస్యలు పరిష్కరిస్తామని కార్మికుల ఓట్లు దండుకొని గెలుపొందారని ఆయన విమర్శించారు. ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ కార్మిక సంఘాల నాయకులు తమ ఆర్థిక ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నాయి తప్ప, కార్మికులకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా పరిష్కరింపబడలేదని ఆయన ఆరోపించారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మిక హక్కులు సాధించడంలో విఫలం చెందాయని ఆయన అన్నారు. కార్మికులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, ఎన్నికలకుముందు కార్మికుల ఇచ్చిన హామీల అమలకై కంపెనితో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు పోరాడాలని,

గత ఏడు సంవత్సరాల నుండి సింగరేణిలో పెండింగ్ ఉన్న మారు పేర్లు విజిలెన్స్ కేసులను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు 300 గజాల ఇంటి స్థలం పట్టణ ప్రాంతాలలో కేటాయించాలని, శారీరక శ్రమ మీద ఆధార పడి పనిచేస్తున్న బొగ్గు గని కార్మికులకు ఇన్కమ్ టాక్స్ రద్దు చేయాలని, బొగ్గు గనుల ప్రాంతంలో బొగ్గు ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సింగరేణిలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆయన అన్నారు. డిపెండెంట్ ఉద్యోగాల ఇన్ వ్యాలిడేషన్ విషయంలో కొనసాగుతున్న కుంభకోణంపై ధర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న ప్రతి కార్మికుల వారసునికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. బొగ్గు తవ్వే పనిని కూడా సింగరేణి సంస్థ నిర్వహించాలని, ఎట్టి పరిస్థితులలో ప్రవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించరాదన్నారు. సింగరేణిలో అక్రమంగా తొలగించిన డిస్మిస్ కార్మికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గనులను ప్రైవేటీకరణను ఆపి సింగరేణి, పబ్లిక్ రంగ సంస్థలను కొనసాగించాలని, కేంద్రం బొగ్గు గనులను బహిరంగంగా వేలం వేసే పద్ధతిని ఆపి తెలంగాణకే సింగరేణి సంస్థలను అప్పజెప్పాలని అయన డిమాండ్ చేశారు. 2024-2025 కంపెనీకి వచ్చిన లాభాల నుండి 40 శాతం వాటా లాభాలను కార్మికులకు పంచాలన్నారు.

సింగరేణి పరిరక్షణ కార్మిక హక్కుల కోసం ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించడం జరిగిందని, కలిసి వచ్చే కార్మిక సంఘాలను కలుపుకొని కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ నీరేటి రాజన్న, గోదావరిఖని రీజినల్ కార్యదర్శి ఎం.ఎఫ్.బేగు, పి.చంద్రశేఖర్, గుంపుల సారయ్య, తదితరులు పాల్గొన్నారు

# బనకచర్లపై తలోమాట చెప్పడం సరికాదు

- ఎజెండాలోని ఇతర అంశాలపై కేంద్రం నిపుణుల కమిటీని నియమించింది
- గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీతో కుమ్మక్కై కృష్ణా నీటిని తాకట్టు పెట్టింది
- జల వివాదాలపై ఇరు రాష్ట్రాల సీఎంల మీటింగ్ కేంద్ర తొలి విజయం
- జలవివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నదే కేంద్ర అభిమతం
- బీజేపీలో గ్రూపుల్లేవ్... ఉన్నదల్లా మోదీ గ్రూపే
- గ్రూపుల పేరుతో రాజకీయాలు చేస్తే టిక్కెట్లు ఇచ్చే ప్రసక్తే లేదు
- పార్టీ కోసం పనిచేయకుండా బండి సంజయ్ వర్గమని మాట్లాడినా టిక్కెట్లు రావు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో 24న సిట్ ముందు విచారణకు హాజరవుతున్నా
- కాళేశ్వరంలో ఏ స్థాయిలో అవినీతి జరిగిందో అధికారుల అక్రమాస్తులే నిదర్శనం
- కాళేశ్వరంలో కేసీఆర్ కుటుంబం భారీ ఎత్తున దోచుకుంది
- సైకిళ్ల పంపిణీ చాలా మంచి కార్యక్రమం
- టెన్త్ చదివే వాళ్లందరికీ సైకిళ్లను పంపిణీ చేస్తా
- హుజూరాబాద్‌లో గ్రూపు తగదాలు, కాళేశ్వరం, బనకచర్లపై
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్



(ప్రజాలక్ష్యం బ్యూరో)

కరీంనగర్, జూలై 12 : బనకచర్ల విషయంలో ఇరు రాష్ట్రాలు తలో మాట చెప్పడం ఏ మాత్రం సరికాదని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇరు రాష్ట్రాల మధ్య ఏళ్ల తరబడి నెలకొన్న జల వివాదాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించిందన్నారు. ఇరు రాష్ట్రాలు వేర్వేరు ఎజెండాలతో సమావేశానికి హాజరయ్యారని, అయినప్పటికీ ఆయా ఎజెండాలలోని అంశాలపై నిపుణులు, ఉన్నతాధికారులతో ఎక్స్ పర్ట్ కమిటీని నియమించిందన్నారు. కేంద్రం సాధించిన తొలి విజయమిది అని పేర్కొన్నారు. గురువారం హుజూరాబాద్‌లో సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన బండి సంజయ్ స్థానికంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, స్థానిక నేతలతో కలిసి మాట్లాడుతూ కేంద్రం ఈ విషయంలో పెద్దన్న పాత్ర పోషిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను పూర్తిగా స్వాగతిస్తున్నా. ఏళ్ల తరబడి రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాలున్నాయి. దీనిన బూచిగా చూపి కొన్ని రాజకీయ పార్టీలు రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నాయి. అందుకే ఈ వివాదాల పరిష్కారం కోసం కేంద్రం ఫెసిలిటేటర్ పాత్రను పోషించింది. నిన్న మీటింగ్ తరువాత రెండు రాష్ట్రాల సీఎం, మంత్రులు బనకచర్లపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయడం ఆశ్చర్యమేసింది. లోపలఏం జరిగిందో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు స్పష్టం చేయాలి. నిన్న కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. వాస్తవానికి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వేర్వేరుగా సొంత ఎజెండాతో మీటింగ్‌కు వెళ్లారు. కేంద్రానికి ఇరు రాష్ట్రాలూ సమానవే. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలనే ఉద్దేశంతోనే ఇరు రాష్ట్రాల సీఎంతో మీటింగ్ పెట్టింది. ఇది కేంద్రం సాధించిన విజయం. కేంద్రానికి సొంత ఎజెండా లేదు. ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించుకోవాలన్నదే కేంద్ర ఉద్దేశం. ఇరు రాష్ట్రాల ఎజెండాలను పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం ఏ రాష్ట్రానికి అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతో ఆయా ఎజెండాలలోని అంశాలపై ఉన్నతాధికారులు, నిపుణులతో కూడిన కమిటీని నియమించింది. ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు వెంటనే ఆ కమిటీ ముందు హాజరై ఆయా అంశాలపై అభ్యంతరాలను వ్యక్తం చేయాలని కోరుతున్నా. కేంద్రం ఇంత మంచి నిర్ణయం తీసుకున్నా కనీసం ఇరు రాష్ట్రాల సీఎంలు కనీసం క్రుతజత తెలపకపోవడం వారి విజతకే వదిలేస్తున్నానన్నారు. జల వివాదాలపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలు విడ్డూరం. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీలో నాటి ప్రభుత్వంతో కుమ్మక్కై కృష్ణా జలాలను ఏపీకి తాకట్టు పెట్టారు. ఈ ప్రభుత్వం కూడా అదే పంథాలో ఉన్నట్లుంది. అందుకే రెండు పార్టీలు కలిసి బనకచర్లపై లేనిపోని వివాదాలు సృష్టిస్తూ రాజకీయ లబ్ది పొందాలనుకుంటున్నాయి. ఈ రెండు పార్టీల పాలనవల్ల తెలంగాణ ప్రజలకు ఒనగూరిందేమీలేదని చెప్పారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో బీజేపీ స్టాండ్ చాలా క్లియర్‌గా ఉంది. 42 శాతం రిజర్వేషన్లను పూర్తిగా బీసీలకే అందజేస్తానంటే కేంద్రాన్ని ఒప్పించి బిల్లును ఆమోదించే బాధ్యతను మేం తీసుకుంటాం. అట్లా కాకుండా 42 శాతం రిజర్వేషన్లలో 10 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు ఇస్తానంటే ఒప్పుకునే ప్రసక్తే లేదు. బీసీల ముసుగులో తెలంగాణలో ముస్లింలందరికీ నూటికి నూరుశాతం రిజర్వేషన్లు అందించే కుట్ర జరుగుతోంది. రాష్ట్రంలో 51 శాతం బీసీ జనాభా ఉంది. అందులో 32 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఇస్తాననడం ఎంత వరకు కరెక్ట్? అందులోనూ మోదీ ప్రభుత్వం ఇప్పటికే 27 శాతం రిజర్వేషన్లను బీసీలకు అమలు చేస్తోంది. ఇక కాంగ్రెస్ బీసీలకు ఒనగూరిస్తోంది ఏమిటి? కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది. గతంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తేనే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీ స్థానాల్లో ముస్లింలు పోటీ చేసి బీసీల పొట్ట కొట్టారు. ఇక 10 శాతం రిజర్వేషన్లను ముస్లింలకు అమలు చేస్తే ఇక స్థానిక సంస్థల్లో బీసీలకు తీవ్రమైన అన్యాయం జరగబోతోంది. బీసీ సంఘాలు వీటిని గమనించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఇరిగేషన్ అధికా రుల అవినీతిని చూస్తే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఏసీబీ దాడుల్లో వందల కోట్లు పట్టుపడుతున్నాయి. కాళేశ్వరంలో అంచనాల పెంచి ఏ విధంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందో వీళ్లను చూస్తే అర్థమైతోంది. ఇవిగాకాకుండా డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్ సహా కేసీఆర్ కుటుంబంపై ఎన్నో అవినీతి కేసులున్నా... గత 19 నెలలుగా ఒక్కటంటే ఒక్క కేసు విషయంలోనూ కేసీఆర్ కుటుంబాన్ని దోషులుగా తేల్చలేకపోయింది. ఎందుకంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆడుతున్న డ్రామాలకు ఇది నిదర్శనం. రెండు పార్టీలు కుమక్కయ్యాయి. తక్షణమే కాళేశ్వరంసహా బీఆర్ఎస్ అవినీతి స్కాంలపై సీబీఐ విచారణ కోరితే జరిపేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. ఫోన్ ట్యాపింగ్ విషయంలో ఈనెల 24న విచారణకు రావాలని సిట్ పోలీసుల నుండి సమాచారం వచ్చింది. ఈనెల 24న విచారణకు హాజరవుతా. ఫోన్ ట్యాపింగ్ విషయంలో నాకు తెలిసిన వాస్తవాలన్నీ సిట్ ముందుంచుతా.

భారతీయ జనతా పార్టీలో ఏ గ్రూపు లేదు. ఉన్నదల్లా మోదీ గ్రూప్. బీజేపీ గ్రూప్. బీజేపీలో ఈ వర్గం ఆ వర్గమంటూ ఉండదు. జెండా కోసం, పార్టీ కోసం పనిచేయాలి. అంతే తప్ప వ్యక్తి కోసం పనిచేస్తే ప్రోత్సహించే ప్రసక్తే లేదు. బండి సంజయ్ వర్గమైనా సరే... ఇంకే వర్గమైనా సరే. ఉపేక్షించే ప్రసక్తే లేదు. టిక్కెట్లు ఇచ్చే ప్రసక్తే లేదు. అసలు బీజేపీలో వర్గాల ఊసే లేదు. ఎక్కడా లేనిదే ఇక్కడే ఫలానా వర్గమనే వాదనలు ఎందుకొస్తున్నయ్. ఇక్కడ నా పక్కన కూర్చున్న వాళ్లలో ఇంతకుముందు ఎవరితో ఉన్నారో మీకు తెలుసు? ఇప్పుడు వీళ్లంతా పార్టీలోనే ఉన్నారు కదా? అంతెందుకు ప్రతి గ్రామంలో ఏ వర్గం వాళ్లు వచ్చినా సంబంధం లేకుండా పార్టీ కోసం కష్టపడుతున్న వాళ్లను గుర్తించి వాళ్లకు ఎంపీ లాడ్స్, ఈజీఎస్ నిధులను అందిస్తున్నా. పార్టీ కోసం కష్టపడే వారిని గెలిపించే బాధ్యత మాపై ఉంది. అందుకే తెలంగాణలో అత్యధికంగా 219 కోట్ల రూపాయల సీఆర్ఐఎఫ్ నిధులను కరీంనగర్ పార్లమెంట్ కు తీసుకొచ్చి రోడ్లు వేయిస్తున్నా. ఈసారి మరో రూ.150 కోట్లదాకా సీఆర్ఐఎఫ్ నిధులు తీసుకురాబోతున్నా. అట్లాగే అడిగిన వాళ్లందరికీ బోర్లు వేయిస్తున్నా. అయితే కొందరు కావాలనే గిరిగీసుకుని ఫలానా వర్గమని మాట్లాడితే మాత్రం వాళ్లకు టిక్కెట్లు ఇచ్చే ప్రసక్తే లేదు. అది బండి సంజయ్ వర్గమైనా సరే. ఇకనైనా అట్లాంటి వర్గాలను పక్కనపెట్టి అందరూ కలిసి ఒకేతాటిపైకి రావాలి.

మీకు ఇంకో విషయం చెప్పాలే. పార్లమెంట్ ఎన్నికల్లో నేను 2.25 లక్షల మెజారిటీతో గెలిచానంటే దానికి కారణం కార్యకర్తలు పడ్డ కష్టమే. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వాళ్లకు టిక్కెట్లు ఇచ్చి గెలిపించుకునే బాధ్యత నేను తీసుకుంటా. అంతెందుకు జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి ఒకప్పుడు నాకు వ్యతిరేకంగా పనిచేశారు. కానీ విద్యార్థి దశ నుండే ఆయన కమిట్ మెంట్ ఏమిటో నాకు తెలిసి. అందుకే అధ్యక్ష పదవి ఇచ్చినం. దయచేసి ఇట్లాంటి వాటిని మీడియా కూడా ప్రోత్సహించొద్దనిమంత్రి సంజయ్ కోరారు.

## 24న విచారణకు రావాలని కోరుతూ

## కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి సిట్ నోటీసులు జారీ

- ఫోన్ ట్యాపింగ్ అంశాన్ని తొలిసారి తెరపైకి తీసుకొచ్చిందే బండి సంజయ్
- కేంద్ర మంత్రితోపాటు పీఆర్వో, పీఏలకూ నోటీసులు జారీ చేసిన సిట్ పోలీసులు
- హైదరాబాద్ లేక్ వ్యూ గెస్ట్‌హౌజ్‌లో స్టేట్ మెంట్ ఇచ్చేందుకు అంగీకరించిన బండి సంజయ్
- అదేరోజు పీఆర్వో, పీఏల స్టేట్ మెంట్‌ను రికార్డ్ చేయనున్న సిట్ పోలీసులు
- కేంద్ర మంత్రి నివాసానికి వచ్చి నోటీసులందించిన సిట్ అధికారులు

(ప్రజాలక్ష్యం బ్యూరో)

కరీంనగర్, జూలై 12 : ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం క్లైమాక్స్‌కు చేరింది. బీఆర్ఎస్ పాలనలో అనేక మంది ప్రముఖుల ఫోన్లు ట్యాప్ అయ్యాయనే అంశంపై విచారణ జరుపుతున్న స్పెషల్ ఇన్వెస్ట్ గేషన్ టీం (సిట్) అధికారులు ఇప్పటికే పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాజకీయ నాయకులు, ప్రముఖులను విచారణకు పిలిచి స్టేట్ రికార్డ్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తొలుత తెరపైకి తీసుకొచ్చిన నాటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ప్రస్తుత కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు సిట్ నోటీసులు జారీ చేసింది. బండి సంజయ్ తోపాటు ఆయన పీఆర్వో పసునూరు మధు, పీఏ బోయినిపల్లి ప్రవీణ్ రావు, మాజీ పీఏ పోగుల తిరుపతికి కూడా నోటీసులు అందజేసింది. ఈనెల 24న ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని పేర్కొంది. బండి సంజయ్ కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నందున ఆయన వద్దకే వచ్చి స్టేట్ మెంట్ ను రికార్డు చేయాలని పోలీసులు నిర్ణయించారు. అందులో భాగంగా బండిసంజయ్ సూచన మేరకు హైదరాబాద్‌లోని దిల్‌కుష్ ప్రభుత్వ అతిథి గృహంలో విచారణ జరపాలని పోలీసులు నిర్ణయించారు. బండి సంజయ్ తోపాటు పీఆర్వో పసునూరు మధు, పీఏ బోయినిపల్లి ప్రవీణ్ రావు, మాజీ పీఏ పోగుల తిరుపతి స్టేట్ మెంట్లను కూడా రికార్డు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు వీరంతా అదే రోజు విచారణకు సిద్ధంగా ఉండాలని పేర్కొంటూ సిట్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. మరోవైపు కొద్దిరోజుల క్రితమే బండి సంజయ్ వ్యక్తిగత డ్రైవర్ రమేశ్ ను సిట్ పోలీసులు విచారణకు పిలిచి స్టేట్ మెంట్ రికార్డు చేసుకున్న సంగతి విదితమే.

### ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని బయట పెట్టిందే బండి సంజయ్

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫోన్లను ట్యాప్ చేస్తున్నారంటూ మొట్టమొదటగా గళం విన్పించిన నేత బండి సంజయ్. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న సమ యంలో కేసీఆర్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బండి సంజయ్ అనేక ఉద్య మాలు, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహిస్తూ పాలకులకు కొరకరాని కొయ్యలా మారిన సంగతి విదితమే. ఈ నేపథ్యలో బండి సంజయ్ ను కట్టడి చేయాలని భావించిన నాటి ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు ఒడిగట్టింది. తనను నేరుగా ఎదుర్కొనే దమ్ములేక కేసీఆర్ ప్రభుత్వం తనతోపాటు తన కుటుంబ సభ్యుల, వ్యక్తిగత సిబ్బంది ఫోన్లను ట్యాపింగ్ చేస్తూ నీచానికి ఒడిగడుతోందని 2022లోనే బండి సంజయ్ సంచలన అరోపణలు చేసిన విషయం తెలిసిందే. తనతోపాటు నాటి పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డిసహా జడ్జీల, ప్రతిపక్ష పార్టీల నాయకుల, సినీ తారలతోపాటు బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఫోన్లను కూడా కేసీఆర్ ప్రభుత్వం ట్యాప్ చేస్తోందంటూ పలుమార్లు ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సమాచారం ద్వారానే టెన్త్ పేపర్ లీక్ అనే తప్పుడు కేసు బనాయించి అర్ధరాత్రి తన నివాసంపై దాడి చేసి అరెస్ట్ చేశారని బండి సంజయ్ పేర్కొన్న సంగతి తెలిసిందే. కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో 317 జీవోను సవరించాలంటూ చేపట్టిన దీక్ష జరగకుండా నిలువరించేందుకు పోలీసులు శతవిధాలా ప్రయత్నించి చివరకు టియర్ గ్యాస్ ఆఫీసు గేటు బద్దలు కొట్టి, ఆఫీస్ అద్దాలు ధ్వంసం చేసి బండి సంజయ్ ను, బీజేపీ శ్రేణులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. భార్యాభర్తలు పడక గదిలో మాట్లాడుకునే సంభాషణలను కూడా ట్యాప్ చేసి అనేక మంది జీవితాల్లో చిచ్చు పెట్టిన దుర్మార్గులు కేసీఆర్, కేటీఆర్ అంటూ బండి సంజయ్ అనేక సభల్లో, మీడియా వేదికల ద్వారా ఆరోపించిన విషయం అందరికీ తెలిసిందే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫోన్ ట్యాపింగ్ పై విచారణ చేపడుతున్న సిట్ పోలీస్ వర్గాలు నాడు బండి సంజయ్ చెప్పిందంతా నిజమేనని చెబుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం తన ప్రత్యర్థులతోపాటు జడ్జీల, సినీ తారల ఫోన్లను కూడా ట్యాప్ చేసిందని, చివరకు బీఆర్ఎస్ నేతల ఫోన్లు కూడా ట్యాప్‌కు గురయ్యాయని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి హెూదాలో బండి సంజయ్ ను ఈనెల 24న సిట్ విచారించడంతోపాటు ఆయన స్టేట్ మెంట్‌ను రికార్డ్ చేసేందుకు సిద్ధమైంది. మరోవైపు బండి సంజయ్ సైతం తన వద్ద ఉన్న సమాచారాన్ని సిట్ ముందుంచాలని భావిస్తున్నారు.





### విపత్తును ఎదుర్కోవడంలో

## "ఆపద మిత్ర" వాలంటీర్లు ముందుండాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

(ప్రజాలక్ష్యం బ్యూరో)

కరీంనగర్, జూలై 12 : ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడే విపత్తుల నుండి ప్రజలను రక్షించేందుకు ఆపద మిత్ర వాలంటీర్లు ముందుండాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. రెవెన్యూ శాఖ విపత్తుల నిర్వహణ విభాగం ఆధ్వర్యంలో 142 మంది డిగ్రీ విద్యార్థులు, ఎన్సిసి వాలంటీర్లకు బీసీ స్టడీ సర్కిల్లో 12 రోజులపాటు ఆపదమిత్ర శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆపదమిత్ర వాలంటీర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అవగాహన లేకపోవడం వల్ల నిత్యం ఎక్కడో ఒకచోట ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రమాదాలు ఎదుర్కునేందుకు గ్రామాల్లో, పట్టణాల్లో పనిచేసే ప్రభుత్వ రంగ ఉద్యోగులతో పాటు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వాలంటీర్లకు మొదటి విడతలో ఆపద మిత్ర శిక్షణ ఇచ్చామని తెలిపారు. రెండో విడతలో డిగ్రీ విద్యార్థులు, ఎన్సీసీ వాలంటీర్లు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారని అన్నారు. శిక్షణలో భాగంగా ఫైర్, పోలీస్, పంచాయతీరాజ్, వైద్యశాఖ, పశుసంవర్ధక శాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రతి విపత్తునూ ఎదుర్కొనే విధంగా శిక్షణ ఇచ్చామని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, పాము, కుక్క పాటు, అగ్నిప్రమాదం, సిపిఆర్, షాట్ సర్క్యూట్, వరదలు, రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ఆపదమిత్ర వాలంటీర్లు ముందుండి ప్రజల ప్రాణాలను రక్షించాలని అన్నారు. నైపుణ్యాలతో కూడిన ఆపదమిత్ర శిక్షణ వల్ల తమను రక్షించుకోవడంతో పాటు పది మంది ప్రాణాలు కాపాడగలరని పేర్కొన్నారు. శిక్షణకు హాజరైన వారు నేర్చుకున్న నైపుణ్యాలను, మెళకువలను మరో పదిమందికి నేర్పించాలని సూచించారు. ఆపద ఎప్పుడైనా రావచ్చని, ఆ ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. రానున్న రోజుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడంలోనూ ఆపద మిత్రులకు శిక్షణ ఇస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి ఎం.శ్రీనివాసరెడ్డి, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.



## ఫారెస్ట్ గ్రౌండ్‌ను ఇల్లెందు మున్సిపాలిటీకి అప్పగించండి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఇల్లెందు, జులై 17: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పట్టణంలోని ఫారెస్ట్ గ్రౌండ్‌ను మున్సిపల్ మేజిస్ట్రేట్ కోర్టు భవనాల నిర్మాణం కోసం కేటాయించడాన్ని రద్దు చేసి, ఆ స్థలాన్ని క్రీడా మైదానంగా మార్చి ఇల్లందు మున్సిపాలిటీకి అప్పగించాలని కోరుతూ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ గురువారం తెలంగాణ పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క)కు వినతిపత్రం అందజేశారు. ఇల్లందు మున్సిపల్ కోర్టుకు సమీపంలో ఉన్న ఫారెస్ట్ గ్రౌండ్‌ను గతంలో క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ట్రాక్ వంటి వివిధ క్రీడలలో శిక్షణ కోసం అథ్లెట్లు ఉపయోగించేవారని, దసరా జమ్మి పూజకు సాంప్రదాయకంగా ఉపయోగించే ప్రక్కనే ఉన్న జమ్మి మైదానాన్ని చర్చి నిర్మాణం కోసం సిఎస్ఐ చర్చిని నిర్మించారన్నారు. కొత్త కోర్టు భవనాల కోసం ఫారెస్ట్ గ్రౌండ్ కేటాయించ బడినప్పటికీ, అదనపు కోర్టును తర్వాత రద్దు చేశారని, ప్రస్తుతం ఉన్న కోర్టు భవనం సరిపోతుందని భావిస్తున్నట్లు ఆయన ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. కేటాయించిన క్రీడా మైదానం గత 4 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉందని, ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన, గిరిజనేతర నివాసితుల ప్రయోజనం కోసం ఫారెస్ట్ గ్రౌండ్‌ను క్రీడా మైదానంగా అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. ఇల్లందు పట్టణంలోని 8500 ఇండ్లకు 76 జీవో ద్వారా పట్టాలు ఇప్పించాలని, జెకె.5 ఓసి ప్రాంతాన్ని మున్సిపాలిటీకి అప్పగించాలని మంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏక్తా హౌస్ టీం సభ్యులు కోటగిరి రాజు, మునాఫ్, కిరణ్, అరుణ్, జానీ, సదానందం, గోపి, తదితరులు పాల్గొన్నారు.



# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

### - కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూలై 17: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ ఆధ్వర్యంలో గురువారం జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని మాచినపేట గ్రామంలో పోలీసులు కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాంను నిర్వహించారు.ఇందులో భాగంగా గ్రామంలోని ఇండ్లలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాలలో సుమారుగా 4 వేల రూపాయల విలువ గల గుడుంబాను, 15 వేల రూపాయల విలువ గల మద్యం బాటిళ్లను, 3 వేల 500 రూపాయల విలువ గల గుట్కాలను సీజ్ చేయడం జరిగిందని డిఎస్పీ వెల్లడించారు. సరిగ్గా పత్రాలు లేని 65 వాహనాలకు 8 వేల 900 రూపాయల జరిమానాను విధించదం జరిగిందన్నారు. అదేవిధంగా గంజాయి వంటి ప్రభుత్వం నిషేధిత పదార్థాలను కనుగొనడానికి నార్కోటిక్ డాగ్స్ ద్వారా సోదాలు నిర్వహించడం జరిగిందని అయన తెలిపారు. అనంతరం గ్రామస్తులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని అయన కోరారు. తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని అయన తెలిపారు. మట్కా,జూదం, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడమైనదని అయన తెలిపారు. ఇట్టి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సుమారుగా 100 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల పరిష్కారం కోసం 90 రోజుల మధ్యవర్తిత్వం డ్రైవ్

### - జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్.



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూలై 17: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడానికి జులై 1 నుండి సెప్టెంబర్ 30 వరకు 90 రోజుల పాటు మధ్యవర్తిత్వం డ్రైవ్ ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్, కార్యదర్శి ఎం.రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశం కోసం మీడియేషన్ అనే పేరుతో ఈ డ్రైవ్ ను నల్సార్, న్యూఢిల్లీ, సుప్రీంకోర్టు మీడియేషన్ అండ్ కన్సిలేషన్ ప్రాజెక్టు కమిటీ సంయుక్తంగా నిర్వహిస్తుందని వారు తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులకు డబ్బు, సమయం, సత్వర న్యాయ పరిష్కారం దొరుకుతుందని వారు తెలిపారు. ఈ మధ్యవర్తిత్వంలో వివాహ బంధానికి సంబంధించిన వివాదాలు, ప్రమాద క్లైమ్ లు, గృహహింస కేసులు, చెక్ బౌన్స్ కేసులు, సివిల్, క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, రుణ రికవరీ కేసులు మొదలైన కేసులను పరిష్కరించుకోవచ్చని వారు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

# గైర్హాజరు ఉద్యోగులకు అవగాహన సదస్సు

### తప్పనిసరిగా విధులకు హాజరుకావాలని సూచించిన జిఎం

(ప్రజాలక్ష్యం ప్రత్యేక ప్రతినిధి)




భూపాలపల్లి, జూలై 17: గైర్హాజర్ అవుతున్న ఉద్యోగులు విధులకు తప్పనిసరిగా హాజరుకావాలని, హాజరు అయ్యేలా వారి కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలని సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి కోరారు.గురువారం స్థానిక మైన్స్ రెస్క్యూ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్ లో భూపాలపల్లి ఏరియా గైర్హాజర్ ఉద్యోగుల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి, సింగరేణి సేవా సమితి అద్యక్షురాలు సునీత రాజేశ్వర్ రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. 2024 సంవత్సరానికి గాను 100 హాజర్ల కంటే తక్కువ, జూన్ 2025 వరకు 50 కంటే తక్కువ హాజర్లు చేసిన 148 మంది ఉద్యోగులను కౌన్సిలింగ్ కు పిలవగా, 33 మంది హాజరయ్యారు. హాజరైన కార్మికుల గైర్హాజరుకు గల కారణాలను తెలుసుకొని, వారికి సరైన సలహాలు, డ్యూటి చేయకపోవడం వలన జరిగే నష్టాలను గురించి క్షుణ్ణంగా కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు జిఎం వివరించారు. సింగరేణి యజమాన్యం ఇప్పుడున్న పరిస్థితులలో ఎలాంటి వారినైనా ఉపేక్షించకుండా డిస్మిస్ చేసే అవకాశాలు త్వరలో రాబోతున్నాయని, అందువల్ల ప్రతీ ఒక్కరూ సక్రమంగా డ్యూటీలు చేసుకోవాలని అయన ఉద్యోగులకు సూచించారు. అదేవిధంగా కార్మికులు వివరించిన కారణాలను, వారి అనారోగ్య కారణాలను డా.సురేష్ పరిశీలించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్ఓటూజిఎం ఎస్.కవీంద్ర, కేటికే వన్ గ్రూప్ ఏజెంట్ మాటూరి రవీందర్, ఏజిఎం (ఐఇ) ఎస్.జోతి, ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, ప్రాతినిధ్య సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షులు బి.మధుకర్ రెడ్డి, ఏరియా, అన్ని గనుల సంక్షేమ అధికారులు, కార్మికులు, సేవా సమితి సెక్రెటరీ లక్ష్మి పాల్గొన్నారు.

# విద్యార్థులలో దాగివున్న ప్రతిభా నైపుణ్యాలను వెలికితీయడానికి ప్రత్యేక శిక్షణ

### - క్రీడల్లో రాణించడానికి తగిన వాతావరణం కల్పిస్తాం

### - భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ/భద్రాచలం, జూలై 17: విద్యార్థులలో దాగివున్న ప్రతిభా నైపుణ్యాలను వెలికితీయడానికి అన్ని ఆశ్రమ పాఠశాలల్లో కొత్తగా వ్యాసరచన, ఉపన్యాసం పోటీలతోపాటు కుట్లు ,అల్లికలు, కరాటే తదితర అంశాలలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యాన్ని పెంపొందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. గురువారం పాల్వంచలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ ను క్రీడలను శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మతో కలిసి ఆయన ప్రారంభించారు. గురువారం పాల్వంచలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర ఆశ్రమ పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన టేబుల్ టెన్నిస్ ను క్రీడలను శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న ప్రతిభా నైపుణ్యాలను వెలికితీయడానికి అన్ని ఆశ్రమ పాఠశాలల్లో కొత్తగా వ్యాసరచన, ఉపన్యాసం పోటీలతోపాటు కుట్లు ,అల్లికలు, కరాటే తదితర అంశాలలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిలో నైపుణ్యాన్ని పెంపొందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గతంలో విద్యార్థులు మంచి మార్కులు సాధించడమే కష్టంగా ఉండేదని ప్రస్తుతం విద్యతో పాటు శారీరకంగా, మానసికంగా, దృఢత్వంతో పాటు నైపుణ్యాన్ని పెంపొందించేందుకు గాను ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలోని ఐదు ఆశ్రమ పాఠశాలలో హాకీ, హ్యాండ్ బాల్, బాల్ బ్యాట్మెంటన్ , రెజ్లింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ ఏడాది ఐదు ఆశ్రమ పాఠశాలలో టేబుల్ టెన్నిస్ కూడా ఏర్పాటు చేస్తున్నామని ఆయన అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని అనుకున్నది లక్ష్యం సాధించేవరకు శ్రమించాలని ఆయన అన్నారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం లేకుండా ఎప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని అలాగే వంట చేసే సిబ్బంది పరిశుభ్రతను పాటించి తాజా కూర గాయలతో విద్యార్థులకు సమయానుకూలంగా భోజనం అందించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఓ చంద్రమోహన్, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటనారాయణ, హెచ్ఎం భద్రం, వార్డెన్ పవన్, టిడిఐ గోపాల్ రావు, పిఈటి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అశ్వరావుపేట పట్టణాన్ని సుందరీకరిస్తాం

### - దొంతికుంట చెరువుకు రింగ్ బండ్ - ప్రణాళికలు సిద్ధం చేయండి

### - 'మార్నింగ్ వాక్' లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



భద్రాద్రి-కొత్తగూడెం, జూలై 17: అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట పట్టణాన్ని అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేసి, సుందరీకరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం ఉదయం అశ్వరావుపేట రింగ్ రోడ్ నుండి దొంతికుంట చెరువు వరకు అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, భద్రాచలం ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ తో కలసి మంత్రి 'మార్నింగ్ వాక్' చేశారు . ఈ కార్యక్రమంలో భాగంగా మంత్రి ప్రజలను పలకరిస్తూ వారికున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇటీవలగా మున్సిపాలిటీగా ఏర్పడిన అశ్వరావుపేట పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. దొంతికుంట చెరువు పరిసరాలలో ఎనిమిది మీటర్ల వెడల్పుతో రింగ్ బండ్ నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ ప్రాంతాన్ని ప్రజల కోసం విశ్రాంతి కేంద్రంగా అభివృద్ధి చేయాలని, వాకింగ్ ట్రాక్‌లు, పచ్చదనం కలిగిన పార్కులు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. అలాగే పట్టణంలోని రహదారుల వెంట చెత్త వెంటనే తొలగించేలా మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. పట్టణంలోని డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచేందుకు మురుగునీరు శుద్ధి చేసే ప్లాంట్ ఏర్పాటు, డ్రైనేజీ లైన్ల నిర్మాణం, విద్యుదీకరణ వంటి పనులు విడతల వారీగా చేపడతామన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో గిరిజన ప్రాంతమైన అశ్వరావుపేట నూతన మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు రహదారుల సుందరీకరణ, సెంట్రల్ లైటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. మంత్రి వెంట వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# బీఎస్ఎన్ఎల్ లీగల్ అడ్వైసర్ గా బాబూరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూలై 17 : బిఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ తెలంగాణ సర్కిల్ ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలలో న్యాయ సేవల నిమిత్తం భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది ఏపూరి బాబురావును బిఎస్ఎన్ఎల్ ఎంప్యానల్ మెంట్ న్యాయవాదిగా నియమించారు. ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్, నల్గొండ వారి ఆదేశాల మేరకు గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఏజీఎం) సుభాష్ ఏపూరి బాబురావుని గౌరవప్రదంగా కలిసి నియామక పత్రాన్ని అందజేసినారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజనల్ ఇంజనీర్ (ఎస్డీఈ) సక్రు, జూనియర్ టెలికాం ఆఫీసర్ (జేటీఓ) సందీప్, బిఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు శివరాంజి పాల్గొన్నారు.




# గరీంపేట అడవి ప్రాంతంలో విత్తనాలు చల్లిన ఎన్.సి.సి. విద్యార్థులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూలై 17: భద్రాద్రి కొత్తగూడెం పాత కొత్తగూడెం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆనందఖని పాత కొత్తగూడెంలోని ఎన్.సి.సి విద్యార్థులచే కలెక్టర్ ఆదేశానుసారం కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభుదయాల్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి పర్యవేక్షణలో పాఠశాల విద్యార్థులచే సేకరించబడిన విత్తనాలను తిరిగి అడివిలో చల్లే కార్యక్రమాన్ని గురువారం విజయవంతంగా ఎన్.సి.సి. విద్యార్థులు నిర్వహించారు. తెలంగాణ ఎన్.సి.సి. డైరెక్టర్ ఆదేశానుసారం "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమాన్ని గరీంపేట దగ్గరలోని అడవి ప్రాంతంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించే మహత్తర కార్యక్రమాన్ని కల్పించినందుకు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా విద్యాశాఖ అధికారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.సి.సి. ఆఫీసర్ బి.వీరు నాయక్, పాఠశాల ఉపాధ్యాయ బృందం బి.రమేష్, యన్ రమేష్, పుల్లారావు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

### - మంత్రి సీతక్కకు ఇఫ్టూ వినతి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఇల్లెందు, జూలై 17: గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి, కనీసవేతనం నెలకు 26వేల రూపాయలు ఇవ్వాలని కోరుతూ గురువారం ఇల్లెందుకు వచ్చిన పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు సీతక్కకు తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఇఫ్టూ) ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి డి.ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం గ్రామపంచాయతి కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనం నెలకు 26వేల రూపాయలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, ప్రతినెలా వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా ప్రధానకార్యదర్శి కొక్కు సారంగపాణి, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు తొగర సామెల్, సహాయకార్యదర్శి రామిశెట్టి నరసింహారావు, ఉపాధ్యక్షులు రామండ్ల మోహన్ రావు, ఎలక రాధాకృష్ణ, కార్మికులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com